జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 13

జులై 1-15, 2018



## యువతా మేలుకో... ఈ దేశాన్ని ఏలుకో !

YBI

Youth for Better India



# యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) రోడ్‌మ్యాప్

**Join & Participate:**

**www.youthforbetterindia.com**

**for better career**

**better life**

**with the best mentor**





# ఎఫ్‌డీఆర్ ఇంటెర్న్‌లతో అజేయ్ కల్లాం


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పలు కీలక బాధ్యతల్ని నిర్వహించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన అజేయ్ కల్లాం ఇటీవల హైదరాబాద్‌లోని ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) కార్యాలయాన్ని సందర్శించారు. పలు అంశాలపై ఎఫ్‌డీఆర్ పరిశోధనా బృందంతో ఇంటరాక్ట్ అయ్యారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటి చేయటానికి ఎదురవుతున్న సమస్యలు, లోసుగుల్ని తొలగించటంపై విలువైన సూచనల్ని ఇచ్చారు. 'ద వేకప్ కాల్' (మేలుకొలుపు) పేరుతో తాను ఇటీవల రాసిన పుస్తకంలోని అంశాలతో తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని జిల్లాల్లో నిర్వహించిన సమావేశాల గురించి, స్పందన గురించి వివరించారు. స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలని మెరుగుపరచటాన్ని కూడా వ్యవసాయ ఎజెండాకు కలిపి సమీకృతంగా కృషి చేస్తేనే రైతుల సంక్షోభానికి పరిష్కారం లభిస్తుందని ఈ సందర్భంగా ఎఫ్‌డీఆర్ ప్రధాన కార్యదర్శి డా॥ జేపీ అన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

జులై 1-15, 2018 సంపుటి - ౨ సంచిక - 13




## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) రోడ్‌మ్యాప్ ........................................ 5

భారత్‌కు మిగిలి ఉన్నది పదేళ్లే !.................. 29

తిలక్ లాంటి వారిని గెలిపించే మౌలిక మార్పుల కోసం యువత పోరాడాలి : జేపీ................. 30

కేశవరావ్ సామాజిక క్రియాశీలత ................32

దీక్షలాపి పాలనాదక్షత చూపండి బాబూ !...... 32

ఇది రైతుల, వినియోగదారుల విజయం..........32

యువత వెనకబడటం వల్లే పాలకుల ఆటలు సాగుతున్నాయి ...................................... 33

### సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# నేను సిద్ధం, మీరు సిద్ధమా యువతా?



**భా**రతదేశానికి గడచిన పాతికేళ్లు ఎంతో విలువైనవి. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో జరిగిన పొరబాట్లను సరిదిద్దుకుని అగ్రగామి దేశంగా తీర్చిదిద్దుకునే ఒక సువర్ణావకాశం భారత్‌కు పళ్లెంలో పెట్టినట్టు అందివచ్చిన కాలమిది. అందుకే ఈ రెండున్నర దశాబ్దాల కాలంలో జనహితం కోసం పనిచేయటాన్ని ఓ గొప్ప అవకాశంగా నేను భావిస్తాను. సన్నిహితులు వారిస్తున్నా వినకుండా, పెన్షన్ గురించి కూడా పట్టించుకోకుండా ఐఏఎస్‌కు రాజీనామా చేసి నేను 1996లో ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్)ను స్థాపించటానికి, ఆ తర్వాత 1997లో లోక్‌సత్తా ఉద్యమ సంస్థను ప్రారంభించటానికి, 2006లో లోక్‌సత్తా పార్టీని ప్రారంభించటానికి కారణం.. ఈ సమయానికున్న అపారమైన ప్రాధాన్యతను ఏమాత్రం పొరబడకుండా గుర్తించటమే! దేశ జనాభాలో యువత సంఖ్య అత్యధిక స్థాయికి పెరుగుతుండటం, అత్యాధునిక సాంకేతిక సమాచార వ్యవస్థ అందుబాటులోకి వస్తుండటమే 1995 తర్వాతి కాలాన్ని భారతదేశపు సువర్ణావకాశంగా మలచింది. అయితే గత 22 ఏళ్లుగా నిద్రాహారాలు మాని కష్టపడినా, మిగతావారితో పోలిస్తే ఎంతో సాధించినా.. సాధించాల్సింది ఇంకా చాలా మిగిలివుందని చెప్పటానికి కొంత బాధగానే ఉంది. 'పొలిటికల్ పాత్'గా పార్టీ పెట్టి చేసిన ప్రయత్నం ఆశించిన స్థాయిలో నిలకడగా 10-15 శాతం ఓట్లను అందించకపోవటంతో సాంప్రదాయ రాజకీయ పార్టీల మీద ఒత్తిడి తేలేకపోయాం. దీంతో తాత్కాలికంగా కొంత వెనక్కు తగ్గాల్సి వచ్చింది. 2009లో కూకట్‌పల్లిలో నేను గెలిచినా.. ఈ సంకేతాలను ఆ ఎన్నికల్లోనే స్పష్టంగా గుర్తించాను. అందుకే, అసెంబ్లీ తొలి ప్రసంగాల్లోనే 'భారత్‌లో మార్పునకు ఉన్న అవకాశాలు (విండో ఆఫ్ ఆపర్చునిటీ) నానాటికీ కుదించుకుపోతున్నాయని' చెప్పాల్సి వచ్చింది. లోపం లోక్‌సత్తాది కాకపోయినా, పరిస్థితుల వల్ల అయినా కూడా.. లోక్‌సత్తా కాడి పారేయటం లేదు. కాలపరీక్షకు నిలచిన ఒక అజరామర భావజాలాన్ని అందించిన సంస్థగా, ముందుకొచ్చిన ప్రతి ఒక్కరికీ పనిచేసే అవకాశాన్ని అందిస్తున్న వేదికగా- ఈ వైఫల్యాన్ని అధిగమించేందుకు కొత్త మార్గాల్ని చూపించే ప్రయత్నాన్ని లోక్‌సత్తా చేస్తోంది. మన లక్ష్యం సరైనదైనప్పుడు, దాని పట్ల మనకు అచంచలమైన విశ్వాసం తర్కబద్ధంగా ఉన్నప్పుడు.. మరో మార్గంలో- అదీ విఫలమైతే ఇంకో మార్గంలో ప్రయత్నిస్తుండటమే సరైన కార్యాచరణ! అందుకే పార్టీ రాజకీయాలకతీతంగా యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) ద్వారా యువతకు శిక్షణనిస్తూ నాయకులుగా తీర్చిదిద్దటం కోసం కార్యక్రమాల్ని చేపట్టాం. సురాజ్య యాత్ర కూడా ఇందులో భాగమే. ఒకరకంగా ఇది లోక్‌సత్తా ప్రాతిపదికల్ని, ఎజెండాను జనరేషన్ నెక్ట్స్‌కి ట్రాన్స్‌ఫర్ చేయటం. యువతీయువకులు ముందుకొస్తే.. లోక్‌సత్తా పార్టీలో 90శాతానికిపైగా పదవుల్ని, టికెట్లను వారికే కేటాయిస్తామని పార్టీ పెట్టిన తొలి సంవత్సరంలోనే పలు వేదికల మీద ప్రకటించాను. ఉద్యమంగా, పార్టీగా లోక్‌సత్తా ద్వారా దాదాపు రెండు లక్షల మందికి లోతైన అంశాలపై శిక్షణను అందించాం. కానీ అది చాలదు. కోట్ల సంఖ్యలో వస్తున్న మిలీనియల్స్, జనరేషన్ జెడ్‌లో ఇంకా చాలామంది యువతకు సామాజిక నాయకత్వ లక్షణాలు అలవడాలి. దేశంలో సరైన మార్పుకి ఏ అంశాలు, ఏ విధానాలు కావాలో వారికి తెలియాలి. వాటిని సాధించుకునేందుకు వారు పాలనను, రాజకీయాన్ని ప్రభావితం చేస్తుండాలి (దేశంలో ఇప్పుడు మంచి మార్పులొస్తే పాత తరంవారి కన్నా యువతకే ఎక్కువ లాభం). ఈ మొత్తం కూడా వేగంగా జరగాలి. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారటానికి ఇంకా పదేళ్లు మాత్రమే సమయం మిగిలివుందని, ఈలోగా మార్పు రాకపోతే ఇక అంతేనని, యువ జనాభా ప్రయోజనం కాస్తా యువభారంగా మారుతుందని ఇటీవల ఒక బ్యాంకింగ్ సంస్థ చేసిన అధ్యయనం కూడా హెచ్చరిస్తోంది. అందుకే సాంకేతికతను ఉపయోగించుకుంటూ ఉన్న వనరుల మధ్యే యూత్ ఫర్ బెటర్ ఇండియా లక్ష్యసాధన చాలా పకడ్బందీగా, వేగంగా జరగాల్సుంది. ప్రతి రోజునూ, ప్రతి కార్యక్రమాన్నీ విలువైనదిగా భావించాలి. ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ, వ్యక్తిగత జీవితాల్ని బ్యాలెన్స్ చేసుకుంటూ పనితీరును మెరుగుపరచుకుంటుండాలి. వైబీఐ గురించి, లక్ష్యాల గురించి ఒక ఫ్రేమ్‌వర్క్‌లా ప్రాథమిక అవగాహన కలిగించేందుకు కొన్ని అంశాల్ని లోక్‌సత్తా టైమ్స్ ఈ సంచికలో కవర్ స్టోరీగా అందిస్తున్నాం. ఇది కేవలం యూత్‌కే కాకుండా, సమాజహితం కోరే నలభై పైబడిన పౌరులకు కూడా ఉపయోగపడుతుంది. సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా సేవల్ని ఉపయోగించుకోవటం వల్ల వైబీఐ వారు కూడా అవరోధాలు లేకుండా త్వరగా తమ లక్ష్యాలను చేరుకోగలుగుతారు. ఈ సంచికలోని 'వైబీఐ రోడ్‌మ్యాప్'ని మరింత మెరుగుపరిచి హ్యాండీగా ఉండే బుక్‌లెట్‌గా కూడా అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. యువత పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. ముడుచుకుపోయిన బతుకుల్ని దాటి ఎదగాలనుకుంటే, భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనుకుంటే.. ఎక్కువ సమయంలేదని మాత్రం మర్చిపోవద్దు. వైబీఐకి మెంటార్‌గా నేను రెడీ, ఉపయోగించుకోవటానికి మీరు రెడీయా యువతా? -

# యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) రోడ్‌మ్యాప్

## 1. నేనెందుకు వైబీఐలో చేరాలి?

హాయ్, అయాం జనరేషన్ జెడ్!

ఎగ్జాక్ట్‌గా చెప్పాలంటే.. జనరేషన్ జెడ్–మిలీనియల్ జనరేషన్ మధ్య జంక్షన్లో పుట్టాను.

అందుకే రెండు అత్యాధునిక తరాల్లోనూ నాకు ఫ్రెండ్స్ ఉన్నారు.


అంటే, కాస్త అటూఇటుగా.. మేమంతా 1990–2000 సంవత్సరాల మధ్య పుట్టిన యువశక్తి!

దేశంలో మా జనాభానే ఎక్కువ కాబట్టి.. భారత్‌ను యువభారత్‌గా, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన మానవ వనరులున్న దేశంగా మార్చిన ఘనతను సొంతం చేసుకున్నాం.

గ్రామీణ ప్రాంతం నుంచే వచ్చినా.. తల్లిదండ్రుల తపన వల్ల నేను కాస్త డిమాండ్ ఉన్న ప్రొఫెషనల్ కోర్సులోనే చదువుకుంటున్నాను. కాలేజీ కూడా పేరున్నదే. కాబట్టి.. మంచి ప్యాకేజీతో జాబ్ గ్యారంటీ అనుకోవచ్చు.

ప్రభుత్వోద్యోగం రాకపోయినా, ప్రైవేటు లోనైనా సాఫీగా బండి నడిపించుకోగలననే ధైర్యం నాకుంది.

కానీ ఏదో అశాంతి, అసంతృప్తి, ఆందోళన!




చుట్టూ ఊరించే మెరుపుల్ని, అరచేతిలో అడక్కుండానే అందుబాటులోకొస్తున్న ప్రపంచాన్ని చూస్తే.. నేనింకా ఎంతో ఎంతో సంపాదిస్తేగానీ ఆ లైఫ్‌ని అందుకోలేననిపిస్తుంది.

అయితే.. నా ఫ్రెండ్స్‌లో, చిన్నప్పటి సహచరుల్లో చాలామంది నాకంటే వెనకబడి ఉన్నారు. కాస్త కాలర్ సవరించుకోగల మంచి ఉద్యోగమో, ఉపాధో వారికి లభిస్తుందో లేదో కూడా తెలీని అయోమయ పరిస్థితులున్నాయి. 'వాట్ నెక్స్ట్?' అని వాళ్లు అనుకోవటం నేను ఎన్నిసార్లు వినలేదు! పైకి నవ్వుతున్నా, లోపల కుమిలిపోతుండేవారు.

స్నేహితుల్లోని సీనియర్లలో కొద్దిమంది బాగానే సంపాదిస్తున్నారు, అయినా విచిత్రంగా వారిలో కూడా ఏదో అశాంతి. మనసు విప్పి చెప్పుకోలేని నిరంతర టెన్షన్.

విదేశాల్లో సెటిలై పోగేసుకున్న కొంతమంది కూడా.. అక్కడ ఇమడలేక, ఇక్కడికి తిరిగి రాలేక సతమతమవుతున్నారు.

ఇదంతా రీలులా కళ్ల ముందు తిరగటం ఈ మధ్య మరీ ఎక్కువైంది.

ఎక్కడో ఏదో తేడా.. ఏంటో ఫిక్స్ చేయలేకపోతున్నాను!

స్మార్ట్ ఫోన్ వ్యూలు, సోషల్ మీడియా చతుర్లు, ఐమ్యాక్స్ మూవీలు, వీకెండ్ సరదాలు.. ఏవీ నాకు స్వాంతన ఇవ్వలేకపోతున్నాయి. ఒకరకంగా నా అసంతృప్తుల నుంచి తప్పించుకోవటానికి వాటిల్లో తలదాచుకుంటున్నాను. ఉపశమనాలుగా వాటిని వాడుకుంటున్నాను.

కొంతకాలం క్రితం కాలేజీకి వచ్చిన ఓ వ్యక్తిత్వ వికాస నిపుణుడి స్పీచ్ నాకెంతో ఊరటనిచ్చింది. ఏదో నేను కోరుకుంటున్నది చేతికి అందినట్టనిపించింది. కెరీర్‌లో పెద్ద గోల్‌ను ఏర్పరచుకోవటం, ఎచీవ్ చేయటం ఎలాగో ఆయన చాలా గొప్పగా

వివరించారు. కొన్ని రోజుల పాటు సమస్య తీరినట్టనిపించింది. ఇక పరిష్కారం వచ్చేసింది అనుకుంటూ.. కెరీర్ మీద దృష్టి సారించాను. కానీ ఒక మంచి ఉద్యోగంలో సెటిల్ అవుతానని తెలుస్తున్నా, నాలో మళ్లీ ఎందుకో అశాంతి. ఏదో నెగెటివ్ అభద్రత.

వ్యక్తిత్వ వికాస నిపుణుడు చెప్పిన సక్సెస్ మంత్రాలతో పెద్ద విజయాలు సాధించినవాళ్లలో కూడా అనేకమంది అసంపూర్ణ జీవితాల్నే గడుపుతున్నారని మనసు కొట్టి చెబుతోంది. కెరీర్, గోల్, సాధించటం.. ఇవన్నీ అవసరమే. కానీ ఆ రకమైన సక్సెస్‌లకే పరిమితమైన వ్యక్తిత్వ వికాసం చాలదని అర్థమవుతోంది. ఈ వ్యక్తిగత విజయాలకు తోడుగా ఏదో మరో అంశం ఉండాలని గుర్తించాను. ఆ కాంబినేషన్ ఏమిటో, దాన్నెలా సాధించాలో మాత్రం స్పష్టత లేదు.

కెరీర్ వ్యక్తిత్వ వికాస నిపుణులను మించిన పరిణతి గల మెంటార్‌లు ఎవరైనా ఉంటారేమోనని ఆలోచన కలిగినా.. నిజం చెప్పొద్దూ.. అందుకోసం నేనేమీ వెదకలేదు. కొంతమంది సినిమా హీరోలు, రాజకీయ ప్రముఖులు వెళ్లటం చూసి– హిమాలయాల్లోనే అటువంటి వాళ్లు ఉంటారేమో అనుకున్న రోజులు కూడా అన్నాయి. అయితే, వారిని వెతికే సమయం కూడా నాకు లేదన్న ఫీలింగ్.. నన్ను ఆత్మవంచన భావన నుంచి కాపాడింది.

అనుకోకుండా ఒక పెద్దాయనను మా ఫ్రెండ్ వాళ్ల ఇంటికెళ్లినప్పుడు కలుసుకోవటం జరిగింది.

తెల్లజుట్టును, ముడతలను, ముసలితనాన్ని బలహీనతకు చిహ్నంగా భావించే నాకు.. ఆయనలోని చెరగని ఉత్సాహం, చిరునవ్వు ఎంతో అసూయను కలిగించాయి. ఒకరోజు పనిగట్టుకుని మా ఫ్రెండ్‌తో కలిసి పక్కనే ఉన్న ఆయనింటికెళ్లి పలకరించాను.

వయసు మీరటాన్ని ఓ బలహీనతలా కాకుండా.. ఓ గొప్ప సదవకాశంగా ఆయన భావిస్తున్నారు. యువకులుగా మేమంతా ఎంతో ఆశపడుతున్న ఆనందాన్ని ముసలి వయసులో మాకంటే అనేకరెట్లు ఎక్కువ పొందుతూ, 'ఒకప్పుడు నేనూ కుర్రాడ్నే' అని గుర్తుచేస్తున్నట్టు హ్యాపియెస్ట్‌గా ఉన్నారాయన.

కాసేపు మాట్లాడాక.. మా అమ్మానాన్నలకు, బంధువులకు, లెక్చరర్లకు, సీనియర్లకు ఎవరికీ సాధ్యంకాని ఆ హ్యాపీలైఫ్ ఈయనొక్కడికి ఎలా సాధ్యమైంది? అన్న ప్రశ్నే నా మెదడులో తిరుగుతోంది. ఆయనకంటే టెక్నాలజీలో, ఇతర అనేక విషయాల్లో మా జనరేషన్ నెక్స్ట్ షార్ప్ అని స్పష్టంగానే అర్థమవుతోంది. కానీ మాకు అన్ని తెలివితేటలున్నా.. మాకంటే ఆయన సంతోషంగా ఉండటం వెనక రహస్యమేమిటో మాత్రం అర్థం కావటం లేదు. ఏమిటి ఇతని గొప్ప? అనుకునేలోగానే.. 'ఈ వ్యక్తి గనక మాతరంలో పుట్టి ఉంటే మాకంటే అనేకరెట్లు..' అన్న ఊహ మెదిలింది. దీంతో, నా ఇగో ఒక్కసారిగా డౌనైపోయింది. రూటు మార్చుకున్నాను. ఫాల్స్ ఇగో స్థానంలోకి నేర్చుకోవాలన్న జిజ్ఞాస ప్రవేశించింది.

నాకున్న తెలివితేటలన్నిటినీ ఉపయోగించి ఒక విషయాన్ని మాత్రం క్లియర్‌గా అర్థం చేసుకున్నాను– మేమంతా కేవలం మా వ్యక్తిగత సుఖాలు, ఎదుగుదల చుట్టూనే కష్టపడుతుంటే, ఆయన మాత్రం తన ఎదుగుదలతో పాటు చుట్టూ ఉన్న సమాజానికి కూడా ఎంతో కొంత మంచి చేయటానికి ప్రయత్నిస్తున్నాడు. దీనివల్లే– అంత తేడా కనిపిస్తోందా?.. ఈ ప్రశ్న ఆయన్నే అడిగేశాను.

ఆయన చాలా అభినందనీయంగా నా వంక చూశారు, భుజం తట్టారు. "మా తరం కంటే మీ తరం చాలా వేగంగా విషయాల్ని గ్రహిస్తోంది. మీతరంలోని వారికి ఉత్సుకత, ఆత్మవిశ్వాసం ఉంటే నీలాగా ప్రశ్నిస్తారు, ఆలోచించటం మొదలుపెడతారు" అన్నారు. కాసేపాగి.. "నీ ఊహ కరెక్టే. నా సుఖాన్ని, సమాజ హితాన్ని సంధానం చేయటమే నా సంతోష రహస్యం" అని చెప్పారు.

సెబ్బాస్‌రోయ్.. అని నన్ను నేను అభినందించుకునేలోపే మళ్లీ ఓ సందేహం ప్రవేశించింది. "మా అమ్మానాన్న కూడా సమాజం కోసం కొన్ని మంచిపనులు చేస్తుంటారు. దేవుడికి పూజలు చేస్తుంటారు, పండుగలప్పుడు దానాలు చేస్తుంటారు, గుళ్లలో అన్నదానం చేస్తుంటారు, బంధువులకు సాయం చేస్తుంటారు, ఎవరైనా కష్టంలో ఉంటే కొంత డబ్బు సాయం చేస్తుంటారు.. అంతెందుకు తాను కూడా ఫ్రెండ్స్‌కి అప్పుడప్పుడు డబ్బులిచ్చాడు. గుడి వద్ద యాచకులకు దానం చేశాడు, కొన్ని చారిటబుల్ ట్రస్టులకు డబ్బు ఇస్తుంటాడు, పేద పిల్లలకు పుస్తకాలు ఇస్తుంటాడు. ఇది సమాజహితం కాదా?"

నా ప్రశ్నకు ఆయన ఫుల్ మార్క్స్ ఇవ్వదగిన సమాధానం చెప్పారు.

నీకు రోల్‌మోడల్‌లాంటి కొన్ని పేర్లు చెప్పు అనడిగారు. జుకర్‌బర్గ్, బిల్‌గేట్స్.. అంటూ జాబితాను పెంచబోయాను. ఈలోగానే అందుకుని, "బిల్‌గేట్స్ గత తరాల్లో ఎవరూ ఊహించనంత డబ్బును సంపాదించారు. కానీ చివరికి ఏం చేస్తున్నారు? ఆ డబ్బులో చాలా భాగాన్ని సమాజానికి పంచేస్తున్నారు. అంటే సమాజం బాగుండటమే, అందులో మనముండటమే అంతిమమైన,

అత్యుత్తమమైన విజయమన్నమాట. అలాగే జుకర్‌బర్గ్. నీకు బాగా తెలుసో లేదో.. ఇక్కడే ఇంకో పేరు చెబుతాను. ఆయనే వారెన్ బఫెట్.

*"బఫెట్ స్టాక్‌మార్కెట్లో పెట్టుబడులతో దాదాపు బిల్‌గేట్స్‌తో సమానంగా సంపాదించారు. కానీ తన సంపాదనలో ఓ పదివేలో వంతుని మాత్రమే తనకు అట్టిపెట్టుకుని మిగిలినదంతా సమాజానికి ఇచ్చేశారు. అది కూడా తన పేరు చూసుకోకుండా. బిల్‌గేట్స్ అనే ఆయన తన పేరు మీద పెట్టుకున్న ఫౌండేషన్ బాగా పనిచేస్తోంది కాబట్టి.. మళ్లీ తను ఇంకో ఫౌండేషన్‌ని పెట్టటం ఎందుకు అనుకుని, తన సంపాదనలో అత్యధిక మొత్తాన్ని గేట్స్ ఫౌండేషన్‌కి బఫెట్ ఇచ్చేశారు. ఇప్పుడు మనదేశం నుంచి కూడా కొందరు నాలెడ్జియుగ సంపన్నులు అలా గేట్స్ ఫౌండేషన్‌కి విరాళాలిస్తున్నారు. లక్షల కోట్ల ఆస్తులున్నా.. బఫెట్ తన పాత మోడల్ కారునే రిపేరు చేయించుకుని అందులోనే ప్రయాణిస్తుంటారు. అది కూడా ఊళ్లోనే. తన ఊరు దాటి వెళ్లకుండానే ఆయన ప్రపంచాన్ని తన వైపుకి ఆకర్షించుకున్నారు. తన ఉన్న చోటే ఓ పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించి దశాబ్దాలైనా చెక్కుచెదరకుండా నిలబెట్టారు.*

"అంత పెద్దఎత్తున దానాలు చేసినా, చేస్తున్నా.. గేట్స్, జుకర్‌బర్గ్, బఫెట్‌లాంటి వాళ్లు కూడా ఒక పరిధి దాటి సమాజంలో మార్పుని సాధించలేకపోతున్నారు. వారు సమాజానికిచ్చిన డబ్బు గురించి కన్నా.. సమాజాన్ని పట్టించుకుంటేనే సంపదకు పరమార్థం అనే వారి సమాజహిత భావాన్ని గురించి పట్టించుకోవటం ముఖ్యం" అని ఆయన వివరించారు.

"మన సమాజంలో పేదరికం, అవిద్య పెద్దఎత్తున ఉంది కాబట్టి.. దానాలు చేయటం, ఆచారాల్లోని మంచిని పాటించటం వంటి వాటికి మనం అడ్డుచెప్పనక్కర్లేదు. కానీ అవి తాత్కాలిక ఉపశమనాలే. అసలైన పరిష్కారాలు అవి కావు. వ్యవస్థలో గనక సరైన మార్పుల్ని తీసుకురావటమే అసలైన పరిష్కారం. దానాలు, ఆచారాల ద్వారా నువ్వు మహాఅయితే కొన్ని వందలు, వేలమందికి తాత్కాలికంగా కొంత తోడ్పాటునివ్వగలవు, కానీ వ్యవస్థలో మార్పును తేగలిగితే లక్షలు, కోట్ల మంది జీవితాల్ని శాశ్వతంగా మార్చగలవు" అన్నారు.

"నేనెందుకు మార్చాలి అనుకుంటున్నావా?..

"చుట్టూ ఉన్న వ్యవస్థతో సంబంధం లేకుండా నీ వ్యక్తిగత సుఖాన్నే నువ్వు చూసుకుంటుంటే.. ఒకమేర దాటి అది సాధ్యం కాదు. కొన్నాళ్లకి ఆ సుఖాన్ని కూడా పొందలేని దుర్భర పరిస్థితులు వస్తాయి. ఎక్కడో మురికివాడల్లో ఉన్న పోరగాడ్ని కుట్టిన దోమ నిన్ను కూడా కుడుతుంది. పేద, సామాన్య ప్రజల ఆరోగ్యాన్ని కబళించే కాలుష్యం నిన్ను కూడా దెబ్బతీస్తుంది. చుట్టూ జరిగే అరాచకాలు ఏదోకరోజు నీ జీవితాన్ని కూడా కల్లోలపరుస్తాయి. అంటే.. సమాజహితాన్ని పట్టించుకోకుండా నీ మట్టుకు నీవు సుఖపడటం అనేది అంతిమంగా జరిగే పని కాదు. ఈ వాస్తవం ఎక్కడో నీ అంతరాత్మకు అర్థమవుతోంది కాబట్టే, దాన్ని సరిదిద్దే పొటెన్షియాలిటీ నీకుంది కాబట్టే.. ఎన్నున్నా నీకు మనశ్శాంతి ఉండటం లేదు, సంతోషం కలగటం లేదు. నెగెటివ్ అభద్రత చుట్టుముడుతోంది. నీకున్న పాటి అవకాశాలు లేని నీ స్నేహితులు వంటి వారు కూడా వ్యక్తిగత దృష్టిని దాటి సమాజంలో మార్పు గురించి ఆలోచించటం మొదలు పెడితే వాళ్లు కూడా నిరాశ నుంచి బైటపడి పరిష్కారంలోకి ప్రవేశించగలుగుతారు. అంటే, మీ సుఖం కోసం మీరు చేసే ప్రయత్నంలో భాగంగానే మీరు సమాజాన్ని పట్టించుకోవటం అవసరమన్నమాట. అందుకే, మన తర్వాతి తరాల వారి కోసం మంచి సమాజాన్ని నిర్మించి ఇవ్వడం.. కోట్ల రూపాయల ఆస్తిపాస్తుల్ని సంపాదించి ఇవ్వడం కంటే కూడా గొప్ప!".

చాలా మేర స్పష్టత వచ్చినట్టనిపించింది నాకు. అయితే, సమాజం కోసం పనిచేయటమంటే ఎలా? అంత సమయం నాకు సాధ్యమా? మిత్రుల్లో చాలామందికి నాకున్నపాటి ఉపాధి అవకాశాలు కూడా లేవు. వాళ్లు నాపాటి కూడా సమాజానికి చేయలేరు గదా?

ఈ ప్రశ్నలకూ ఆయన వెనువెంటనే సమాధానమిచ్చారు.

"అందరికీ ఉండేది రోజుకు 24 గంటలే. ఆ సమయంలో మీకున్న వనరులను బట్టి రోజూకాకున్నా, వారానికి కొన్ని గంటల్ని ఏదోకరోజున లేదా రెండు రోజుల్లో కేటాయిస్తే చాలు. రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయి సమస్యల మీదేమీ మీరు పోరాడనక్కర్లేదు. మీ చుట్టూ స్థానికంగా ఉండే సమస్యల మీద, వీలుంటే జిల్లా స్థాయి సమస్యల మీద పరిష్కార కృషి చేస్తే చాలు. గుడ్డి ఆవేశంతో కాకుండా.. సమస్యను అర్థంచేసుకుని, పరిష్కారాన్ని అవగాహన చేసుకుని, చుట్టూ ఉన్న వారితో కలిసి సంఘటితంగా ప్రయత్నం చేస్తే కచ్చితంగా చాలా సమస్యలు పరిష్కారమైపోతాయి. మీకు వనరులు బాగానే ఉన్నాయి, ఫర్వాలేదు అనుకుంటే, ఆసక్తి ఎక్కువ ఉంటే.. పూర్తిస్థాయి సమయాన్ని కేటాయించవచ్చు, అవగాహన పెంచుకుంటూ రాష్ట్ర, జాతీయ

సమస్యల మీద కూడా పోరాటాలు చేయవచ్చు. రోజువారీ ఉపాధే కష్టమైన యువత నీ అంత సమయాన్ని ఇవ్వలేకపోయినా, కొద్దిపాటి సమయాన్ని, అది కూడా స్థానిక సమస్యలకు కేటాయిస్తే.. వారికి సమస్యలు బాగా అర్థమై వ్యక్తిగత లక్ష్యాలను కూడా తేలిగ్గా సాధించగలుగుతారు. తమ సమస్యల పరిష్కారానికి కావలసిన సామాజిక వాతావరణాన్ని నిర్మించుకోగలుగుతారు. ఇది అంతిమంగా వారికి ఎంతో మేలు చేస్తుంది. నాకు అవకాశాలు లేవు గదా.. అని చుట్టూ ఉన్న సమాజాన్ని విస్మరించటం కంటే– పట్టించుకుని ఎంతోకొంత పరిష్కారంలో భాగమవటమే సామాన్య, దిగువ మధ్యతరగతి యువతకు ఎంతో ప్రయోజనకరం! ఉపాధి కావలసినవారికి తక్షణ అవకాశాల్ని మెరుగుపరుచుకోవటమెలాగో తెలుస్తుంది, చదువుకుంటున్నవారు మున్ముందు మంచి ఉపాధి అవకాశాలు, సుఖజీవనాన్ని గడపటానికి కావాల్సిన సామాజిక పరిస్థితులను ఏర్పరచుకోగలుగుతారు. 'ఈ మార్పుల వల్ల ప్రస్తుత తరంలోని వాళ్లకన్నా మీతరంలోని వాళ్లకే ఎక్కువ ఉపయోగమని' మాత్రం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. ఆర్థిక రంగంలో స్టార్టప్‌ల గురించి మీకు బాగా తెలుసు, దాంతోపాటు సామాజిక స్టార్టప్‌లలో కూడా మీరు భాగస్వాములు కావాలి. ఫైనాన్షియల్ స్టార్టప్, సోషల్ స్టార్టప్ కలగలిసి తగిన నిష్పత్తిలో సాగితేనే మీ జనరేషన్ నెక్ట్స్‌కి అన్ని రకాలుగా భద్రత" అని ఓపిగ్గా వివరించారు.

"బోలెడు కులాలు, మతాలు, భాషలు, ఎన్నో రకాల ఆచారసంప్రదాయాలు ఉన్న మనదేశంలో, డబ్బు లేకుండా చిన్న పని కూడా జరగని, ఓటు కూడా వేయని మన సమాజంలో మార్పు రావడం సాధ్యమా? ఎంత కష్టపడినా వృథా అవదా?" అని రకీమని అడిగేశాను. ఇంట్లో, బంధువుల్లో మాట్లాడుకునే మాటలే గదా.. స్పాంటేనియస్‌గా వచ్చేశాయి.

ఈసారి ఎందుకో పెద్దగా నవ్వారు. "ఇలా ఆలోచించటం నీ తప్పు కాదు. నీవు నేర్చుకున్న చదువులు, మంచిని ప్రోత్సహిస్తూ చెడును నిరుత్సాహపరచటంలో ప్రభుత్వాల వైఫల్యం, నీ చుట్టూ ఉన్నవారి ప్రభావం ఇందుకు కారణాలు" అంటూ ఏదో పరిశీలిస్తున్నట్టు నావైపు చూశారు. తర్వాత కొనసాగించారు.

"కానీ మార్పుకి మన చేతులో ఉన్న అవకాశాలు కూడా చిన్నవేమీ కావు. తలతో కొండను ఢీకొన్నట్టుగా అన్నిటినీ కలగలిపి గుడ్డిగా ఎదుర్కోకుండా, అవగాహనతో, నిలకడగా, క్రమపద్ధతిలో, చిన్న విజయాలతో ప్రయత్నిస్తే.. ఎలాగైతే ఒక తులాదండంలాంటి ఇనుపకడ్డీ పెద్ద బండరాయిని అవలీలగా లేపేయగలదో, అలాగే ఈ దేశంలో మార్పును అద్భుతమనిపించేలా సాధించుకోవచ్చు. ఏదో పెద్ద భారాన్ని మోస్తున్నట్టు కాకుండా, ఆడుతూ పాడుతూనే మీలాంటి వాళ్లు ఈ పనిచేసేయొచ్చు. దేశ జనాభాలో 70 శాతం దాకా ఉన్న మీరు తలోక చేయి వేస్తే.. దేశం మారకుండా ఆపే శక్తి ఎవరికుంటుంది? అయితే.. ఇంతకుముందే చెప్పుకున్నట్టు గుడ్డిగా ఈ పోరాటం చేయకూడదు. గుడ్డిగా చేస్తే ఎన్ని కోట్ల మంది ఉద్యమం చేసినా మీడియాలో హెడ్‌లైన్స్ తప్ప పనికొచ్చే మార్పు రాదు. జనం లక్షలాదిగా రోడ్ల మీదకొచ్చి, సోషల్ మీడియాలో హోరెత్తి చేసిన ఉద్యమాలు సరైన ఎజెండా, మార్గదర్శకత్వం లేకపోవటం వల్ల విఫలమవటం ఈమధ్య కూడా చూస్తూనే ఉన్నాం. ప్రజల్లో సమస్యలపై తగినంత చైతన్యం ఉంది. ఇప్పుడు కావలసిందల్లా– ఏ అంశాల మీద ఎలాంటి పరిష్కారాలను ఏ రీతిలో సాధించుకోవాలి, అందులో ఎలా భాగస్వాములవ్వాలి? అన్నవే. కాబట్టి 'అవగాహనతో, సంఘటితంగా పోరాటం చేయటం' సమాజహితాన్ని సాధించటంలో యువతకు కీలకం".

నేను చూసిన చాలామంది పెద్దలలో కనిపించని భిన్నమైన, విస్తృతమైన పరిణతి ఈ పెద్దాయనలో కనిపించింది. ఇందుకు దోహదం చేసిన పరిస్థితులేమిటా అన్న పాత సందేహం మళ్లీ నాలో ప్రవేశించింది.

నాలోని సందేహాన్ని చదివేసినట్టు ఆయన స్పందించారు.

"ఇలాంటి అవకాశం చాలా అరుదుగా మాత్రమే కొన్ని తరాల్లో మాత్రమే లభిస్తుంది. నాకు లభించిన అవకాశాన్ని నేను సద్వినియోగం చేసుకోగలిగాను. ఎలాగో తెలుసా.. నీలాగే ఉత్సుకత, ఆత్మవిశ్వాసంతో! నీకున్న ఈ లక్షణాల వల్ల నువ్వు కచ్చితంగా ఓ విజయవంతమైన నాయకుడివి, వ్యక్తివి కాగలుగుతావన్న నమ్మకం నాకు కలిగింది. అందుకే నీతో అంతసేపు వివరంగా మాట్లాడుతున్నాను. ఇంకా మాట్లాడాలనుకుంటున్నాను" అన్నారు.

గందరగోళ పడకుండా మన సమాజాన్ని, దేశాన్ని మార్చగలిగే, అందుకోసం నాబోటి వాళ్లు ఎక్కడికక్కడ స్థానికంగా పనిచేయగలిగే తులాదండంలాంటి ఎజెండా ఏమిటి, చెప్పండి? అనడిగాను.

ఆయన నన్ను ఓ గదిలోకి తీసుకెళ్లారు. ఎంత ఇష్టమైన పనైనా కొద్దిసేపటికే బోర్ ఫీలయ్యే మా ఫ్రెండ్ గురించి అప్పుడు గుర్తుకొచ్చి చూశాను. పక్కనే ఉన్నాడు. అతను కూడా ఏదో ఆలోచిస్తున్నట్టు మారుమాట్లాడకుండా నాతోనే వచ్చాడు.

అక్కడ పెద్దాయన కొన్ని పుస్తకాలను తీసిచ్చారు. అవి లోక్‌సత్తా ఫౌండర్ డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ రాసినవి.

నాక్కూడా జేపీగారి గురించి తెలుసు అన్నాను.

ఎలా తెలుసు?

ఒకసారి మా కాలేజీలో ఆయన స్పీచ్ విన్నాను. ఆటోగ్రాఫ్ కూడా తీసుకున్నాను. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో ఫాలో అవుతుంటాను అన్నాను.

సెల్ఫీ తీసుకోలేదా? అని నవ్వారు.. ఆ వెంటనే "జేపీ చెప్పిన విషయాల గురించి నువ్వేమనుకుంటున్నావు?" అనడిగారు.

"జేపీ చాలా నిజాయతీపరులు. దేశం కోసం తన ఐఏఎస్ పదవినే వదిలేశారు. చాలా మేధావి. అలాంటివాళ్లు గెలిస్తే దేశానికి ఎంతో మంచి జరుగుతుంది".

"నేనడిగింది జేపీ చెప్పిన విషయాల గురించి"..

"అవినీతికి వ్యతిరేకంగా ఆయన పోరాడారు, లోక్‌సత్తా కూడా"...

నా సమాధానంలోని తొట్రుపాటును గుర్తించి, నేను కంప్లీట్ చేయకముందే ఆయన మాట్లాడారు.

"యువత, చాలామంది ప్రజలు ఈవేళ కొన్ని మౌలిక సమస్యల్నయినా గుర్తించటంలో జేపీ కృషి చాలా ఉంది. జేపీ కంటే ముందు కూడా కొంతమంది అలాంటి ప్రయత్నం చేశారు. కానీ వాటికి వ్యవస్థీకృత పరిష్కారాల్ని మనదేశ పరిస్థితులకనుగుణంగా, అది కూడా వెంటనే ఆచరించగలిగే రీతిలో జేపీ అందించారు. అయితే ఆ విధానాలు, పద్ధతులు మాత్రం ఇంకా ప్రజలకు సరిగా చేరలేదు. వ్యక్తుల గురించి, నాయకుల గురించి తప్ప.. వ్యవస్థలు, రిపబ్లిక్ గురించి ఆలోచించలేకపోవటమే ఇప్పుడు మనదేశానికున్న సమస్య" అన్నారు పెద్దాయన.

కొనసాగిస్తూ.. "జేపీ లేవనెత్తిన మౌలిక సమస్యలు గనక ఇప్పటికే పరిష్కారమైపోయి ఉంటే, మీ తరంలో సమస్యలు మాత్రమే మీకు మిగిలివుండేవి. అప్పుడు కేవలం.. జేపీ చూపిన ప్రాతిపదికల్ని, బహిరంగ చర్చ పద్ధతులు, ప్రజాస్వామిక రాజకీయ సంస్కృతి, పౌరసత్వ స్పృహ, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేయటం, తక్షణావసరాల్ని–దీర్ఘకాలిక ప్రయోజనాల్ని సంధానం చేయటం, ప్రజల పన్నుల డబ్బుకు–ఓటు ద్వారా అందుతున్న సేవలకు సంబంధాన్ని గుర్తించటం వంటి వాటిని మాత్రమే తీసుకుని, ప్రతి తరం తమ సమస్యల్ని ఆ ప్రమాణాలతో పరిష్కరించుకుంటుంటే సరిపోతుండేది. కానీ స్వతంత్రం వచ్చిన నాటి నుంచీ కొనసాగుతున్న సమస్యలు ఇంకా మీ తరాన్ని కూడా వెంటాడబోతున్నాయి. గతంలో కంటే కర్కశంగా వాటి ప్రభావం ఉండబోతోంది. అందుకే మీరంతా కాస్త తెలివిని ప్రదర్శించి, మీ ప్రయోజనాల కోసమే.. మీ వ్యక్తిగత జీవితాన్ని చూసుకుంటూనే సమాజం కోసం కొంత పనిచేయాలి. నీలాగా ఉత్సుకత, ఆత్మవిశ్వాసం గలవాళ్లు కొంత అదనపు బాధ్యతల్ని తీసుకోవాలి.

"భారతదేశంలోనే అత్యంత విజ్ఞత గల మేధావి జేపీ అని నేను పూర్తిగా నమ్ముతాను. ఎందుకంటే, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయనతో, ఆయన స్థాపించిన ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తాతో నాకు సంవత్సరాల తరబడి అనుబంధం ఉంది. ఆ భావజాలం పట్ల తొలిరోజున ఎంత అంకితభావం, నమ్మకం ఉందో ఈవేళ్టికీ అదే నమ్మకం, అంకితభావం నాలో ఉన్నాయి. నాకేమీ జేపీ పట్ల ప్రత్యేకమైన, వ్యక్తిగతమైన అభిమానం లేదు. నా మనసులో ఏదైనా సందేహం కలిగితే జేపీ సహా ఎవరినైనా తిరస్కరించటానికి నేనేమీ సందేహించను. అంత స్వేచ్ఛగా ఆలోచించినా కూడా.. జేపీ చెప్పింది, లోక్‌సత్తా విధానాలు తప్పు అని ఏనాడూ నాలో కించిత్తు కూడా సందేహ భావన కలగలేదు. ఈవేళ దేశమంతా అవే ఆలోచనల్ని మాట్లాడుతుంటే ఇంకా ఇంకా నమ్మకం దృఢపడుతోంది. జేపీ థింక్స్ యంగర్ దేన్ ది యంగెస్ట్, ది నెక్స్ట్ జెన్!

"నిజానికి ప్రపంచంలో చాలా దేశాల్లో ఇలాంటి మార్పులు వచ్చాయి. కానీ మనదేశంలో ఉన్నన్ని భాషలు, సంస్కృతులు, ఆచారవ్యవహారాలు, ఇతర సంక్లిష్టతలు మరే ఇతర దేశంలోనూ లేవు. చివరకు చైనాలో కూడా. భారత్‌లాంటి సువిశాల సంక్లిష్ట భిన్నత్వం ఉన్న దేశంలో మార్పును తీసుకురావటం మరేదేశంలో కంటే కూడా చాలా భిన్నమైనది, పెను సవాలు లాంటిది. అందుకే ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా లేదా జేపీ కృషిని అంత గొప్ప పనిగా, అందరి కంటే మిన్నగా చేసే పనిగా నేను భావిస్తాను. పైకి తెలియకుండా.. జేపీ చేసే జనహిత కార్యక్రమాలు అనేకం ఉంటాయి. మనదేశంలో ఒక నిజమైన మార్పునకు, వ్యవస్థీకృత మార్పునకు పునాది వేసే చారిత్రక అవకాశం ఆయనకు లభించింది. దాన్ని తరతరాలకూ కొనసాగించగల అజరామరమైన ప్రాతిపదికల్ని కూడా ఆయన అందించారు. ప్రపంచ దేశాల అనుభవాల్ని, భారతీయ సంస్కృతినీ అధ్యయనం చేసి దేశీయ పరిస్థితులకనుగుణంగా జేపీ ఈ భావజాలాన్ని రూపొందించారు. ఎంతో శ్రమతో కూడిన విద్యను ప్రజలకు అందిస్తూ, ఎన్నో వేదికలను ఏర్పాటు చేస్తూ, అవసరమైతే వ్యూహాత్మక కార్యక్రమాలను చేపడుతూ దశాబ్దాల తరబడి జేపీ ఇలా రేయింబవళ్లూ

కష్టపడటానికి మూల కారణం– ప్రజల పట్ల ఉన్న ప్రేమ! ఆయనకు ఆ క్రెడిట్‌ను ఇవ్వటం, భేషజాలు లేకుండా మన పరిధిలో మన వంతు పని చేయటం సామాజిక బాధ్యతగా నేను భావిస్తున్నాను" అన్నారు.

"నాకు జేపీ మేధస్సు, చిత్తశుద్ధి పట్ల ఎటువంటి సందేహం లేదు సార్" అని కంగారుగా చెప్పాను.

"ఉన్నా తప్పు లేదు. తనని గుడ్డిగా నమ్మమని జేపీ కూడా ఏనాడూ చెప్పరు. కానీ విమర్శ చేయటానికి హేతుబద్ధత ఉండాలి. సాక్ష్యాల్ని, అవసరమైన గణాంకాల్ని చూపాలి. అలాగే జేపీ చెప్పిన విషయాల్ని యధాతథంగా కాకుండా, మీ స్థానిక అవసరాలకనుగుణంగా, మీ సొంత భాషలోకి, యాసలోకి మార్చుకుని ఆచరణలోకి తెస్తుండాలి".

ఇక్కడో ఉదాహరణను ఆయన ప్రస్తావించారు.

*"ఇటీవల ఓ స్కూల్‌లో స్వచ్ఛభారత్ మీద ప్రాథమికోన్నత తరగతుల విద్యార్థులకు పోటీ నిర్వహించారు. లోక్‌సత్తాతో అనుబంధమున్న ఓ మిత్రుడి పిల్లలు కూడా ఆ పోటీపరీక్ష రాసినవారిలో ఉన్నారు. పరీక్ష ప్రకటించిన రోజున ఆ పిల్లలు ఇంట్లో తండ్రిని స్వచ్ఛభారత్ గురించి అడిగారు. ఆయన లోక్‌సత్తా పేరు చెప్పకుండానే లోక్‌సత్తా విధానాన్ని వాళ్లకు అర్థమయ్యేలా వివరించారు. పిల్లలు నోట్ చేసుకుని ఆ తర్వాత స్కూల్ పోటీలో పాల్గొన్నారు. మిగతా పిల్లల్లో దాదాపు అందరూ గూగుల్ సెర్చ్ చేసి అందులో వివరాలు, ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెబ్‌సైట్‌లో ఉన్న వివరాలను సేకరించి రాశారు. చివరకు పోటీ ఫలితాలను ప్రకటించారు. మిత్రుడి పిల్లలకు నూటికి నూరుశాతం మార్కులు వచ్చి మొదటి బహుమతులురాగా, మిగిలినవారికి తర్వాతి స్థానాలు వచ్చాయి. మిత్రుడి పిల్లల ఆన్సర్ షీట్ మీద వెరీగుడ్ అని రాసి మరీ మొదటిస్థానాల్ని ఇచ్చారు. ఆ షీట్లు దిద్దిన టీచర్లెవరికీ ఇది లోక్‌సత్తా ఆలోచన అని తెలియదు. లోక్‌సత్తా ఆలోచన, ప్రధానమంత్రి ఆలోచన అనే ప్రత్యేకమైన దృష్టి లేకుండానే వాళ్లు పేపర్లను దిద్దారు. కాస్త నిజాయతీతో, ఇంగితజ్ఞానంతో ఆలోచిస్తే.. స్వచ్ఛభారత్‌పై లోక్‌సత్తా విధానం ఎంత హేతుబద్ధంగా, ప్రతి రూపాయినీ సద్వినియోగం చేసేలా ఉందో అర్థమవుతుండటం వల్లే ఇది సాధ్యమైంది.*

"జేపీ భావజాలం ప్రామాణికతను అందరికీ అర్థమయ్యేలా చెప్పే ఉదాహరణ ఇది. స్థానిక ఫ్లేవర్‌లో కొన్ని తేడా లుండొచ్చుగానీ, స్థూలంగా జేపీ భావజాలాన్ని మనందరూ అంగీకరించవచ్చని నా సుస్థిర భావన.

"ఆధునిక పరిభాషలో చెప్పుకోవాలంటే.. జేపీ మెంటారింగ్, విధానాల ద్వారా కేవలం సమాజహితం జరిగి క్రమంగా మనకు మేలు జరగటమేకాకుండా, మన చదువుల్లో, కెరీర్లో కూడా తక్షణం ప్రయోజనాలు చేకూరతాయి. చూసే దృష్టిని మార్చి మన ఆలోచనాస్థాయిని, ప్రాతిపదికల్ని మార్చేసి సమున్నత కోణంలోకి, కక్ష్యలోకి తీసుకెళ్ల గల సత్తా జేపీ భావజాలానికుంది.

"భగవద్గీతలో శ్రీకృష్ణ ఉవాచగా ఒక శ్లోకం ఉంది..

**'మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే!**

**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వత:'**

దీనర్థం..

'వేలకొలది మనుష్యులలో కొందరు మాత్రమే నన్ను గూర్చి తెలుసుకొనుటకు ప్రయత్నించును. అట్లు ప్రయత్నించినవారిలో కూడా ఒకానొకడు మాత్రమే మత్పరాయణుడై నా తత్త్వమును అనగా నా యదార్థ స్వరూపమును ఎరుంగును'.

".. ఆ గీతా శ్లోకంలోలా మహానుభావులు లాంటి ఎవరో ఒకరిద్దరికి మాత్రమే సమాజాన్ని ఉద్ధరించే శక్తి సాధ్యం.. మిగిలిన మనందరం నిమిత్తమాత్రులం, మౌనప్రేక్షకులం అని తప్పించుకోవటం ఈవేళ మాత్రం కుదరదు. ఆరోజుల్లో అత్యధిక శాతం ప్రజలకు చదువు లేకుండా చేశారు, చదువుకుంటానంటే, కనీసం మంచి మాటలు వింటానంటే చెవుల్లో సీసం పోశారు. కానీ ఈరోజుల్లో నాణ్యమైన చదువులు అందకుండా చేయటం మనదేశంలో ఓ పెద్ద సమస్యగా కొనసాగుతున్నా, చదువుకోకూడదనే ఆంక్షలైతే లేవు. గీతా కాలంతో పోలిస్తే ఇప్పుడు అనేకరెట్లు ఎక్కువమంది ఎంతోకొంత చదువుకున్నారు. దీనికితోడు, ప్రపంచ చరిత్రలో ఎన్నడూలేనంత గొప్ప ప్రచార సాంకేతిక పరిజ్ఞానం ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రధానమంత్రికి ఎంత తెలుసుకునే అవకాశముందో.. చాలా విషయాల్లో అంత పరిజ్ఞానాన్ని తెలుసుకునే అవకాశాలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి.. వేలల్లో, లక్షల్లో ఏ ఒక్కడో, ఒకామో, కొద్దిమందో మాత్రమే వ్యవస్థల్ని, దేశాన్ని మార్చే విషయాల్ని అవగాహన చేసుకునేలా పరిమితులు ఈవేళ లేవు. కొద్దిమందికి మాత్రమే సమాజాన్ని మార్చే విషయాలు పరిమితం, ఎవరో హీరో అవతరించి మనల్ని ఉద్ధరించాలి అనటం నేటి సమాజంలో ఆత్మవంచన, పలాయనవాదమే అవుతాయి.

"జేపీ భావజాలం, పరిష్కారాలు అందరికీ చేరాలి. వారు అవగాహన చేసుకునేంత వరకూ, సంబంధిత కార్యక్రమాల్లో

క్రియాశీల భాగస్వాములయ్యేంత వరకూ వాటిని చెబుతూనే ఉండాలి. అయితే అందరూ అన్ని విషయాల్నీ వెంటనే అందుకోలేకపోవచ్చు. మన విద్యావ్యవస్థ వైఫల్యం అందుకు ప్రధాన కారణం. కాస్త మెరుగైన అవగాహన ఉన్నవారు కొంత లోతైన విషయాల్ని అర్థం చేసుకుని కాస్త పెద్దస్థాయి కార్యక్రమాలను చేపట్టవచ్చు. తాము శిక్షణ తీసుకుని కిందివారికి పంచుతుండవచ్చు. మిగిలినవారు కూడా నగర, పట్టణ, గ్రామ స్థాయిలో, వార్డు స్థాయిలో తమ శక్తికనుగుణంగా పాల్గనవచ్చు. చేపట్టే కార్యక్రమాల వల్ల ప్రయోజనమేంటో తెలిస్తే, ఎంత చదువు లేకున్నా అర్థం చేసుకుని స్పందించే శక్తి ప్రతి ఒక్కరికీ ఉంటుంది కాబట్టి.. యువతలో ప్రతి ఒక్కరూ ఏదోక కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం ఉంది. అయితే జేపీ సహా అందరూ ఆమోదించే ఉమ్మడి ప్రాతిపదికలకి ప్రతి ఒక్కరూ స్థూలంగా కట్టుబడి ఉండాలి. స్కూల్ ఒకటే అవ్వాలి. ఈ కార్యాచరణతో కచ్చితంగా వ్యవస్థలో మార్పుల్ని తేగలిగే, పరిరక్షించి పెంపొందించగలిగే నిర్మాణమవుతుంది.

"గీతాకారుని కాలం నాటి పరిస్థితే ఇప్పుడు కూడా ఉంటే, జేపీ కూడా కొండకు తలను కొట్టుకున్నట్టే అయ్యుండేది. కానీ బండరాయిని కదిలించే తులాదండంలాంటి విధానాలతోపాటు, కొత్త ఆలోచనలను ఆదర్శభావాలతో స్వాగతించే మీలాంటి యువత పెద్దసంఖ్యలో ఉండటం, అత్యాధునిక సమాచార, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావటంతో జేపీ బృహత్ ప్రయత్నం ఆచరణాత్మకంగా మారింది. ఐదువేల ఏళ్ల భారతదేశ చరిత్రలో మరే తరానికీ ఇంత పెద్ద అవకాశం రాలేదు. ప్రజాస్వామ్య భారతంలో దీన్ని జేపీ ప్రారంభించారు, మనందరం మన వంతుగా భాగస్వాములై సమష్టిగా విజయం సాధించాలి.

"ఒకరకంగా ఇది మనదేశ స్వతంత్ర పోరాటం లాంటిదే. ఆరోజున మహాత్మాగాంధీ, నెహ్రూ, ఆజాద్, రాజేంద్రప్రసాద్, సుభాష్ చంద్రబోస్, పటేల్, సరోజినీనాయుడు, ప్రకాశం పంతులు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ లాంటి వాళ్లు ఎన్నో అవకాశాలను, ఆదాయాన్ని, సుఖజీవనాల్ని వదులుకుని దేశం కోసం జాతీయోద్యమంలో పాల్గన్నారు. విదేశాల్లో కూడా బాగా చదువుకుని సొంత వనరులున్నవాళ్లు పాల్గన్నారు కాబట్టే.. స్వతంత్ర పోరాటం ఒక పద్ధతి ప్రకారం జాతిని ప్రభావితం చేసింది. ఆసేతుహిమాచలంగా భారతదేశం ఒక జాతిగా ఆవిర్భవించటానికి కావలసిన నైతిక రాజకీయాన్ని వారంతా సమకూర్చారు. అదే ఒరవడిలో డా॥ అంబేద్కర్ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని రూపొందించి స్వతంత్ర, ప్రజాస్వామిక భారతదేశానికి అందించారు. అయితే నైతిక రాజకీయం, ప్రజాస్వామిక రాజకీయం వేళ్లూనుకునేందుకు కావలసిన ఏర్పాట్లను వారు చేయలేకపోయారు. దాంతో వారి తరం కనుమరుగవగానే అణగిమణిగి ఉన్న అవినీతి, దోపిడీ విచ్చలవిడిగా మారాయి. రాజ్యాంగంలోని ఉదాత్త ఆశయాలు కాగితాలకే పరిమితమయ్యాయి. 'రాజ్యాంగంలోని గొప్ప లక్ష్యాలకు–జనజీవితంలోని రాజకీయం, పాలన, సామాజిక ధోరణులకు మధ్య అంతరాన్ని తొలగించటమే' ఇప్పుడు మనం చేయాల్సిన ప్రధానమైన పని.

"అందుకే దీన్ని రెండో స్వతంత్ర పోరాటం అనుకోవచ్చు. అయితే తొలి స్వతంత్ర పోరాట యోధుల్లాగా మనలో అందరూ వ్యక్తిగత జీవితాల్ని త్యాగం చేయనక్కర్లేదు. ఆసక్తి ఉన్నవారు ఎంత సమయమైనా ఇవ్వొచ్చు, మిగిలినవారు తమకు వీలున్న సమయాన్ని ఒక క్రమపద్ధతిలో సమాజం కోసం వినియోగించాలి. అది కూడా పరిష్కారాల పట్ల స్పష్టమైన అవగాహనతో. అప్పుడు సరదాగా చేసే ట్రెక్కింగ్‌లా మన ముందు కొండలా ఉన్న లక్ష్యాన్ని అధిగమించగలుగుతాం.

"మనందరి మనసుల్లో కోరుకుంటున్న, రాజ్యాంగం ద్వారా ఆశించిన లక్ష్యాలను సాధించటానికి గందరగోళం లేకుండా ఆచరణాత్మకంగా ఏయే అంశాలను, సంస్కరణలను తీసుకోవాలో, వాటిని ఏ విధానాల ద్వారా సాధించాలో కూడా జేపీ స్పష్టంగా వివరించారు. వాటిని మన పరిధిలో రోడ్‌మ్యాప్‌గా మార్చుకుని పనిచేయటం మేలని నా అభిప్రాయం" అని ఎటువంటి అస్పష్టతలూలేని స్వరంతో చెప్పారాయన.

పెద్దాయనిచ్చిన ఓ పుస్తకాన్ని తీసుకుని ఇంటికెళ్లాను. నాకవసరమైన పనులు వేటినీ ఆపలేదు. అనవసరమైన, అనుత్పాదకమైన పనుల్ని మాత్రం కత్తిరించేశాను. దీంతో పుస్తకం చదవటం రెండు రోజుల్లో పూర్తి చేశాను. నా స్నేహితుడు ఇంట్లో లేకపోయినా, నేరుగా వెళ్లి పెద్దాయన్ని కలిశాను. పుస్తకంలో నాకర్థమైన విషయాన్ని ఫ్రాంక్‌గా చెప్పాను.

"ఇప్పటి వరకూ నేననుకుంటున్న ప్రపంచం ఎన్నో రెట్లు విశాలమైనట్టు అనిపించింది, నేను కొంత ఎత్తు మీద నిలబడినట్టనిపించింది. కానీ ఆ పుస్తకాల్లోని అంశాలు ఒక రోడ్‌మ్యాప్‌లాగా నాకు గుర్తులేవు. చదివేటప్పుడు అర్థమవుతున్నట్టే ఉన్నాయి, కానీ చదివాక ఏదో గజిబిజిగా అనిపించింది. ఒక విషయంలో దేని తర్వాత ఏది చేయాలి, విషయాల్లో ఏ విషయం తర్వాత ఏది ఏ రకంగా చేయాలి, కొత్తగా మార్పులస్తే ఏం చేయాలి? ఇలాంటివి కన్‌ఫ్యూజ్ చేస్తున్నట్టుంది. కానీ ఎలాగైనా పనిచేయాల్సినంత ముఖ్యమైన విషయాలివి అని మాత్రం అర్థమైంది" అని మనసులో ఉన్నదంతా చెప్పేశాను.

"చాలా సిన్సియర్‌గా చదివావు. అందుకు ముందుగా అభినందనలు. కొంత వివరించి చెప్పే ప్రయత్నం చేస్తాను. ఆ తర్వాత మరో చిన్న పుస్తకాన్నిస్తాను. దీంతో నీకు స్పష్టత పెరుగుతుంది. నీ పరిధిలో పని ప్రారంభించటానికి కావలసిన మార్గసూచీ కనిపిస్తుంది" అన్నారు.

"అయితే.. ఎంత విషయాలు బాగా తెలిసినా, లోక్‌సత్తా ప్రాతిపదికలతో నిరంతరం అప్‌డేట్ చేసుకుంటుంటేనే ఆయా అంశాలకు సంబంధించి మన కార్యాచరణ సరిగా ఉంటుంది. మనిషికి-ఇతర జీవరాసులకు మధ్య ఉన్న ప్రధానమైన తేడా ఆలోచనే అయినా.. మనం ఇంకా జంతులక్షణాల దశను పూర్తిగా దాటలేదు. 'ఆలోచించటానికి చేయాల్సిన నిజమైన శ్రమను తప్పించుకోవటానికి మన మనసు నిరంతరం ప్రయత్నిస్తుంటుందని' థామస్ ఎడిసన్ చెప్పిన మాటలు ఇంకా అక్షరసత్యాలే. తప్పించుకునే ప్రయత్నం చేయకుండా.. ఉన్న సమయాన్ని సరైన రీతిలో ఉపయోగించుకుంటుంటే, జరుగుతున్న అద్భుతాల్ని చూసి కొన్నాళ్లకు నువ్వే ఆశ్చర్యపోతుంటావు, ఆ తర్వాత నిన్ను చూసి చుట్టుపక్కల వాళ్లు కూడా నేర్చుకుంటూ తమనుతాము మెరుగుపరచుకుంటారు" అన్నారాయన.

ఇలా కొన్నిరోజుల పాటు విని, చదివి, చర్చించి సింపుల్‌గా రూపొందించిన సంస్కరణల రోడ్‌మ్యాప్‌నే యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) కోసం ఇక్కడ అందిస్తున్నాను. నేనూ వైబీఐలో చేరానని వేరే చెప్పాలా?

## 2. ఐదు అంశాల చుట్టూ పని

మొదటగా మనందరం ఏం కోరుకుంటున్నామో గుర్తిద్దాం.

"స్వేచ్ఛగా, నిరంతరం అభివృద్ధితో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నామని" చెప్పటానికి అభ్యంతరం ఉండనక్కర్లేదుగా!

ఇలాంటి లైఫ్ కోసం.. మనం బాగా చదువుకుని మంచి ఉద్యోగంలో చేరాలనో, ఏదైనా లాభసాటి వ్యాపారం చేయాలనో, సంపన్న విదేశాలకు వెళ్లాలనో, క్రీడాకారునిగానో, సినీనటునిగానో, మరో రకంగానో సెలబ్రిటీగా మారాలనో అనుకుంటుంటాం. కానీ ఆ కలల్ని నెరవేర్చుకునే శక్తి మనలో దాదాపు అందరికీ ఉన్నా.. ఆ అవకాశాలు అందరికీ రావు. కేవలం పుట్టుకను బట్టి చాలామంది జీవితాలు నిర్ణయమైపోతుంటాయి.

అసాధారణంగా కష్టపడో, అదృష్టవశాత్తో సాధారణ కుటుంబాల్లోని వారు ఉన్నత స్థానాలకు చేరటం అక్కడక్కడా కనిపిస్తుందిగానీ.. చాలామేర పుట్టుకతోనే అవకాశాలు నిర్ణయమైపోతాయి. మన తప్పేమీ లేకుండానే మనం నష్టపోతున్నామని అర్థమవుతున్నా నిస్సహాయంగా నలిగిపోతుంటాం. కొన్నాళ్లు అలా గింజుకున్నాక, మనలో కొద్దిశాతం మంది మినహాయించి మిగిలినవాళ్లు సర్దుకుపోవటం నేర్చుకుంటారు. నెట్టుకొచ్చేసే పరిస్థితులతో రాజీ పడుతుంటారు.

మనం కేవలం వ్యక్తిగత ఆలోచనలకి, సమాజంలో యథాతథ స్థితిని కొనసాగించాలన్న దృక్పథానికే పరిమితమవ్వటం వల్ల ఈ సంక్షోభం ఇలాగే కొనసాగుతోంది.

.. దీన్ని సరిగ్గా ఫిక్స్ చేయగలిగితే, కచ్చితంగా పరిష్కరించుకోవచ్చు. పుట్టుకతో సంబంధం లేకుండానే, మనలో ప్రతి ఒక్కరూ తమ కలల్ని నెరవేర్చుకోవచ్చు.

ఈ సంక్షోభం వ్యక్తులకు సంబంధించింది కాదు. వ్యవస్థలకు సంబంధించింది. యువత, మిగిలిన ప్రజలందరి కలలూ నెరవేరే సమాజం ఏర్పడాలంటే- 'అందరికీ ఎదిగే అవకాశాలున్న, నివారించదగ్గ బాధల్ని తొలగించగల' వ్యవస్థ ఏర్పడాలి.

ఇలాంటి నూతన వ్యవస్థ ఏ రాజకీయ, పాలనా పద్ధతిలోనైనా అసలు సాధ్యమా?

సాధ్యమే!

ఎటువంటి పద్ధతిలో?

ప్రజాస్వామ్య రాజకీయంలో ఇది పూర్తిగా సాధ్యం.

మనది ప్రజాస్వామ్య దేశమేగా?

మనది ఓటు వేయటానికి, ఆ తర్వాత తూచ్ అంటూ పాలకులకు వ్యతిరేకంగా అరవటానికి మాత్రమే పరిమితమైన ప్రజాస్వామ్యం. నిజమైన ప్రజాస్వామ్యానికి ఉండాల్సిన పునాదులు మనదేశంలో ఇంకా ఏర్పడలేదు. అందువల్లే.. రాజకీయ నేతల, ప్రభుత్వోద్యోగుల అధికారాలు- దుర్వినియోగానికి ఎక్కువగా, సద్వినియోగానికి తక్కువగా ఉపయోగపడుతున్నాయి. దీనివల్లే కోట్లాదిమంది యువతకు ఎదిగే అవకాశాలు లభించటం లేదు. నివారించదగ్గ బాధలతో నలిగిపోవటం తప్ప బైటపడలేకపోతున్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను మనందరం ఎంతగా కోరుకుంటున్నామో సోషల్ మీడియాలో చర్చలను చూస్తే చాలు. స్పందనల్లో

మితిమీరిన, అర్థంలేని ధోరణుల్ని అలా ఉంచితే.. ఎంత పెద్ద నాయకుడినైనా ప్రశ్నించటానికి యువత వెనుకంజ వేయటం లేదు. ఆ హక్కును లాగేసుకుంటామన్న ఊహను కూడా ఈతరం సహించదు.

ప్రజాస్వామ్యాన్ని అంతగా కోరుకుంటున్నాంగానీ.. ఈ వ్యవస్థ ఎలా ఉంటుందో, అందులో మన పాత్ర ఎలా ఉంటుందో మనకు స్పష్టత కొరవడుతోంది. ఏనుగు-గుడ్డివాళ్ల కథలోలా పరిస్థితి తయారైంది. కొందరు గుడ్డివాళ్లు ఏనుగును చూస్తే, ఒక్కొక్కరు ఒక్కో శరీరభాగాన్ని తడిమి చూసి, అదే ఏనుగనుకుంటారు. ఒకళ్లకు చేటలాగాను, మరొకళ్లకు స్తంభంలాగానూ, మరొకరికి పాములాగాను, వేరొకరికి చీపురులాగానూ అనిపిస్తుంది ఏనుగు. ఇవన్నీ వారి వారి అనుభవాల్ని బట్టి ఏర్పడ్డ భావాలు. ఆ భావాల్లో కొంత వాస్తవం ఉంది తప్ప, పూర్తి సత్యం లేదు. మనదేశ పాలనా వ్యవస్థ పట్ల కూడా మనలో చాలామందికి అలాగే అసంపూర్ణమైన అవగాహన ఉంది. మన తక్షణ పరిస్థితుల నుంచే చూడటం వల్ల.. కొద్ది వాస్తవాన్నే మనం చూస్తున్నాం. ఈ పాక్షిక అవగాహన వల్ల ఏ తీగ లాగితే డొంకలో ఏ భాగం కదులుతుందో బోధపడదు. అందుకే.. వ్యవస్థలో అవినీతి, దోపిడీ, దుష్పరిపాలన పట్ల మనకెంత బాధ ఉన్నా, మనలో చాలామంది పరిష్కారంలో భాగం కాలేకపోతున్నారు. గజిబిజిగా, దాదాపు ఎవరికీ అర్థంకాని, పాలకులకే బోధపడని మన సంక్లిష్ట పాలనా వ్యవస్థ వల్ల, ఎంత తపన ఉన్నా.. మార్పు దిశగా అది కార్యరూపం దాల్చలేకపోతున్నది. చిత్తశుద్ధి, దేశభక్తి గల పెద్దలు, యువకులు దేశంలో ఎన్నో ప్రాంతాల్లో మనం గర్వించదగ్గ ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ ప్రయత్నాలు కొన్ని ఫలితాలను కూడా ఇస్తున్నాయి. అయితే, ఆ సత్ఫలితాలు ఆ ప్రాంతానికి, వారెన్నుకున్న ఓ రంగానికి, అది కూడా కొంతకాలానికి మాత్రమే పరిమితమవుతున్నాయి. ఈ ప్రయత్నాల నుంచి విస్తృత స్థాయి మంచి ఫలితాలు, సుస్థిర ఫలితాలు రావాలంటే.. ఏ తీగ లాగితే ఏ డొంక కదులుతుందో క్షుణ్ణంగా తెలుసుకోవాలి. అందరూ కలిసి ఏకలక్ష్యం వైపు సాగాలి. ఏనుగు పూర్ణ స్వరూపాన్ని చూడాలి.

మనం కోరుకుంటున్న జీవితానికి కావలసిన ప్రజాస్వామిక వ్యవస్థ ఇదిగో ఇలా ఉండాలి అని గనక మనం స్పష్టంగా తెలుసుకోగలిగితే, మన చేతిలో ఉన్న పజిల్ ముక్కను సరైన చోట అతికించగలుగుతాం. చుక్కల్ని చక్కటి డిజైన్‌కనుగుణంగా కలపగలుగుతాం.

కాస్త అర్థం చేసుకుని, కొన్ని మౌలికమైన అంశాల్లో స్థానికంగా ప్రజలతో కలిసి సమష్టిగా కార్యక్రమాలను నిర్వహించటం నేర్చుకుంటే ప్రజాస్వామ్యం పునాదులు గట్టి పడతాయి, అవసరమైన పునాదులు ఏర్పడతాయి. యువతకు అవరోధాలు తొలిగి అపూర్వంగా ఎదిగే అవకాశాలు లభిస్తాయి, అధికారం.. నేతలు, అధికారుల కోసం కాకుండా పూర్తిస్థాయిలో ప్రజల కోసం ఉపయోగపడటం మొదలవుతుంది.

కావలసిన ప్రజాస్వామ్య సంస్కరణల్ని వివరిస్తూ, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ సంపూర్ణ చిత్రాన్ని గనక ప్రజల ముందుంచి చైతన్యాన్ని, అవగాహనను పెంచితే.. క్రమంగా వాళ్లు ఎక్కడికక్కడ భాగస్వాములు కావటానికి సన్నద్ధులవుతారు. ప్రజాస్వామ్య సంస్కరణల్ని గనక ఆచరణలోకి తేగలిగితే, భాగస్వాములుగా, నిజమైన పౌరసత్వం గలవారుగా, నాయకులుగా ఎదగగలుగుతారు.

మనకు అందరితో సమానంగా ఎదిగే అవకాశాలనివ్వాలంటే, ఎటువంటి అవరోధాలు లేకుండా మనం లక్ష్యాల్ని సాధించుకోవాలంటే.. ప్రజాస్వామ్యంలో అంతర్భాగంగా ఉండాల్సిన కొన్ని అంశాలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.

అవి: స్వేచ్ఛ-చట్టబద్ధ పాలన, స్థానిక స్వయంపాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలు, ఎక్కడైనా తప్పు జరిగితే పాలకులతో సంబంధం లేకుండా వాటంతటవే సరిదిద్దే వ్యవస్థలు, ఈ మొత్తం చట్రంలో నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల్ని అందించే ఏర్పాట్లు. ఈ ఐదూ ఉన్నప్పుడే అది నిజమైన ప్రజాస్వామ్యమవుతుంది.

అంటే, మన ఊరు, జిల్లా, రాష్ట్రం, దేశం ఎదుర్కొంటున్న సమస్యలకి మూలం.. వ్యవస్థ వైఫల్యంలో ఉంది తప్ప వ్యక్తుల వైఫల్యంలో లేదు. నోటి మాటల్లో, సోషల్ మీడియా పోస్టింగుల్లో, అటూ ఇటూ తిరగటంలో స్వేచ్ఛను మినహాయిస్తే, మిగిలిన అన్ని ప్రాతిపదికల్లో మన ప్రజాస్వామ్యం చాలా పేలవమైనది. నామమాత్రమైనది.

ప్రజాస్వామ్యమంటే బ్రహ్మపదార్థం కాదు. మన చుట్టూ ఉన్న ప్రజలు కూడా మనలాంటివారే అని అర్థం చేసుకుని ప్రేమించగలిగితే.. చాలా తేలిగ్గా బోధపడుతుంది, ఆనందాన్ని పంచుతుంది.

ప్రజాస్వామ్యంలో పాలకులు, అధికారులు కూడా ప్రజల నుంచే వస్తారు. వాళ్లలోనూ మంచివారు, ఏదో మంచి చేయాలనే తపన ఉన్నవారూ ఉంటారు. వారు సరిగా పనిచేసి తమలోని శక్తిసామర్థ్యాలన్నిటినీ తమ బాధ్యతల నిర్వహణ కోసం, ప్రజల కోసం వినియోగించే వ్యవస్థను నిర్మిస్తే చాలు.. మన ఆకాంక్షల్లోని అద్భుతాలు వాస్తవాలుగా మారతాయి. నిజమైన ప్రజాస్వామ్యమే గనక ఇప్పటికే వేళ్లూనుకుని ఉంటే.. కుటుంబ వ్యవస్థ రూపంలోనో, మరో రూపంలోనో మన సమాజంలో అంతర్గతంగా ఉన్న

మంచి వల్ల– పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశాల్లో తలెత్తే వైఫల్యాలు కూడా లేకుండా మనం మెరుగైన ఫలితాలను సాధించి ఉండేవాళ్లం.

గతంలోలాగానే ప్రజల్లోనూ అత్యధికులు ఈవేళ కూడా నిజాయతీపరులే. కానీ మారిన ఆర్థిక వ్యవస్థలో, పోటీ ప్రపంచంలో వారి నిజాయతీ చిన్న స్థాయి ఫలితాలనే ఇస్తోంది, అక్కడక్కడా మాత్రమే కొంతమేర చెప్పుకోదగిన ఫలితాలను కొంతకాలంపాటు ఇస్తోంది. ఏదోక మార్పు దానంతటది వస్తోంది, సమాజంలో, ప్రజాస్వామ్యంలో కొంత పరిణతి నెమ్మదిగా పెరుగుతోంది తప్ప.. దేశ యువతలో, ఇతర ప్రజల్లో ఉన్న తపనకు, శక్తిసామర్థ్యాలకు, దేశంలోని వనరులకు, అవకాశాలకు తగ్గ మార్పు, పరిణతి మాత్రం రావటం లేదు. నిజాయతీపరులు భాగస్వాములు కాగలిగేలా వ్యవస్థల్ని మార్చటమే ఇందుకు పరిష్కారం.

ఈ ప్రజాస్వామ్య సంస్కరణల్ని ఏదోక రాజకీయ పార్టీ, నాయకుడు లేదా నాయకురాలు ప్రతిపాదించి అందుకోసం పోరాడే పరిస్థితి ఉంటే.. మనం ఇంత బాధ్యతను తీసుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడున్న నల్లడబ్బు రాజకీయంలో ఇలాంటి సంస్కరణల కోసం ఎన్నికల్లో నిలబడి గెలవటం దాదాపు అసాధ్యం. ఏదోకరూపంలో గెలిచిన పార్టీలు.. దూరదృష్టితో తమ మనుగడ కోసమైనా కొంతమేర సంస్కరణలకు స్పేస్ ఇచ్చే పరిస్థితి కూడా అంతగా కనిపించటం లేదు. దేశం మొత్తాన్నీ ప్రభావితం చేయగలిగిన నాయకులు అప్పుడప్పుడూ అధికారంలోకి వచ్చినా, తేలిగ్గా సంస్కరణల్ని అమలు చేసే అవకాశం వారి అరచేతిలోకి వచ్చినా.. అవగాహన లేకో, మరో కారణంగానో సదవకాశాల్ని జారవిడుస్తున్నారు. అయినా నిరాశ చెందాల్సిన పన్లేదు. ఎన్నికల రాజకీయాలకు దూరంగా, మొత్తం దేశంలో కాకున్నా స్థానిక స్థాయిలో మార్పు కోసం కృషి చేస్తుంటే, క్రమంగా లక్ష్యాన్ని ఛేదించవచ్చు. కాకపోతే అనుకున్నదాని కన్నా ఆలస్యం జరగొచ్చు. కానీ మార్పు మాత్రం వచ్చి తీరుతుంది.

అందుకే ఎన్నికల్లో పోటీని ఓపిక ఉంటే చేసే పనిగా మాత్రమే పక్కనపెట్టి.. సామాజిక నేతలుగా, సోషల్ లీడర్లుగా ఈనాటి యువత ఎదగాలి. దీన్ని సామాజిక రాజకీయం అని కూడా అనుకోవచ్చు. ఇందుకు యూత్ ఫర్ బెటర్ ఇండియా ఒక స్టార్టప్ హబ్, దీర్ఘకాల కార్యక్రమాల వేదిక!

రెండో స్వాతంత్ర్య పోరాటం లేదా ప్రజాస్వామ్య సంస్కరణల్లో భాగంగా రావాల్సిన పై ఐదు అంశాలపై పరిష్కారాల కోసం పనిచేసేందుకు వీలుగా.. ఆయా అంశాలు, తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో వాటి పరిస్థితి గురించి క్లుప్తంగా చూద్దాం.

**మొదటిది) స్వేచ్ఛ–చట్టబద్ధ పాలన:** ప్రజాస్వామ్యానికి మూలస్తంభం లాంటి స్వేచ్ఛ ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలంటే మొట్టమొదట ఉండాల్సింది చట్టబద్ధ పాలన. భద్రతే లేకుంటే ఇక స్వేచ్ఛకు అర్థమేంటి? కులవివక్ష ఎలా పోతుంది? ఇంత ప్రాధాన్యత గల అంశమే అయినా.. ప్రభుత్వాలు దీన్ని పట్టించుకోవటం లేదు. బాలికలు, మహిళలు బైటికెళ్తే వేధింపులు. కొన్ని సందర్భాల్లో పురుషులు సురక్షితంగా తిరిగి రావటంపైనా ఆందోళన. ఎదుటివారి స్వేచ్ఛను హరించే నేరాలు చేసిన వారికి శిక్ష పడుతుందని, బాధితులకు న్యాయం జరుగుతుందని నమ్మకం లేదు. ఇంకా మన వద్ద శాంతియుత వాతావరణం కనిపిస్తోందంటే, స్వేచ్ఛాయుతంగా మనందరం వ్యవహరించగలుగుతున్నామంటే, మన కుటుంబ వ్యవస్థ, అంతర్గతంగా సమాజంలో ఉన్న మంచి మాత్రమే కారణం తప్ప.. రాజ్యాంగం హామీ ఇచ్చిన చట్టబద్ధపాలన సక్రమంగా అమలవుతుండటం వల్ల కాదు. బడితె ఉన్న వాడిదే బర్రె అనే బండ న్యాయమే ఇక్కడ కొనసాగుతోంది. మధ్యయుగాల్లో కొంతమంది చక్రవర్తులు కూడా మన ప్రస్తుత పాలకుల కంటే మెరుగైనరీతిలో ప్రజలకు న్యాయాన్ని అందించారు. న్యాయగంటను కట్టి దోషులైన సొంత కుటుంబసభ్యుల్ని కూడా శిక్షించిన రాజులున్నారు. కానీ మనదేశంలో డబ్బు, పలుకుబడి ఉంటే ఎంత పెద్ద నేరం చేసయినా, పెద్ద శిక్ష లేకుండా లేదా అసలేమీ శిక్ష లేకుండా తప్పించుకునే అవకాశాలు కోకొల్లలు. పోలీసులు నిందితుల్ని చావబాదకుండా శిక్ష పడే కేసులు నూటికి పది కూడా లేవు.

**రెండు) స్థానిక స్వయంపాలన:** ప్రజల అవసరాల్లో నూటికి 80 శాతం స్థానికంగానే ఉంటాయి. కాస్త అభివృద్ధి చెందిన దేశాల్లో పాస్‌పోర్టుల్ని కూడా మునిసిపల్ కార్యాలయాలే అందజేస్తాయి. స్థానిక స్వయంపాలన అనేది నాగరిక ప్రజాస్వామ్యానికి సంకేతం. మనదేశంలో వేల ఏళ్ల క్రితమే స్థానికంగా గణతంత్ర రాజ్యాలు మనుగడ సాగించాయి. విదేశాల నుంచి భారత్ మీద దాడులు చేసిన రాజులు, స్వదేశీ చక్రవర్తులు సైతం గ్రామాల పాలనలో జోక్యం చేసుకునేవారు కారు. కానీ స్వతంత్ర భారతదేశ పాలకులు మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దేశ విభజన సమయంలో చెలరేగిన హింస వల్ల కోటిమందికి పైగా నిరాశ్రయులయ్యారు, లక్షలాది మంది మరణించారు, లక్షలాది మహిళల మీద అత్యాచారాలు జరిగాయి. దేశమంతా అట్టుడికినట్టున్న ఆ పరిస్థితుల్లో.. ఒక దేశంగా భారత్‌ను కలిపి ఉంచటం కోసం ముందుజాగ్రత్తగా రాజ్యాంగ నిర్మాతలు జాతీయస్థాయిలోని ప్రభుత్వానికి అదనపు అధికారాలను కట్టబెట్టారు. కానీ సాధారణ పరిస్థితుల్లో ఫెడరల్ పాలనే సాగాలని స్పష్టంచేశారు. అయితే ఇంకా అసాధారణ పరిస్థితులే నెలకొన్నాయన్నట్లు జాతీయస్థాయి ప్రభుత్వం తన వద్దే ఎక్కువ అధికారాలను

కేంద్రీకరించుకుని కేంద్ర ప్రభుత్వంగా కొనసాగుతోంది. 1980లలో పలు రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు కేంద్రం తీరుకు నిరసనగా పోరాడటంతో క్రమంగా రెండో దశ ఫెడరలిజం ప్రారంభమైంది. ఇప్పుడు కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధులు పెరిగాయి, చాలా రాష్ట్రాలు స్వావలంబనను సాధించగలిగాయి. కేంద్ర బడ్జెట్‌లో 50శాతానికిపైగా నిధులు రాష్ట్రాలకు కేటాయిస్తున్నారు. అయితే అసలైన అధికారాలు మాత్రం ఇంకా కేంద్రం వద్దే ఉన్నాయి.

ప్రజలు ఓట్లు వేస్తున్నది రాష్ట్రాల్లోని పాలకులను చూసి. అలాగే వారికి కావలసింది రాష్ట్రాల్లో మెరుగైన పాలన. అయితే ప్రజలకు అవసరమైన చాలా సేవల్లో సంస్కరణల్ని తీసుకురావటానికి ముఖ్యమంత్రులకు అధికారాలు లేవు. ప్రభుత్వాధికారులకు ఏ దేశంలోనూ లేనంత రక్షణను మన రాజ్యాంగం (311 అధికరణం ద్వారా) కల్పించింది. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ తదితర సివిల్ సర్వీసు అధికారులు జవాబుదారీతనం లేకుండా వ్యవహరించినా రాష్ట్రాలు నిస్సహాయంగా చూస్తున్నాయి. ఐఏఎస్ అధికారులు సర్వజ్ఞులన్నట్టు ప్రతి విభాగంలోనూ వారిని అత్యున్నత స్థాయిలో నియమించటం ఆనవాయితీగా మారింది. తగిన పరిజ్ఞానం లేకపోవటం, గుత్తాధిపత్యం వల్ల ఆయా విభాగాల్లో సేవలు కుంటుపడి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. స్థానిక ప్రభుత్వాలైన మునిసిపాలిటీలు, పంచాయతీల్లో ఎన్నికలు ఎలా జరపాలో కూడా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం ద్వారా చెబుతుంది. దీనివల్ల చెడు చేయటానికి కావలసిన అధికారాలు ఎక్కువ, మంచి చేయటానికి కావలసిన అధికారాలు తక్కువ అయి.. రాష్ట్రాలు దుష్పరిపాలనకు కేంద్రాలుగా తయారయ్యాయి. ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా చిత్తశుద్ధితో మంచి మార్పుల్ని తీసుకురావాలని ప్రయత్నించినా.. అందుకు అవకాశం లేకుండా పోయింది. గవర్నర్లలో ఎక్కువశాతం కేంద్రప్రభుత్వ తొత్తులుగా వ్యవహరిస్తున్నారు.

కేంద్ర–రాష్ట్ర సంబంధాలది ఒక కోణమైతే, రాష్ట్రం–స్థానిక ప్రభుత్వాల మధ్య సంబంధాలు ఇంకో కోణం. స్థానిక ప్రభుత్వాలైన మునిసిపాలిటీలు, పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చే నిధుల్ని కూడా తొక్కిపడుతున్నాయి తప్ప.. స్వయంగా పెద్దఎత్తున నిధులివ్వటానికి రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించటం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా ప్రతి పౌరుని పేరు మీదా రూ.30,000 ఖర్చు చేస్తోంది. ఇందులో స్థానిక ప్రభుత్వాలకు ఇస్తున్నది కేవలం రూ.32. అంటే.. అక్షరాలా వెయ్యికి ఒక్క రూపాయి. స్థానికంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల్ని నిర్వీర్యం చేసేలా రాష్ట్ర సర్కార్లే పార్టీ కార్యకర్తలతో కమిటీల్ని వేసి పైరవీల్ని ప్రోత్సహిస్తున్నాయి. పొంగి పొర్లే డ్రైనేజీలు, గుంతల రోడ్ల గురించి ఫిర్యాదు చేయాలన్నా ఎమ్మెల్యే, మంత్రి వద్దకు పోవాల్సి వస్తోంది. ఒకప్పుడు స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉండటం వల్ల, గ్రామాల్లో స్కూళ్లను సక్రమంగా పర్యవేక్షించటం వల్ల జేపీ లాంటి వాళ్లు ప్రపంచస్థాయికి ఎదగగలిగారనే వాస్తవాలు కళ్ల ముందు కనిపిస్తున్నా.. ఆ స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేసి కేంద్రీకృత పాలనకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. చంక నెక్క మరిగిన బిడ్డ మొత్తుకున్నా దిగడానికి మొరాయించినట్టు.. ప్రజల్లో కూడా స్థానిక ప్రభుత్వాలు అక్కర్లేదనే భావన ఏర్పడటానికి, అన్నీ తామే చేస్తామని హామీలిస్తూ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి వ్యవహరిస్తున్న తీరే కారణం. దీనివల్ల రోజువారీ సేవలు అందకపోవడంతోపాటు.. ప్రజలు పాలనలో భాగస్వాములై పౌరసత్వాన్ని, నాయకత్వాన్ని పెంపొందించుకునే అవకాశాలు లేకుండా పోతున్నాయి. నెహ్రూ, బోస్, ప్రకాశం పంతులు వంటి ఉద్దండ నాయకుల్లా మునిసిపాలిటీలు, ఇతర స్థానిక ప్రభుత్వాల నుంచి జాతీయ స్థాయికి ఎదగగలిగే నాయకులు సామాన్య ప్రజల నుంచి కరువయ్యారు.

ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో స్థానికంగా ఎంతటి అద్భుతాలను సాధించవచ్చో తెలియజెప్పే కొన్ని ప్రామాణిక ఉదాహరణలను చూద్దాం.

## ఎ) అమూల్

*సేవల అవసరం ఉన్నవారికే అధికారాన్నిచ్చి వికేంద్రీకరణ చేస్తే.. సాంకేతికత, వృత్తినైపుణ్యాలను అవకాశంగా మలచుకుని ఆర్థికంగా సిరులు పండించగలమని, సమాఖ్య పద్ధతుల్లో దేశవ్యాప్త బ్రాండ్ ఇమేజ్‌ని సాధించగలమని పాల సహకార సంఘాలు శ్వేత విప్లవం ద్వారా నిరూపించాయి. ప్రభుత్వ వేధింపులు, నియంత్రణల మధ్య కూడా ప్రభుత్వ సాయం లేకుండా చిన్న పాల సహకార సంస్థల ద్వారా వర్గీస్ కురియన్ శ్రీకారం చుట్టిన కృషి వల్ల లక్షలాది రైతుల జీవితాల్లో గణనీయ మార్పు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో.. ప్రభుత్వ అణచివేతల నుంచి స్వావలంబన గల సహకార సంస్థలను విముక్తి చేసేందుకు నిజమైన ఉదార పరస్పర సహాయ సహకార సంస్థల (మ్యాక్స్) చట్టాన్ని 1995లో అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శిగా ఉన్న డా॥ జేపీ సూచన మేరకు ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్ అమలులోకి తెచ్చారు. ఐఏఎస్ ట్రైనీగా తాను కరీంనగర్ జిల్లాలో ఉన్నప్పుడు ముల్కనూర్ సహకార సంఘానికి ఛైర్మన్‌గా ఉన్న విశ్వనాథరెడ్డితో పరిచయం, కురియన్ క్షీరవిప్లవ కృషితో ఉన్న అనుబంధంతో.. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయటంలో సహకార రంగం ప్రాధాన్యతను జేపీ స్పష్టంగా గుర్తించారు. అందుకే మ్యాక్స్ వంటి చట్టాన్ని ప్రతిపాదించారు. ఆ తర్వాతి దశాబ్దంలో అలాంటి చట్టాన్ని మరో 8 రాష్ట్రాల్లో*

అమలు చేశారు. ప్రభుత్వ నియంత్రణలోని సహకార సంస్థలు చాలా మేర విఫలమై నిరంతరం మాఫీలు, సబ్సిడీలను అడుగుతుండగా, మ్యాక్స్ చట్టం కింద స్వావలంబన, స్వయంప్రతిపత్తి కలిగిన ఈ సహకార సంస్థలు పెద్దఎత్తున విజయవంతమయ్యాయి. అయినా కూడా స్వావలంబన గల సహకార సంస్థలను నియంత్రించేందుకు ప్రభుత్వాలు తరచూ ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. జాతీయ సలహా మండలిలో సభ్యుడిగా ఉన్న లోక్‌సత్తా జేపీ ఆర్టికల్ 19 (1) (సి) కింద సహకార సంస్థల రక్షణకు గ్యారంటీనిచ్చేలా 97వ రాజ్యాంగ సవరణను తేవటానికి పార్లమెంటులో అధికార, ప్రతిపక్ష పార్టీలను ఒప్పించారు. స్వతంత్ర భారతదేశాన్ని గణనీయంగా ప్రభావితం చేసే ఈ రాజ్యాంగ సవరణ 2012లో సాకారమైంది. ఇది తన ముగ్గురు హీరోలలో ఒకరైన కురియన్‌కు కానుక అని జేపీ తరచూ చెబుతూ స్థానిక సాధికారత ప్రాధాన్యతను వివరిస్తుంటారు.

## బి) అలందూర్

తమిళనాడులోని అలందూర్ మునిసిపాలిటీ లక్ష లోపు జనాభా ఉన్న చిన్న పట్టణం. ప్రస్తుతం చెన్నై కార్పొరేషన్‌లో భాగంగా ఉంది. మనదేశంలో స్థానిక వనరులతో, పౌరుల మద్దతుతో చక్కటి పారిశుద్ధ్య వ్యవస్థను నిర్మించుకున్న మొట్టమొదటి చిన్న పట్టణం ఘనతను అలందూర్ సాధించింది. ఇక్కడి స్థానిక ప్రభుత్వం ప్రజలకు వారు కట్టిన ప్రతి రూపాయికీ లెక్కచెబుతూ పారదర్శకంగా ప్రాజెక్టును పూర్తిచేసింది. దీంతో, అక్కడి జనం కొద్దికాలంలోనే పారిశుద్ధ్యం, ఆరోగ్యం, సుందరీకరణ వంటివి సాధించి లాభపడ్డారు. వారి ఇళ్ళ స్థలాల ధరలు కూడా భారీగా పెరిగిపోయాయి. నేషనల్ వాటర్ అవార్డు వంటి పురస్కారాలూ వచ్చి చేరాయి.

అలందూర్‌లో స్థానిక ప్రజల భాగస్వామ్యంతో భూగర్భ మురుగునీటి వ్యవస్థను నిర్మించటానికి ముందు, అంటే 1997 ప్రాంతంలో పట్టణంలో మురుగునీటి వసతి అధ్వాన్నంగా ఉండేది. ఇళ్ల నుంచి వ్యర్థ జలాలను ప్రధానంగా సెప్టిక్ ట్యాంకులలో సేకరించేవారు. ఆ నీటిని ఓపెన్ నాలాల్లో వేయటం వల్ల అనారోగ్యకర పరిస్థితులు తాండవిస్తుండేవి. సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేయడానికి వాహనాలు అందుబాటులో ఉండేవి కావు. మనుషులు కూడా దొరికేవారు కారు. ఈ నేపథ్యంలో మునిసిపల్ ఛైర్మన్ (ఆ తర్వాత రాజ్యసభ సభ్యుడయ్యారు) ఆర్.ఎస్ భారతి స్థానిక పరిస్థితులను మెరుగుపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. లబ్ధి పొందేవారందరినీ ఆ ఉమ్మడి లక్ష్యం దిశగా ఒక తాటి మీదకు తెచ్చారు. మునిసిపాలిటీకి వనరులు లేకపోవటంతో కమ్యూనిటీ భాగస్వామ్యంతో పీపీపీ నమూనాను అనుసరించాలని అందరినీ ఒప్పించారు. ఆ సమయంలో తమిళనాడు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నిధులతో పట్టణ ప్రాంతాల్లో చేపడుతున్న మురుగునీటి వ్యవస్థ నిర్మాణ ప్రాజెక్టులో అలందూర్ కూడా ఉండేలా భారతి చొరవ తీసుకున్నారు. మొత్తం 12 పట్టణాలను రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు ఎంపిక చేసింది. అలందూర్‌లో ప్రతిపాదించిన ప్రాజెక్టులో 19 కిలోమీటర్ల భూగర్భ మురికినీటి వ్యవస్థ, 101 కిలోమీటర్ల కనెక్షన్లు, మురుగునీటిని పంపే కేంద్రం, మురుగునీటి శుద్ధి కేంద్రం తదితరాలున్నాయి. ప్రజలు తమ ప్రయోజనమేమిటో గుర్తించి భాగస్వాములవటంతో.. ప్రాజెక్ట్ అలందూర్ పెద్ద హిట్ అయింది.

## సి) ప్రకాశం జిల్లాలో జేపీ సాధించిన సాగునీటి అద్భుతం

అలందూర్ అద్భుతాన్ని సాధించటానికి దశాబ్దం ముందే, 1986 ప్రాంతంలో లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ ప్రకాశం జిల్లాలో కలెక్టర్‌గా అదే తరహాలో 'జనం చేతికి అధికారం + జవాబుదారీతనం= అద్భుత విజయం' అనే ఫార్ములాతో స్వతంత్ర భారత్‌లోనే సాటిలేని విజయాన్ని సాగునీటి రంగంలో నమోదు చేశారు. ఎకరాకు కేవలం రూ.2,000 ఖర్చుతో మైనర్ ఎత్తిపోతల పథకాలను రైతుల భాగస్వామ్యంతో పూర్తిచేయించి 2,00,000 ఎకరాలకుపైగా (అన్ని రకాల పథకాలూ కలుపుకుని) సాగునీరు అందివ్వగలిగారు. గుండ్లకమ్మ, పాలేరు, మూసీ, మానేరు నదులపై, ఒగేరు తదితర డ్రెయిన్లపై 453 మైనర్ ఎత్తిపోతల పథకాలు, 70 మళ్లింపు పథకాలు, 2800 బోరు బావులతో ప్రజల భాగస్వామ్యం ద్వారా ఈ రికార్డును జేపీ సాధించారు. ఇందులో స్థానికంగా రైతులు సగం డబ్బు జేబులో నుంచి పెట్టుకోగా, మిగిలిన డబ్బును బ్యాంకులు రుణాలుగా ఇచ్చాయి. ఈ మొత్తం స్కీముల్లో రైతులు ఒక్క రూపాయి కూడా ఎగ్గొట్టకుండా బ్యాంకు కిస్తీలను సక్రమంగా, రుణాలను నిర్ణీత సమయానికి ముందే చెల్లించారు. ప్రభుత్వ, ప్రయివేటు పరంగా పెట్టిన పెట్టుబడులను దాటి లాభాలు చాలా స్వల్ప వ్యవధిలోనే వచ్చేశాయి. దాదాపు 20 ఏళ్లలో, రాష్ట్రంలోని 22 జిల్లాలలో అమలైన ఎత్తిపోతల పథకాల కంటే కేవలం ఈ ఒక్క జిల్లాలోనే మూడేళ్ల లోపల ఎక్కువ పథకాలు తక్కువ ఖర్చుతో పూర్తయినాయి! సర్కారు సాగులోకి తెచ్చిన భూమి కంటే ఎన్నో ఎక్కువ ఎకరాల్ని ప్రకాశం జిల్లాలో సాగులోకి తెచ్చారు.

హేతుబద్ధ లక్ష్యాన్ని ఎంచుకోవడం, దాని ద్వారా లబ్ధి పొందే ప్రజల్లోని శక్తిసామర్థ్యాలను లక్ష్యసాధన దిశగా

వినియోగించటం, అందుకు ఇతరులెవరూ అడ్డుపడకుండా చూడటం మినహా ఈ పథకాలు వేటిలో తాను ఎటువంటి జోక్యం చేసుకోలేదని జేపీ చెబుతుంటారు. ఈ పథకాలు దాదాపు అన్నీ ఇప్పటికీ విజయవంతంగా నడుస్తున్నాయి. 30ఏళ్ల తర్వాత హైదరాబాద్ నుంచి ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) అధ్యయన బృందం అక్కడికి వెళ్లినప్పుడు.. స్థానికులు ఎంతో ఆప్యాయంగా ఆతిథ్యమిచ్చి వివరాలు చెప్పారు. జేపీ కృషిని అక్కడి పెద్దలు అపురూపంగా పలుమార్లు ప్రస్తావించారు. మా గురించి జేపీ ఇంకా ఆలోచిస్తున్నారా? అని కూడా అడిగారు.

రైతులకు తమ ప్రయోజనమేమిటో పూర్తిగా తెలియచెప్పి, వారిని అందులో భాగస్వాముల్ని చేయటం ద్వారానే జేపీ ఈ అద్భుతాన్ని సాధించారు. కమ్మ గ్రామాలు, రెడ్డి గ్రామాలు.. ఇలా తరతరాలుగా ముఠాతగాదాలు నడుస్తున్న ఊళ్లను కూడా ఒక ఉమ్మడి ప్రయోజనం దిశగా జేపీ ఏకం చేశారు.

ప్రకాశంలో జేపీ కలెక్టర్‌గా ఉన్నప్పుడు మొట్టమొదటి ఎత్తిపోతల పథకం రూపుదిద్దుకున్న ఉలిచి గ్రామాన్ని 30 ఏళ్ల తర్వాత సందర్శించిన అనుభవాన్ని ఎఫ్‌డీఆర్ బృందం ఇలా క్రోడీకరించింది..

"1986 ప్రాంతంలో తన స్వగ్రామమైన ఉలిచిలో కరవు పరిస్థితులను చూసి చలించిన ప్రముఖ వైద్యుడు డా॥ మంచు చలమయ్య గారు, తమ ప్రాంత సాగునీటి అవసరాలను తీర్చడానికి గుండ్లకమ్మ నదిపై ఎత్తిపోతల పథకం నిర్మించాల్సిందిగా అప్పటి ప్రకాశం జిల్లా యంత్రాంగానికి లేఖ రాశారు. దీనిపై అప్పటి జిల్లా కలెక్టర్ డా॥ జయప్రకాష్ నారాయణ్ వెంటనే స్పందించారు. ఉమ్మడి అవసరాలను గుర్తించి ప్రజలే ముందుకొచ్చినప్పుడు, ప్రభుత్వం వారిని ఎట్టి పరిస్థితులలో ప్రోత్సహించాలని భావించారు. అదేరీతిలో జిల్లాలో 453 ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టారు. ఈ ఎత్తిపోతల పథకాలన్నిటిలో రైతులను భాగస్వాములను చేస్తూ వారికే నిర్వహణ బాధ్యతను అప్పగించారు. ఇలాంటి పాలనాపోకడ తెలుగునాట అదే ప్రథమం.

ఉలిచిలో గుండ్లకమ్మ నది మీద 'తెలుగు గ్రామీణ క్రాంతి పథం'కింద 'తారకరామ ఎత్తిపోతల పథకం' పేరిట గ్రామరైతులే ఎత్తిపోతలను నిర్మించుకున్నారు.

ఐదు లక్షల రూపాయల అంచనాతో రూపొందిన ఈ పథకానికి డా॥ చలమయ్య రూ. 2.5లక్షలను రుణం రూపంలో అందించారు. నిర్మాణపనుల పర్యవేక్షణ బాధ్యత తీసుకున్నారు. కేవలం 40 రోజులలో తొలిదశ పనుల్ని ఇతరుల సాయం లేకుండా గ్రామరైతులు పూర్తిచేసుకున్నారు. మొదటి దశలో 300 ఎకరాలు, రెండో దశలో 347 ఎకరాలు, మూడో దశలో 360 ఎకరాల చొప్పున వెయ్యి ఎకరాలకుపైగా సాగునీటిని అందించే ఏర్పాట్లను చేసుకున్నారు.

ఈ ఎత్తిపోతల పథకం అమలులో వివిధ బాధ్యతలను ఉలిచి రైతులు వారి మధ్యే విభజించుకున్నారు. ఎవరి పాత్రను వారు సక్రమంగా నిర్వహిస్తూ, భేదాభిప్రాయాలు వస్తే పరిష్కరించడానికి ముగ్గురు పెద్దమనుషులను సైతం నియమించుకున్నారు. గ్రామరైతుల సమష్టి కృషి ఫలితంగా జిల్లాలోనే ఉలిచి ఆదర్శగ్రామంగా గుర్తింపు పొందింది. తెలుగు నాట ఇతర జిల్లాలకే కాకుండా యావత్ దేశానికే దిక్సూచిగా నిలిచింది. గ్రామ ప్రయోజనాలను గుర్తించి కొంతమంది రైతులు వారి భూములను సైతం ఎత్తిపోతల పథకం కోసం త్యాగం చేశారు. ప్రభుత్వం చేత వారికి జేపీ పారితోషికం ఇప్పించారు (భూ సేకరణ చట్టం గురించే ప్రజలకు తెలియని దశలో, బ్రిటిష్ చట్టాలతో పాలకులు ప్రజల భూములను లాక్కుంటున్న తరుణంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు అప్పట్లో గరిష్ఠ నగదు పరిహారాన్ని, 8,000 కుటుంబాలలోని యువతకు శిక్షణతో ఉద్యోగాలను ప్లాంట్ స్పెషలాఫీసర్‌గా జేపీ ఇప్పించారు. ఇది తన ఐఏఎస్ కెరీర్ తొలిదశలో ప్రకాశం జిల్లా కలెక్టర్ కాకముందు).

తరువాతి కాలంలో ప్రభుత్వం నిధులను కేటాయించటంతో పథకం విస్తరణ, కాలువల మరమ్మతులు, నాపరాళ్లతో కాలువలకు లైనింగ్ పనులను చేపట్టారు. ఇంత ఆదర్శప్రాయ సమష్టి విజయం కాబట్టే.. ఈవేళ్టికీ జేపీ మార్గదర్శకత్వం, ప్రోత్సాహం గురించి ఉలిచి గ్రామస్తులు ఇంకా గుర్తుపెట్టుకుని ప్రస్తావిస్తున్నారు.

ఎంతగా వారు జేపీని అభిమానిస్తున్నారో ఆయన కలెక్టర్‌గా వేరే జిల్లాకు వెళ్తున్నప్పుడు 1989, జనవరి 14న 'క్రాంతిరేఖ' పేరుతో వారిచ్చిన అభినందన పత్రాన్ని చూస్తే తెలుస్తుంది. ఈ పత్రం కాపీని కూడా వారు మాకు ఇచ్చారు. ఇందులో..

'సామర్థ్యం, నిజాయితీ, చిత్తశుద్ధి, స్థితప్రజ్ఞత, సంయమన దృక్పథం కలిగి, అనురక్తితో అంకితభావంతో అహర్నిశలు, అలుపెరుగక సమాజం కొరకు పనిచేసి వెలలేని కీర్తిసంపదనార్జించిన మా జిల్లా కలెక్టరు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,

ఐఏఎస్ గారిని

ప్రేమించడం, అభిమానించడం, గౌరవించడం మా మహద్భాగ్యంగా భావిస్తాం.

మా మాగాణి భూములలో ప్రవహించే ప్రతి నీటి బిందువులో డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారు ప్రతిబింబిస్తారు.

మా భూములలో పండే ప్రతి వడ్ల గింజ మీద డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారి పేరు లిఖించబడి ఉంటుందని మా నమ్మకం.

మేము తినే మెతుకు మెతుకు మీద డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారి పేరు మెరుస్తూనే ఉంటుంది.

డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారి ఆశయాలు, ఉన్నత భావాలు భావితరాలవారికి ఆదర్శాలు కావాలని ఆశిస్తాం' అని రాశారు.

కలెక్టర్‌గా ప్రకాశం, ఆ తర్వాత తూర్పు గోదావరి జిల్లాల్లో ఇలా పెద్ద విజయాలను సాధించినా, ప్రభుత్వంలో అనేక ఉన్నత పదవులను నిర్వహించినా, పేరు తగ్గకుండానే కోట్ల సంపదను కూడబెట్టుకునే అవకాశమున్నా ఇప్పుడున్న వ్యవస్థలో ఒక నిజాయతీ, సమర్థ ఐఏఎస్‌గా నేననుకున్న దాంట్లో 20శాతం మార్పును మాత్రమే సాధించగలుగుతున్నా.. అదే వ్యవస్థను సరిచేసి ప్రజలను కేంద్రబిందువు చేయగలిగితే 80శాతం మేర సాధించగలను- అంటూ ప్రతి పౌరుని శక్తిసామర్థ్యాలూ ఈ దేశాభివృద్ధికి ఉపయోగపడేలా చేసే రాజకీయ, పాలనా సంస్కరణల కోసం ఆ తర్వాత జేపీ లోక్‌సత్తా రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. లోక్‌సత్తా సంస్కరణల్లో అధికార వికేంద్రీకరణ, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత ముందు వరసలో ఉండటానికి, 2003లో దేశంలోనే రికార్డుస్థాయిలో 1కోటీ 8లక్షాల సంతకాల సేకరణను, పలు ఉద్యమాలను లోక్‌సత్తా చేపట్టటానికి.. ప్రకాశం జిల్లా అనుభవాలు కూడా పెద్ద స్ఫూర్తి అనుకోవటానికి ఏమాత్రం సందేహించాల్సిన పన్లేదు".

## డి) తార్నాకవాసుల సంక్షేమ సంఘం

ప్రజల రోజువారీ జీవితాల్లో 80శాతం సేవలు సక్రమంగా అందాలంటే నగరాల్లో, పట్టణాల్లో నిధుల్ని, అధికారాల్ని వార్డు స్థాయికి, వీలైతే కాలనీ స్థాయికి కూడా వికేంద్రీకరించాలని హైదరాబాద్ తార్నాక అనుభవం రుజువు చేస్తోంది. తార్నాక రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టాండింగ్ కమిటీ (ఎస్సీవోటీఆర్‌డబ్ల్యుఏ) ప్రతి కార్యక్రమంలో అక్కడి ప్రజల్లో ఎక్కువమందిని భాగస్వాముల్ని చేస్తోంది. వారి శక్తిసామర్థ్యాలను వెలికితీస్తూ, అందరికీ లబ్ధి చేకూరుస్తోంది. సమస్యలను ఎవరో పైవారికి ఏకరువు పెట్టటం, పరిష్కారాలపై గందరగోళం, జాప్యాలు వంటివేమీ లేకుండా చాలా సందర్భాల్లో అక్కడివారు అవినీతికి ఆస్కారం లేకుండా, వేగంగా తమ పనుల్ని చేసుకోగలిగే నిర్ణయాల్ని తీసుకుని అమలు చేసుకుంటున్నారు. "ఓటుకు-తమ ప్రయోజనాలకు మధ్య సంబంధాన్ని ప్రజలు అర్థం చేసుకునేలా చేయటం, అధికారులలో జవాబుదారీతనం పెంచటం, తక్కువ రిస్కుతో కొత్త ఆలోచనల్ని అమలుచేయటం, ఇతర ప్రాంతాలకూ ఆదర్శంగా ఉండే పరిష్కారాలను అందించటం, నాయకత్వాన్ని పెంపొందించటం" - అధికార వికేంద్రీకరణ వల్ల కలిగే ఈ ఐదు ప్రయోజనాలూ తార్నాక అసోసియేషన్ కార్యక్షేత్రంలో మనకు కనిపిస్తాయి. ఈ రకమైన అవగాహనను ప్రజల్లో కూడా పెంచేందుకు స్టాండింగ్ కమిటీ న్యూస్‌లెటర్లను కూడా ప్రచురిస్తోంది.

ఇదే తరహాలో అపార్ట్‌మెంట్ అసోసియేషన్లలో కూడా అక్కడుండే వారందరికీ భాగస్వామ్యం, ప్రత్యక్ష జవాబుదారీతనం ఉండటం వల్ల మెరుగైన సేవలు లభిస్తున్నాయి.

## ఇ) ఇస్రో

ఇస్రో, బార్క్, కొన్ని ఇతర ప్రభుత్వరంగ సంస్థలు ప్రభుత్వాల కేంద్రీకృత ధోరణులు, నియంత్రణల వల్ల కాకుండా, స్వయంప్రతిపత్తి, సాధికారతల వల్ల విజయాలను సాధిస్తూ కాంతిరేఖల్లా భాసిల్లుతున్నాయి. ఇస్రో విజయాల గురించి ఇటీవలికాలంలో చాలామందికి కొంత అవగాహన ఏర్పడింది. ప్రత్యేకించి వివరించనక్కర్లేదు. ఇస్రోకి సారథిగా ప్రభుత్వ ఉన్నతాధికారులు కాకుండా శాస్త్రవేత్తలే ఉంటారు. సంస్థ అంతర్గతంగా కూడా మొత్తం అధికారాలన్నీ ఒకేచోట కేంద్రీకృతం కాకుండా వివిధ శాఖలవారీగా వికేంద్రీకరించి ఉంటాయి. ప్రభుత్వం అధికంగా జోక్యం చేసుకోకుండా కావలసిన నిధులను జవాబుదారీతనంతో కేటాయిస్తూ ఉంటుంది.

.. స్థానికంగా నిధులు, అధికారాలు, ప్రజలకు భాగస్వామ్యం ఉంటే అవినీతి తగ్గి దేశానికి ఇంత లాభం, నేతలకు,

అధికారులకు ఎంతో ప్రోత్సాహం లభిస్తున్నా కూడా- సంకుచిత, పెత్తందారీ ధోరణితో, సోమరితనంతో పాలకులు అధికార కేంద్రీకరణను కొనసాగిస్తూ జనానికి-ప్రభుత్వానికి మధ్య అడ్డుగోడల్ని పెంచుతున్నారు. అధికారమే లక్ష్యంగా.. ఎన్నికల గెలుపోటముల్లో బందీలుగా మారిపోయారు. ఒక కిలోమీటర్‌ప్రయాణానికి ఆటో ద్వారా అయ్యే ఖర్చు కంటే తక్కువ ఖర్చుతో మన 'ఇస్రో' శాస్త్రవేత్తలు మార్స్‌కి 'మామ్' ఉపగ్రహాన్ని ప్రయోగించారని గర్వంగా ప్రకటించిన ప్రధాని .. అలాంటి విజయాల్ని దేశ ప్రగతికి మూలమైన విద్య, ఆరోగ్యం వంటి రంగాలలో ఎందుకు సాధించలేకపోతున్నామో మాత్రం ఆలోచించలేకపోయారు. జవాబుదారీతనంతో కూడిన స్వయంప్రతిపత్తి, నిధులు, సాంకేతిక పరిజ్ఞానం ఉంటే అన్ని రంగాలలో ఇస్రోలాగానే విజయాలను లభిస్తాయన్న చర్చను ప్రజల్లోకి తేలేకపోయారు.

పాత బ్రిటీష్ మోడల్‌ను గుడ్డిగా అమలు చేస్తూ దేశమంతటినీ మూస పోసినట్టు ఒకే తీరుగా నిర్మాణం చేశారు.

కేంద్రానికి, రాష్ట్రానికి, స్థానిక ప్రభుత్వాలకు ఒకే తరహా పద్ధతులు అవలంబించటం వల్ల స్వయంపాలన సంకుచిత పాలనగా తయారై ప్రజల సమస్యల్ని జటిలం చేస్తోంది.

**మూడు) ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవలు:** ప్రజల సాధికారతకు కీలకమైన ఇంకో అంశం- వారికి రోజువారీ జీవితంలో హక్కుగా సేవలందటం!

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు, పాలకులు, అధికారులు కేవలం సేవకులే. కానీ ఓ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి సేవల్ని ఓ డిమాండ్‌గా సాధించుకునే పరిస్థితి స్వతంత్రం వచ్చి ఇన్ని దశాబ్దాల తర్వాతైనా మనదేశంలో సాధ్యమవుతోందా? ధ్రువపత్రాలు, మంచినీరు, విద్యుత్ కనెక్షన్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు.. దేనికైనా భయంభయంగా వెళ్లి చేతులు కట్టుకుని అడగాల్సిందే. మేం దరఖాస్తుతో పాటు ఫీజు కట్టాం, హక్కుగా సకాలంలో అందాలని డిమాండ్ చేసే ధైర్యం చాలామంది ప్రజలకు లేదు. ఏం కొర్రీ, కిరికిరి పెడతారోనని భయం. ప్రభుత్వాధికారులకు జీతాలను ఎడాపెడా పెంచే ప్రభుత్వాలు.. వారి చేత సేవలు చేయించేందుకు మాత్రం ధైర్యంగా కొరడా పట్టుకోలేకపోతున్నాయి. ప్రధానమంత్రి స్థాయిలోనూ అదే పరిస్థితి. శత్రుసైన్యాల మీదైనా దాడుల్ని చేయించగలరు గానీ.. సరిహద్దు లోపల సైనికుల్లా పనిచేయాల్సిన అధికారులను పనిచేయండని గదమాయించలేకపోతున్నారు. బ్రిటీష్ తరహా వలస పాలనా వ్యవస్థను నడుపుతున్న ఈ పాలకుల వల్ల ప్రజలు తమ సొంతదేశంలోనే ద్వితీయ శ్రేణి పౌరుల్లా బతుకుతున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే ఓ చిన్న ఉద్యోగి కూడా.. 90 శాతం ప్రజల కంటే శక్తిమంతుడుగా ఉన్నాడంటే అందుకు మన ప్రభుత్వాలు, బూజుపట్టిన నిబంధనలే కారణం. మరే దేశంలోనూ అధికారులకు-ప్రజలకు మధ్య ఇంత అంతరం లేదు. సమాచార హక్కు చట్టంతో, సాంకేతిక పరిజ్ఞానంతో కొంత పారదర్శకత పెరిగినా రహస్యాల పాలన కొనసాగుతూనే ఉంది, కొత్త పద్ధతుల్లో లంచాలు పెరుగుతూనే ఉన్నాయని పలు సర్వేలు, మన అనుభవాలు తెలుస్తున్నాయి.

పరిస్థితి ఎంతదాకా వచ్చిదంటే.. "లంచం తీసుకునే ప్రభుత్వాధికారి మీద మాత్రం అనుమతి లేకుండా కేసు బుక్ చేయకూడదట, గతి లేక ఓ సర్టిఫికెట్ కోసం యాభయ్యో, వందో లంచమిచ్చే సామాన్య పౌరుడ్ని మాత్రం అరెస్టు చేసి మూడేళ్లకు తగ్గకుండా జైలు శిక్ష వేయొచ్చు.." అని అవినీతి నిరోధక చట్టంలో ఈ దిక్కుమాలిన సవరణకు కేంద్ర ప్రభుత్వంతోపాటు అన్ని రాజకీయ పార్టీలూ మద్దతు పలికాయి. ఇలాంటి పరిస్థితుల్లో పౌరులు తాము కోల్పోయిన రిపబ్లిక్‌ను సాధించుకోవటానికి తగిన ఏర్పాట్లు ఉండాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎమ్మెల్యే ద్వారానో, ఎంపీ ద్వారానో పనిచేయించుకుని అందుకోసం ఓటును అమ్ముకోవడం, ప్రజాప్రతినిధుల అవినీతిని సహించటం పోవాలి. ఇక్కడ మార్పు వచ్చి, అధికారులు సేవకుల్లా ప్రజలు సార్వభౌముల్లా వ్యవహరిస్తూ రాజకీయ దళారీలు లేకుండా నేరుగా నాణ్యమైన సేవల్ని పొందగలిగితే చాలా పెద్ద మార్పు సమాజంలో కనిపిస్తుంది. చదువుకున్నవాళ్లు, సమాజానికి మేలు చేయాలనుకున్న నిజాయతీపరులు, సమర్థులు డబ్బు లేకున్నా నేరుగా ఎన్నికల రాజకీయాల్లోకి కూడా వచ్చి గెలవగలుగుతారు. ఎమ్మెల్యేలు ప్రభుత్వంలో భాగంగా వ్యవహరిస్తూ పోస్టింగులు, ట్రాన్స్‌ఫర్‌లలో జోక్యం చేసుకోవటం ఆపి చట్టసభలకే పరిమితమవుతారు, మంచి చర్చలతో ప్రయోజనకరమైన చట్టాలు రూపొందే అవకాశం ఉంటుంది.

**నాలుగు) స్వయందిద్దుబాటు ఏర్పాట్లు:** మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా నుంచి భారత్‌కు వచ్చాక చేపట్టిన మొట్టమొదటి ఉద్యమం చంపారన్ సత్యాగ్రహం. 1917లో. చదువుకున్న యువకులు బాబూ రాజేంద్ర ప్రసాద్, బ్రిజ్ కిషోర్, కృపలానీ, ముఝారుల్ హక్ వంటి వారి సహకారంతో ఆ ప్రాంతంలోని రైతుల సమస్యను క్షుణ్ణంగా అధ్యయనం చేసి సాక్ష్యాధారాలతో నివేదికను తయారుచేసి బ్రిటీష్ వారి మీద సంధించారు. ఒక క్రమపద్ధతిలో వలస చట్టాలను ఉపయోగించుకుంటూ గాంధీ చేసిన పోరాటానికి తెల్లదొరలు స్పందించారు. డబ్ల్యు.బి హేకాక్ వంటి బ్రిటీష్ అధికారులు గాంధీ పోరాటానికి ఆకర్షితులై అధ్యయనం కూడా చేశారు. కానీ స్వతంత్ర భారతదేశంలో ఈవేళ సమస్యలపై స్వదేశీ పాలకుల స్పందన ఎలా ఉంది? వలస

పాలకులపై గాంధీ చేసిన నిరాహారదీక్ష వంటి ఆందోళనాపద్ధతుల స్థానంలో రాజ్యాంగబద్ధమైన ఆందోళనాపద్ధతుల్ని మనం అభివృద్ధి చేసుకోలేకపోవటం ఒక సమస్యయితే.. మనం శక్తులన్నిటినీ కూడదీసుకుని హీరోయిజంతో భారీ ఆందోళనలు చేసినా స్పందించని ప్రభుత్వాల తీరు ఇంకా పెద్దసమస్య. తమ డిమాండ్ల సాధన కోసం ఎన్ని రోజులు దీక్షలు చేసినా ప్రభుత్వాలు స్పందిస్తాయని, దిద్దుబాటు చేసుకుంటాయనే నమ్మకం ప్రజల్లో దాదాపు కొరవడుతోంది. హింసాకాండకు పాల్పడటం, జనజీవనాన్ని స్తంభింప చేయటం వంటి వాటితో ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించటాన్ని ఇటీవల పోలీసు ఫోర్స్‌తో ప్రభుత్వాలు అణచివేస్తున్నందున.. ఇంకా వికృత మార్గాల్లో సంచలనాల్ని సృష్టించి సమస్యల్ని ప్రభుత్వం, సమాజం దృష్టికి తీసుకెళ్లాలని పలువురు తెగిస్తున్నారు. కొందరైతే ఈ క్రమంలో బలైపోతున్నారు. ఇంత చేసినా, ప్రభుత్వం ఏదో హామీ ఇచ్చినా.. పరిష్కారాలపై స్పష్టత లేకపోవటంతో మళ్లీ సమస్య మొదటికొస్తోంది. పోటీ ప్రపంచంలో గతంలో కంటే తీవ్ర ఉద్రిక్తస్థాయిలో ఉద్యమం చేస్తేగానీ ప్రభుత్వాన్ని కదలించలేని పరిస్థితి. ఈ మొత్తానికీ కారణం– మన పాలనా యంత్రాంగం, రాజ్యవ్యవస్థ స్వయంపరివర్తనా శక్తిని కోల్పోవడం! ప్రభుత్వ కార్యాలయాల్లో కావచ్చు, ప్రజాప్రతినిధులు, మంత్రివర్గంలో కావచ్చు, పోలీసు తదితర యంత్రాంగాల్లో కావచ్చు, ఎన్నికల్లో కావచ్చు, న్యాయవ్యవస్థలో కావచ్చు.. తప్పులు దృష్టికి రాగానే వెంటనే దిద్దుబాటు చేసుకునే ఏర్పాట్లు కరువయ్యాయి. ఇది ప్రజల ప్రజాస్వామిక హక్కులకు తీవ్ర విఘాతం కలిగిస్తూ అణగదొక్కుతోంది.

**ఐదు) విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు:** ప్రజలందరికీ సమాన ఎదిగే అవకాశాలు లభించటంలో నాణ్యమైన విద్య, ఆరోగ్యాలది ముఖ్య పాత్ర. మన పన్నుల డబ్బుతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు నడుస్తున్నా.. మంచి విద్య, సరైన వైద్యసేవల కోసం ప్రైవేటు సంస్థలను ఆశ్రయించాల్సిన దుస్థితి కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఒక్కో విద్యార్థి మీద ప్రభుత్వ పాఠశాల్లో ఏడాదికి రూ.50,000–70,000 ఖర్చు చేస్తున్నా పనికొచ్చే చదువు అందటం లేదు. చాలా ప్రయివేటు పాఠశాల్లో కూడా చెప్పుకోదగిన చదువు అందకపోయినా.. నిర్వహణ వల్ల గుడ్డిలో మెల్లలాగా అయినా చదువు అబ్బుతుందేమోన్న ఆశతో అప్పులు చేసి కూడా పిల్లల్ని పేద తల్లిదండ్రులు వాటిల్లో చదివిస్తున్నారు. అటు ప్రభుత్వ స్కూళ్లలో, ఇటు ప్రైవేటు స్కూళ్లలో చదువు ఎలా ఉందో పట్టించుకోవాల్సిన బాధ్యతను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటం వల్ల.. చివరికి సగానికిపైగా పిల్లలకు బేసిక్స్ లేకుండా పోయాయి. 8వ తరగతి చదువుతున్న పిల్లల్లో పలువురు చిన్న భాగాహారం కూడా చేయలేకపోతున్నారు, 5వ తరగతి విద్యార్థుల్లో అనేకులు 2వ తరగతి పాఠ్యాంశాన్ని చదవలేకపోతున్నారు. గణితం, విశ్లేషణ, తార్కికత, సృజనాత్మకత వంటి వాటిల్లోనైతే మన విద్యార్థులు సోదిలో కూడా ఉండటం లేదు. 2009లో 74 దేశాల మధ్య నిర్వహించిన సర్వేలో మన హైస్కూలు విద్యార్థులు 73వ స్థానంలో ఉన్నారు. ఇప్పటికీ ఆ పరిస్థితి మారలేదని, పైపైన సాధారణ స్థాయిలో చేసే తాజా దేశీయ సర్వేలు తెలియజేస్తున్నాయి. చదువుకు ఎంతో డిమాండ్ ఉన్నా ఈ విషాదకర పరిస్థితి నెలకొంది. నాణ్యమైన చదువు లేకుండా ఆదాయాన్ని పెంచే ఉపాధి ఎలా లభిస్తుంది? కులవివక్ష ఎలా పోతుంది?

ఆరోగ్యం విషయంలో మనదేశం ప్రపంచంలోనే అధమస్థాయి అని చెప్పుకునే స్థాయిలో ఉంది. మనకంటే శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్, చైనా తదితర పొరుగు దేశాలు మెరుగైన ఆరోగ్య సేవల్ని అందిస్తున్నాయి. జనాభా ఎక్కువ, బడ్జెట్ తక్కువ.. వంటివన్నీ కట్టుకథలని చైనా రికార్డు స్పష్టంచేస్తోంది. కేవలం ఆరోగ్య ఖర్చులను భరించలేక ఏటా మనదేశంలో సుమారు 6 కోట్ల మంది పేదరికంలోకి జారిపోతుంటే, ఎన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఏం లాభం? అంతకుముందు కాస్త మధ్యతరగతిలో ఉన్న కుటుంబం.. ఆస్పత్రిలో చేరితే పేదల జాబితాలోకి చేరిపోతోంది. ఆరోగ్య ఖర్చుల కోసం జనం జేబుల్లో నుంచి మనదేశంలో పెట్టే ఖర్చు– అంతర్జాతీయ సరాసరి కంటే ఐదు రెట్లు ఎక్కువగా ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు ఈ విషయంలో దేశంలోనే ముందు వరుసలో ఉన్నాయి. దేశంలో నివారించదగ్గ జబ్బులతో ఐదేళ్లలోపు పిల్లలు ఏటా 12లక్షలమందిదాకా మరణిస్తున్నారు. గర్భస్థ దశలో ఉన్నప్పుడు పిల్లలకు గుండె జబ్బులు, ఇతర అంగవైకల్యాలు రాకుండా ర్యుబెల్లా టీకాను ఇవ్వాలని లోక్‌సత్తా 18 ఏళ్లు పోరాడితే, ఎట్టకేలకు 2017లో సార్వజనీన టీకా కార్యక్రమంలో చేర్చారు. ఈ ఆలస్యం వల్లే 40–50లక్షలమంది నివారించదగ్గ వైకల్యాలతో ఈ దేశంలో పుట్టారు. ర్యుబెల్లా వల్ల మనదేశంలో ఏడాదికి ఎంతమంది నష్టపోతున్నారో మనలో చాలామందికి తెలియదుగానీ.. ఎక్కడో ఓ విదేశంలో ఒకట్రెండు డజన్ల మందికి వచ్చిన జికా వైరస్ గురించైతే మాత్రం మనం చాలా సంచలనంగా చర్చించుకున్నాం.

బ్రిటన్ 9శాతం, అమెరికాలాంటి దేశమైతే జీడీపీలో దాదాపు 17శాతం దాకా ఆరోగ్యరంగం మీద వెచ్చిస్తున్నాయి. మనం అంత చేయనక్కర్లేదని, ప్రభుత్వపరంగా దేశ జీడీపీలో కేవలం 2శాతం కేటాయింపుతోనే అందరికీ ఆరోగ్యం అందించే పథకాన్ని లోక్‌సత్తా జేపీ 2016లో కేంద్ర ప్రభుత్వానికి అందించారు. వివిధ దేశాల అనుభవాలు, 2005లో జాతీయ ఆరోగ్య మిషన్‌ని రూపొందించిన అనుభవంతో జేపీ ఈ నమూనాను తయారుచేశారు. వైద్యనిపుణులు, తక్కువ ఖర్చుతో మందులు

తయారుచేయగల కంపెనీలు వంటి భారత్‌కున్న గొప్ప సదవకాశాలను వివరించి చెప్పారు. అయితే ఆరోగ్యశ్రీ తరహాలో ప్రాథమిక వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేట్‌లకు, ప్రైవేటు ఆస్పత్రులకు ప్రయోజనం చేకూర్చేలా జాతీయ ఆరోగ్య పథకాన్ని కేంద్రం ఆమోదించింది. దీనివల్ల ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతుంది తప్ప.. ప్రజలకు మాత్రం ఆరోగ్యం అందదు. ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడని ఉద్యోగాల్లో ఊరికినే లక్షల జీతాలిస్తూ పోషిస్తున్న ప్రభుత్వాలు.. ప్రభుత్వాస్పత్రుల్లో నిపుణులైన వైద్యులు సేవలందించేందుకు వీలుగా వారికి సరైన జీతాలు కూడా ఇవ్వడం లేదు. ఏళ్ల తరబడి కష్టపడి ప్రజల ప్రాణాల్ని నిలబెట్టే నైపుణ్యాన్ని నేర్చుకుంటే.. ఆ డాక్టర్‌కి ప్రభుత్వం సాదాసీదా జీతం మాత్రమే ఇస్తోంది. అదే వైద్యుడు కార్పొరేట్ ఆస్పత్రిలో చేరితే నాలుగైదు లక్షల దాకా ఆర్జిస్తున్నాడు. దిగువస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సక్రమంగా లేకపోవటం వల్లే.. జిల్లా ఆస్పత్రులకు పెద్దఎత్తున పేషెంట్లు వస్తున్నారు. బెడ్‌లు లేక ఒకే బెడ్ మీద ఇద్దర్ని కుక్కుతున్నారు. కింద చాపలేసి వాటినే బెడ్‌లు అనుకోమంటున్నారు. ఒక్కో రోగికి కనీసం ఐదు నిమిషాలు కేటాయించలేని పరిస్థితిలో వైద్యం చేస్తున్నారు. అసలు సమస్య ఎక్కడుందో అర్థం చేసుకోకుండా.. ప్రచారార్భాటంతో వైద్యసేవలను అందిస్తూ ప్రజాప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నారు. ఆరోగ్య రంగానికి కూడా మనదేశంలో భారీ డిమాండ్ ఉంది. ప్రైవేటు రంగంలోని ఔత్సాహికులు కొత్త ప్రతిపాదనలతో వస్తున్నారు. దేశంలో నెలకు 11లక్షలమంది కొత్తగా ఉద్యోగాల కోసం మనదేశంలో రోడ్ల మీదకు వస్తున్నారు. ఒక్క ఆరోగ్య రంగాన్ని బాగుచేస్తే మనదేశంలో 2-3 కోట్ల ఉద్యోగాలను సృష్టించే అవకాశముంది. బ్రిటన్‌లో దాదాపు ఐదారుశాతం మంది జనాభాకి వైద్య ఆరోగ్య రంగమే ఉపాధిని కల్పిస్తోంది. మనదేశంలో ఆ సంఖ్య 1 శాతంలోపే. అయినా కూడా ప్రభుత్వంలో సమగ్ర ఆలోచన కనిపించటం లేదు.

ఉపాధినే తీసుకుంటే, దేశంలో మార్కెట్ సంస్కరణలు పెద్దఎత్తున సంపదను సృష్టిస్తున్నా.. పైన పేర్కొన్న మౌలికాంశాల్లో ప్రభుత్వాలు విఫలమవటం వల్లే దేశంలో కోట్లాదిమంది యువతకు ఉపాధి అవకాశాలు లభించటం లేదు. కొన్నిరకాల ఉపాధి అవకాశాలను ఉపయోగించుకునే, కొత్త ఉపాధి అవకాశాలను తమంతట తాము సృష్టించుకునే నైపుణ్యాలు కరవవుతున్నాయి. ఏటా 1 కోటీ 30 లక్షలమంది యువత కొత్తగా ఉద్యోగాల కోసం వస్తున్నా.. అందులో పదో వంతు ఉద్యోగాల్ని కూడా అందించలేకపోతున్నారు. సగం జనాభాగా ఉన్న అమ్మాయిలు ఉద్యోగాలు చేయకుండా వంటలు చేయాలనుకుంటున్నారు కాబట్టి.. కొత్తగా వచ్చే నిరుద్యోగుల సంఖ్య 75 లక్షలే ఉంటుందని ఒక సర్కారీ ఆర్థిక నిపుణుడు విచిత్రమైన వ్యాఖ్యానం చేశారు. ఇంట్లో వంటపనిని స్త్రీ, పురుషులిద్దరూ షేర్ చేసుకోలేరా?.. అవకాశాలను ఉన్నకొద్దీ పరిమితం చేస్తూ ప్రజల ఉత్సాహాన్ని, చొరవను తొక్కేస్తున్నారు. చదువుల్లో నాణ్యత లేకపోవటం వల్ల నైపుణ్యాల్ని ప్రత్యేకించి అందించాల్సి వస్తోంది. అయితే నైపుణ్యాల శిక్షణను కూడా ప్రహసనంగా మార్చేశారు. విద్యాసంస్థల్లో సర్టిఫికెట్లు పొందినవారికి కొత్తగా నైపుణ్య కేంద్రాల నుంచి నైపుణ్యాలేవో అందినట్టు ఉద్యోగసంస్థలు భావించటం లేదు. అయినా ప్రభుత్వాలేమీ పెద్దగా స్పందించటం లేదు.

యువతను అవమానించే నిరుద్యోగ భృతిని ఓ గొప్ప పథకంలా నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. నిరుద్యోగ భృతి+స్మార్ట్‌ఫోన్+మద్యం దుకాణాల సమీకరణతో కోట్లాది యువత ఓటు వేసే యంత్రాలుగా, మార్కెట్ వినియోగ దారులుగా మిగిలిపోవాలనే కుట్రపూరిత కృతనిశ్చయానికి వచ్చినట్టు పాలకులు వ్యవహరిస్తున్నారు.

ఇప్పటికీ దేశజనాభాలో అత్యధికంగా వ్యవసాయం మీదే ఆధారపడినందున, వ్యవసాయేతర రంగాల్లోనూ ఉపాధి మందగించినందున, యువతలో నిరుద్యోగం పెద్దఎత్తున ఉన్నందున.. మన ఉపాధి అవకాశాలలో వ్యవసాయానిది పెద్దపాత్ర. వ్యవసాయాన్ని సరైన రీతిలో బాగు చేసి పంట ఉత్పత్తులకు రైతు/కౌలురైతులకు లాభసాటి ధర వచ్చేలా సంస్కరణల్ని తెస్తేనే ఉపాధి అవకాశాల్ని తగినన్ని సృష్టించగలం. లేకుంటే వ్యవసాయం-గ్రామాలు-ఉపాధి రంగాల్లో సంక్షోభం ఉన్నకొద్దీ తీవ్రమై ముందు రాజకీయ, ఆర్థిక, సామాజిక కల్లోలానికి దారితీస్తాయి. కానీ రైతులు ఆత్మహత్య చేసుకున్నాక రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించటం తప్ప.. వాళ్లు బతికిఉన్నప్పుడు వారి ఆదాయాన్ని పెంచే విధానాలను అవలంబించటం మీద ప్రభుత్వాలకే కాక పార్టీలకూ శ్రద్ధ లేదు. రైతు బతికుంటే ఇబ్బడిముబ్బడిగా పంట పండిస్తాడన్న స్పృహ లేదు. నకిలీ విత్తనాలు, ఎరువులు, కూలీల కొరత, కల్తీ పురుగుమందులు, కరువులు, వరదలు.. ఈ గండాలన్నీ దాటుకుని రైతు పంట పండించినా.. గిట్టుబాటు ధరలేక కుంగిపోతున్నాడు. పాలకుల పాపమే తప్ప ప్రకృతి శాపం ఇందుకు కారణం కాదు. 2014-17 మధ్య ప్రభుత్వం ఎగుమతుల్ని దెబ్బతీసే విధానాలను, పప్పుధాన్యాలు, వంటనూనెల దిగుమతుల్ని ప్రోత్సహించే విధానాలను అనుసరించటం వల్ల మనదేశంలో రైతులకు ఏడాదికి రూ.1,40,000 కోట్ల మేర డిమాండ్ పడిపోయింది. అంటే కనీసం రూ.4లక్షల కోట్ల నష్టం. రుణమాఫీలు, ఉచిత తాయిలాలు, రైతే రాజు, గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు వంటి నినాదాలు నేతలు ఓట్లు కొల్లగొట్టడానికి తప్ప రైతును ఆదుకోవటానికి ఉపయోగపడటం లేదు. చాలా వ్యవసాయోత్పత్తుల్లో మార్కెట్లో వినియోగదారుడు కొనే సొమ్ములో కేవలం

30శాతం మాత్రమే రైతుకు దక్కుతోంది.

పై ఐదు అంశాలూ.. ఎన్నికైన ప్రభుత్వాలు మొట్టమొదటి ప్రాథమ్యంగా చేయాల్సిన ముఖ్యమైన పనులు! ఇవి లేకుండా స్వరాజ్యం అంటే, అది దొంగ స్వరాజ్యమే. స్వతంత్ర భారతంలో జనం జీవితాల్లో ఎప్పుడో రావాల్సిన మార్పులివి. కానీ ఇప్పటికీ రాలేదు.

మనకి డబ్బు లేదా అంటే.. సరిపోయినంత సొమ్ముల్ని మనం పన్నులుగా కడుతున్నాం.

కానీ ప్రభుత్వాలు ప్రజలకు కావలసిన ఈ ఎజెండాని వదిలేసి.. ప్రజలు ఆలోచించకుండా ఓట్లు వేసే తాత్కాలిక తాయిలాల చుట్టూనే చర్చను తిప్పుతున్నారు.

మనం కాస్త అవగాహన తెచ్చుకుని అడగటం మొదలుపెడితేనే, ఈ పనులు జరుగుతాయి. మన జీవితాలు నిజంగా మెరుగవుతాయి. అప్పుడే సురాజ్యం.

## 3. ఎలా చేయాలి?

పైన పేర్కొన్న

ఒకటి) విద్య, ఆరోగ్యం, ఉపాధి

రెండు) స్థానిక స్వయంపాలన

మూడు) ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పనులు జరగటం

నాలుగ) స్వేచ్ఛ–చట్టబద్ధ పాలన

ఐదు) స్వయందిద్దుబాటు వ్యవస్థలు

మౌలిక అంశాల చుట్టూ ఎక్కడికక్కడ స్థానికంగా కార్యక్రమాల్ని చేపట్టాలి. వాటిల్లో పరిష్కారాలు నిర్దిష్టంగా ఉండాలి. కార్యాచరణకు టూల్స్‌లా కొన్ని అంశాల్ని, చట్టప్రతిపాదనల్ని, కార్యక్రమాల్ని వినియోగించాలి. మూలాల నుంచి వైదొలగకుండా.. స్థానికంగా ఎవరి సొంత భాషలో, యాసలో వారు ఈ కార్యక్రమాల్ని నిర్వహించుకోవాలి.

అంశాల వారీగా చూస్తే..

**స్వేచ్ఛ–చట్టబద్ధపాలన కోసం..** స్థానిక న్యాయస్థానాల ఏర్పాటు, న్యాయ, పోలీసు సంస్కరణలు వంటి వాటి చుట్టూ కార్యాచరణను రూపొందించుకుని అమలు చేయవచ్చు.

**స్థానిక స్వయంపాలన కోసం..** మూడో దశ ఫెడరలిజం కోసం కార్యాచరణను తీసుకోవాలి. అందులో భాగంగా జాతీయ సమగ్రత, దేశ ఐక్యత పరిధిలో.. కేంద్రం నుంచి రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు, స్థానిక ప్రభుత్వాలకు అధికార వికేంద్రీకరణను సాధించుకోవాలి. అంటే 'మూడంచెల (కేంద్రం–రాష్ట్రం–స్థానిక ప్రభుత్వాలు) మూడో దశ ఫెడరలిజం' ఇప్పుడు లక్ష్యం కావాలి.

స్థానికంగా.. మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్లు, వార్డులు, పంచాయతీలకు నిధుల్ని నేరుగా బడ్జెట్ నుంచే కేటాయించాలని కార్యక్రమాలను చేపట్టవచ్చు. ఈ నిధుల్ని తలసరి.. అంటే ఒక్కో పౌరుని పేరు మీద ఇంతని– కనీసం రూ.1000 ఉండేలా డిమాండ్లు రూపొందించుకోవాలి. నగర ప్రాంతాల్లో తలసరి కేటాయింపు ఇంకా ఎక్కువగా ఉండాలి. అలాగే ఈ స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను పూర్తిస్థాయిలో కేటాయించేలా చూసుకోవాలి. సహకార సంస్థల్ని ఏర్పాటు చేసుకుంటూ స్థానిక పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా, వారికి తక్షణ లాభం కనిపించేరీతిలో కార్యక్రమాల్ని నిర్వహించుకోవాలి. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే నిధుల్లో 50శాతం విధిగా స్థానిక ప్రభుత్వాలకు అందాలి. స్థానిక ప్రభుత్వాల్లో తప్పు జరిగితే చర్యలు తీసుకోవటానికి జిల్లా స్థాయిలో అంబుడ్స్‌మన్ ఏర్పాటును డిమాండ్ చేయాలి. మునిసిపల్ వార్డు కమిటీల వ్యవస్థను ప్రక్షాళన చేసి, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు వాటిలో చోటు కల్పించి చట్టం పరిధిలోనే వాటికి స్వేచ్ఛనిచ్చేలా చేయాలి. ట్యాక్స్ పేయర్స్ తరపున కార్యక్రమాల్ని నిర్వహించాలి. స్థానిక సాధికారత వల్ల అవినీతి ఎంత తగ్గుతుందో, ప్రజల్లో అవగాహన పెంచాలి. కొన్ని ఉదాహరణలను చూస్తే.. హైదరాబాద్ కూకట్‌పల్లిలో భవనాల క్రమబద్ధీకరణలో జరిగిన అవినీతి, అక్రమాలపై లోక్‌సత్తా ఉద్యమ సంస్థ చేసిన పోరాటం వల్ల లంచం డబ్బుల్ని సైతం అధికారులు తిరిగి ప్రజలకు చెల్లించారు. అలాగే పెట్రోలు బంకుల్లో తూనికల అవకతవకలపై 1997–98లో లోక్‌సత్తా చేపట్టిన చిన్న పోరాటం వల్ల ఆనాటి పెట్రోలు బంకులన్నీ కూడా మీటర్లను సరిచేసుకున్నాయి. దీనివల్ల వినియోగదారులకు కోట్ల రూపాయల లాభం

చేకూరింది. పక్క రాష్ట్రాల్లో ధాన్యానికి ఎక్కువ ధర ఉన్నా కూడా అమ్ముకోనీయకుండా మన రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా విధించిన ఆంక్షలకు వ్యతిరేకంగా రైతులను సమీకరించి కర్నూలు నుంచి కర్ణాటక వరకు, నిజామాబాద్ నుంచి మహారాష్ట్ర వరకు లోక్‌సత్తా చేసిన రైతు సత్యాగ్రహ యాత్ర వల్ల తెలుగునాట రైతులకు ఒక్క సీజన్‌లో, ఒక్క బీపీటీ వెరైటీకి దాదాపు రూ. 3,500 కోట్ల మేర లాభం చేకూరింది. ఇవన్నీ కూడా ఆలోచనతో, ఎక్కడికక్కడ ప్రజలను భాగస్వాములను చేస్తూ సాధించిన పెద్ద విజయాలు. స్థానిక సమస్యలపై అవగాహనతో, పరిష్కారాలతో, సమష్టిగా పనిచేస్తే ఇలాంటి విజయాల్ని వైబీఐ సాధించవచ్చు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పనులు:** ఇందుకోసం 'పౌర సేవల' చట్టం వంటి ఏర్పాట్ల సాధన కోసం కార్యక్రమాలు చేయాలి. ఈ చట్టం వల్ల ప్రతి పనికి సంబంధించిన వివరాలనూ ప్రభుత్వ కార్యాలయాల్లో సిటిజన్ ఛార్టర్లుగా ప్రదర్శిస్తారు. ఒక్కో పనికి ఒక్కో నిర్దిష్ట గడువు ఉంటుంది. ఆ గడువులోగా పని పూర్తిచేయకపోతే.. దరఖాస్తు చేసుకున్న ప్రజలకు రోజుకు కనీసం రూ. 250 చొప్పున పరిహారం చెల్లిస్తారు. దీనివల్ల రోజువారీ సేవల్లో లంచాల బెడద, వేధింపులు తగ్గుతాయి. ఇక ఉన్నతస్థాయి ప్రభుత్వోద్యోగులు–పాలకులు కుమ్మక్కయి ప్రజల సొమ్మును మింగేసే అవినీతిని అడ్డుకోవటానికి బలమైన లోక్‌పాల్ ఏర్పాటు, ఏసీబీకి స్వతంత్ర ప్రతిపత్తి వంటి వాటి కోసం కృషి చేయాలి.

**స్వయందిద్దుబాటు..** తప్పు జరిగిన వెంటనే నాయకులు, పాలకులతో సంబంధం లేకుండా ఆటోమేటిక్‌గా దిద్దుబాటుకు.. లోక్‌పాల్, అంబుడ్స్‌మన్ వంటి సంస్థల్ని పటిష్టంగా ఏర్పాటు చేసి అవినీతిపరుల ఆటకట్టించటం, ఒకసారి ప్రభుత్వోద్యోగంలో చేరితే ఇక పీకేవారుండరు అనే పద్ధతికి స్వస్తిచెప్పి పనితీరును బట్టి పదవీకాలాన్ని నిర్ణయించటం, సమాజంలో సమర్థుల్ని నిర్దిష్ట కాలపరిమితితో ప్రభుత్వోద్యోగాల్లో నియమించటం, న్యాయ, పోలీసు వ్యవస్థల్లో జవాబుదారీతనానికి ఏర్పాట్లు చేయటం, చట్టసభల పనితీరు మెరుగుపరచటానికి కచ్చితమైన నిబంధనల్ని అమలు చేయటం, రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పెంపొందించే చర్యలు వంటి వాటి కోసం పనిచేయాలి.

**విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల కోసం..** అందరికీ నాణ్యమైన విద్యను, ఆరోగ్యాన్ని అందించటం ప్రభుత్వ బాధ్యత. ఈ రంగాల్లో ప్రభుత్వాలు విఫలమవటం వల్లే ప్రైవేటు రంగం బలపడింది. ఇప్పుడు ప్రైవేటుతో సంబంధం లేకుండా ప్రభుత్వ రంగ పాఠశాలల్ని, ఆస్పత్రుల్ని బలోపేతం చేసి నాణ్యమైన చదువును, సేవల్ని అందిస్తామంటే.. పుణ్యకాలం పూర్తయిపోతుంది. కొన్ని తరాలు నష్టపోయే ప్రమాదముంది. అందువల్ల విద్యార్థి చుట్టూ చదువు, రోగి చుట్టూ వైద్యం మన లక్ష్యం కావాలి. ప్రభుత్వమే నేరుగా అందిస్తుందో లేదా ప్రైవేటు సేవల్ని తీసుకుని అందిస్తుందో మనకనవసరం.. జేబులో నుంచి ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా ప్రతి బిడ్డకూ మంచి చదువు అందాలి, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం అందాలి. ఇందుకోసం విద్యార్థి తనకు నచ్చిన స్కూలును ఎంచుకునే అవకాశం, ఆ స్కూలు ఫీజును ప్రభుత్వమే రీఇంబర్స్ చేయటం, పర్యవేక్షణ అథారిటీ ఏర్పాటు, విద్యార్థుల ప్రతిభను మూల్యాంకనం చేయటానికి ఆహ్లాదకరమైన పరీక్షా పద్ధతులు, మాతృభాషలోనే ప్రాథమిక విద్య, ఇంగ్లీషును విధిగా ఒక సబ్జెక్ట్‌గా బోధించటం వంటి చర్యలను విద్యారంగంలో ప్రతిపాదించవచ్చు.

ఆరోగ్య రంగంలో.. బ్రిటన్ తరహా సార్వత్రిక ఆరోగ్య విధానాన్ని అమలు చేయాలి. అంటే అందరికీ వైద్యం అందుబాటులోకి రావాలి. ఇందుకోసం.. ప్రతి కుటుంబానికీ ఫ్యామిలీ డాక్టర్ పద్ధతిని ప్రవేశపెట్టాలి. ప్రతి కుటుంబం ప్రభుత్వం ఇచ్చిన ప్యానెల్ నుంచి తమకు నచ్చిన ఓ డాక్టర్‌ని ఎంపిక చేసుకుంటుంది. ఆ డాక్టర్‌కు ఏడాదికి ఇంతని ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుంది. తన వద్ద నమోదైన కుటుంబాల వారందరి సమాచారం డాక్టర్ వద్ద నమోదై ఉంటుంది. ఫ్యామిలీ డాక్టర్ సిఫార్సు మేరకే ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యాన్ని ఎవరైనా పొందగలుగుతారు. ఈ రకంగా వ్యాధుల్ని నిరోధించటం, ప్రజలకు పారదర్శకంగా వివరాల్ని తెలియచేయటం వంటి ప్రాతిపదికలతో ప్రజలకు ఎటువంటి భారం లేకుండా నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేలా చేయాలి.

ఉపాధి అవకాశాలకు సంబంధించి తక్షణ, దీర్ఘకాలిక ప్రమాణాల మీద దృష్టి పెట్టాలి. నైపుణ్యాలను అందించే నాణ్యమైన విద్యను అందించటం మీద ఓపక్క, ఇప్పటికే పట్టభద్రులైనవారు అప్పటిదాకా నష్టపోకుండా పటిష్టమైన నైపుణ్యాలను అందించటం మీద ఇంకోపక్క దృష్టి కేంద్రీకరించాలి. ఎన్ని ఉద్యోగాలిస్తారు అనే దాన్ని బట్టే పరిశ్రమలకు, ఇతర సంస్థలకు రాయితీలివ్వాలి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు పెద్దఎత్తున వలసలు పోకుండా, గ్రామాలను చిన్న పట్టణాలతో అనుసంధానం చేయాలి. ఆ చిన్న పట్టణాల్లో వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి, వాటిని ఆర్థిక కలాపాల కేంద్రాలుగా తీర్చిదిద్దాలి. 'రైతుకి/కౌలురైతుకి ఆదాయం' చుట్టూ నాణ్యమైన విత్తనాల సరఫరా నుంచి వ్యవసాయ సంస్కరణలు ఎజెండాగా కార్యక్రమాలు నిర్వహించాలి. సాగుతోపాటు పాలు, చేపలు తదితర రంగాల్లో సహకార రంగాన్ని పెంపొందించాలి. ఉపాధిని అందించే లేదా సృష్టించుకోగలిగిన శక్తినిచ్చే చదువును అందించటంతోపాటు తాత్కాలిక అవసరంగా నైపుణ్యాల శిక్షణను పటిష్టమైన రీతిలో

అమలుచేయటం, ఇచ్చే ఉద్యోగాల సంఖ్యను బట్టే పరిశ్రమలకు రాయితీలివ్వటం విధానాలను అమలు చేయించాలి.

పైన పేర్కొన్నవన్నీ కొన్ని పరిష్కారాలు మాత్రమే. వివరాలను 'ఎఫ్‌డీఆర్ఇండియాడాటార్గ్'లో చదవొచ్చు.

## 4. ఇవికాకుండా

ఈ ఐదు అంశాలకు సంబంధించి స్థానికంగా, రాష్ట్రాల మీద ప్రభావం చూపేవే అయినా.. కొన్ని ఇతర సంస్కరణల కోసం జాతీయస్థాయిలో కూడా కృషి చేయాల్సి ఉంది. దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి ఎన్నికల సంస్కరణలు, జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్, జాతీయ జ్యుడీషియల్ సర్వీస్, వ్యవసాయ ఎగుమతులు-దిగుమతులు వంటివి ఇందులో ఉన్నాయి. కేంద్ర-రాష్ట్ర సంబంధాల పునర్నిర్వచనలో కూడా దేశవ్యాప్త స్థాయి ప్రయత్నం అవసరం.

ఈ మౌలికాంశాల్ని, కాలపరీక్షలకు నిలిచిన, పైన పేర్కొన్న పరిష్కారాల ప్రాతిపదికన స్థానిక కోణంలో ఉపయోగించుకుంటూ ఎక్కడికక్కడ మార్పుల్ని సాధించుకుంటూ విస్తరించటం నిరంతరాయ కార్యక్రమంగా జరుగుతుండాలి.

రాజ్యాంగ విలువల పరిరక్షణ, చట్టసభల ప్రక్షాళన, పార్టీల నిధుల సేకరణ, మేనిఫెస్టోల్లో హామీలు, అభ్యర్థుల ఎంపిక, బ్యాంకింగ్, సహకార రంగాల పటిష్టత, పలు పాలనాసంస్కరణలు వంటి వాటిపైనా క్రమంగా దృష్టి సారించాల్సి ఉంటుంది.

## 5. స్థానిక పరిస్థితులకనుగుణంగా..

పన్నుల డబ్బుకు-ఓటుకు ఉన్న సంబంధంపై ఆలోచన పెంచుతూ ఏ అంశంపైనైనా.. సంబంధిత ప్రజానీకమంతటినీ భాగస్వాముల్ని చేయాలి. ఇందుకోసం స్థానిక పరిస్థితుల్ని, అవసరాల్ని జోడిస్తూ.. ప్రతి అంశంపై నిర్దిష్ట పరిష్కారాలతో ప్రజల్ని చైతన్యపరుస్తుండాలి. అవగాహనతో, సంఘటితంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ పోరాడితేనే మార్పుని త్వరగా సాధించగలం.

ఈ మొత్తం పోరాట కార్యక్రమాలకు పునాదిగా 'ప్రజల పన్నుల డబ్బు-తమ ఓటు ద్వారా తమకు అందుతున్న సేవలు' అనే సూత్రం పనిచేస్తుండాలి. తాము కడుతున్న పన్నులకు తగ్గ సేవలు ఎందుకు అందటం లేదు? అవి అందటానికి అనుగుణంగా ఉపయోగించాల్సిన ఓటును, భావప్రకటనా స్వేచ్ఛను సరిగా ఉపయోగిస్తున్నామా? అనే ఆలోచనను ప్రజలలో రేకెత్తించాలి.

.. అధికారం లేకుండా ఇలా మార్పులను తేవటం సాధ్యమా? అన్న సందేహం కలగొచ్చు. కానీ కచ్చితంగా సాధ్యం. ప్రపంచంలో చాలా మార్పులు ఇలా సాధ్యమయ్యాయి. లోక్‌సత్తాయే ఇందుకు ఉదాహరణ.

ఒక్క ఎంపీ కూడా లేకుండా లోక్‌సత్తా దేశంలో మూడు కీలకమైన రాజ్యాంగ సవరణల్ని సాధించింది, ఏడెనిమిది పెద్ద చట్టాలను సాధించింది, జాతీయస్థాయిలో, రాష్ట్రాల్లో పలు విధానపరమైన మార్పులకు శ్రీకారం చుట్టగలిగింది. ఒకోసారి ప్రతికూల పరిస్థితుల వల్ల వేగం నెమ్మదించవచ్చుగానీ, మన లక్ష్యాల్ని సాధించకుండా ఆపే శక్తి ఎవరికీ లేదు. ఎందుకంటే, మన చుట్టూ, రాష్ట్రంలోనూ, దేశంలో కూడా ఇవి తప్ప పరిష్కారాలు లేవు. ఇందుకోసం ఈరీతిలో ప్రయత్నించటం తప్ప మార్గం లేదు.

మీరు దేవుడ్ని నమ్మే వాళ్లయితే, ఇంతకంటే గొప్ప పూజ ఇంకోటి లేదు. తిరుపతికో, మరో పుణ్యక్షేత్రానికో వందసార్లు వెళ్లి వచ్చే కంటే ఒక్కరోజు ఇలాంటి సామాజిక కార్యక్రమం నిర్వహించటం ఉత్తమ ఫలాన్ని ఇస్తుంది. అందుకే మీ వ్యక్తిగత అభివృద్ధి, మున్ముందు మీ గుర్తింపుకు, అంతిమంగా మీ సుఖసంతోషాలకు కూడా యూత్ ఫర్ బెటర్ ఇండియా ద్వారా ఎక్కడికక్కడ పై అంశాల చుట్టూ కార్యక్రమాలను నిర్వహించటం అత్యుత్తమ మార్గం.

## 6. వైబీఐ లక్ష్యాలు- జేపీ మెంటారింగ్- సంస్థాగత నిర్మాణం ఈ మొత్తం నేపథ్యంలో వైబీఐ లక్ష్యాలు మూడు:

1) యువతని సమర్థవంతులైన పౌరులుగా, దేశంలో దీర్ఘకాలిక మార్పుల్ని తెచ్చే యోధులుగా తయారు చేయటం

2) యువత వ్యక్తిత్వాన్ని వికసింపచేసి వారిలో నాయకత్వ లక్షణాల్ని పెంపొందించేందుకు దోహదం చేసే రీతిలో నిపుణులతో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించటం

3) ఎక్కడికక్కడ యువతను సంఘటిత పరిచి.. సిద్ధాంత పటిమతో, స్పష్టమైన అవగాహనతో స్థానికంగా ఆచరణాత్మక పరిష్కారాలను సంఘటిత శక్తితో సాధించుకునేలా చేయటం

యూత్ ఫర్ బెటర్ ఇండియా నిర్మాణం పూర్తి ప్రజాస్వామ్యయుతంగా ఉంటుంది. ఇదో ఓపెన్ ప్లాట్‌ఫాం. ఎవరూ నాయకులు ఉండరు. టీంకి 10మంది చొప్పున బృందాలుగా పనిచేస్తుంటారు. వార్డులు, కాలనీలు, వీథుల ప్రాతిపదికన కూడా బృందాల్ని ఏర్పరచుకోవచ్చు. సమన్వయకర్తలుగా సీనియర్లు, కాస్త ఎక్కువ సమయం ఇవ్వగలిగినవారు ఉంటారు. ఎఫ్‌డీఆర్ ప్రధాన కార్యదర్శి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ మెంటార్‌గా వ్యవహరిస్తారు.

కార్యక్రమాల్ని అవసరమైతే ఉమ్మడిగా నిర్వహించుకోవచ్చుగానీ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ప్రతి రాష్ట్రానికీ వేర్వేరుగా కన్వీనర్లు ఉంటారు. ఇప్పటికే కాస్త ఎక్కువ అవగాహన ఉన్నవారికి, ఎక్కువ సమయం ఇవ్వగలిగినవారికి హైదరాబాద్‌లో శిక్షణా కార్యక్రమాల్ని నిర్వహిస్తారు. అందులో వైబీఐ చేపట్టాల్సిన అంశాలు, పరిష్కారాలు, కార్యాచరణ గురించి ప్రత్యక్షంగా వివరిస్తారు. వీరంతా తమ నగరాలు, పట్టణాలు, వార్డులు, కాలనీలు, గ్రామాలకు వెళ్లి అక్కడ సహచరులకు తెలియచేస్తారు. సమన్వయకర్తల ద్వారా సంధానం చేసుకుంటూ.. పెద్ద పట్టణాలు, నగరాల్లో కొన్ని అంశాలపై టీంలు కలిసి కూడా వైబీఐ కార్యక్రమాల్ని నిర్వహించవచ్చు. అందరూ తమ అనుభవాలను, అభిప్రాయాలను జేపీతో సామాజిక మాధ్యమాలైన ట్విట్టర్, ఫేస్‌బుక్ ద్వారా పంచుకోవచ్చు. వైబీఐ వెబ్‌సైట్ (డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.యూత్‌ఫర్‌బెటర్‌ఇండియాడాట్‌కామ్)లో ఎన్‌రోల్ అయితే వీటన్నిటి గురించి వివరంగా తెలుసుకుని తేలిగ్గా అనుసరించవచ్చు.

## 7. కార్యక్రమాల్లో పాల్గొనకున్నా.. 'కనెక్ట్ విత్ జేపీ' కోసమే వైబీఐలో నమోదవ్వచ్చు

జేపీ పట్ల వ్యక్తిగతంగా ఎంతో అభిమానమున్నా కూడా.. లోక్‌సత్తా సంస్థ ద్వారానో, పార్టీ ద్వారానో, మరోటి ద్వారానో పనిచేయటం పట్ల కొంత విముఖత ఉన్నవారు తెలుగు రాష్ట్రాల్లో చాలామంది ఉన్నారు. ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఉద్యమం, లోక్‌సత్తా పార్టీ, లోక్‌సత్తా 2.0.. ఇలా వేదిక ఏదయినా మౌలికంగా లక్ష్యం ఒక్కటే– 'వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలనందించటం, నివారించదగ్గ బాధలను తొలగించటం'. వేదికలు మారటమంటే లేబుల్స్ మార్చటమే. అయినా కూడా ఆ వేదికల ద్వారా కార్యక్రమాల్లో పాల్గొనటం ఇష్టంలేని యువత నేరుగా యూత్‌ఫర్‌బెటర్‌ఇండియాలో నమోదై కేవలం జేపీతో ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇతరత్రా సోషల్ మీడియా మార్గాల్లో కనెక్ట్ అవటానికి, ప్రతిస్పందనలు తెలియచేయటానికి, షేరింగ్‌ల ద్వారా ప్రచారం చేయటానికే పరిమితమవ్వచ్చు.

ఇలాంటి వారి కోసం వైబీఐ ప్రత్యేకించి కార్యక్రమాన్ని చేపట్టాలి. ఇందులో భాగంగా.. ప్రతి కళాశాలకు వెళ్లి ఒకరిద్దరు లెక్చరర్లు లేదా విద్యార్థి నాయకులకు విషయాన్ని వివరించి వారి మద్దతును తీసుకోవాలి. ఒకరకంగా వారు వైబీఐకి ఆయా విద్యాసంస్థల్లో ఫస్ట్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్‌గా, నోడల్ ఏజెన్సీలా సహాయ పడుతుంటారు. వారి ద్వారా మొత్తం కళాశాల విద్యార్థుల్ని సమావేశపరిచి, జేపీ ట్విట్టర్, ఎఫ్‌బీ ఖాతాలను తెలియచేసి ఎన్‌రోల్ కావాలని అభ్యర్థించాలి. దాదాపు ప్రతి విద్యార్థికీ ఎఫ్‌బీలోనో, మరోదాంట్లోనో సోషల్ మీడియా ఖాతాలు, యాక్టివిటీ ఉన్న రోజులివి. జేపీ లాంటి వారి ఖాతాతో సంధానం కావటం వల్ల వారి కెరీర్‌కు కూడా ఎంతో మేలు జరుగుతుంది. బోలెడన్ని పత్రికల్ని చదివి, టీవీల్ని చూసి బుర్ర ఖరాబు చేసుకోకుండా, గందరగోళపడకుండా.. అవసరమైన అంశాలపై స్పష్టమైన అవగాహనను పెంచుకోవచ్చు. ఈ ప్రయోజనాలన్నిటినీ విద్యార్థులకు వివరంగా తెలియజెప్పాలి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని ప్రతి కళాశాలలో కాస్త చొరవ చూపగల లెక్చరర్లు, విద్యార్థులతో కమిటీలను ఏర్పాటు చేయటానికి, వారి ద్వారా లేదా కొన్ని సందర్భాల్లో నేరుగా కూడా విద్యార్థులను ఎన్‌రోల్ చేసుకోవటానికి వైబీఐ తరపున మంచి టీంలను ఏర్పాటు చేయటం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించాలి. ఈ టీంలు ప్రధానంగా ఎన్‌రోల్‌మెంట్ పని మీదే ఉండాలి. కళాశాలలతోపాటు క్రమంగా ఆయా ప్రాంతాల్లోని యువజన సంఘాలను కూడా భాగస్వాముల్ని చేయాలి. ఇందుకోసం అవసరమైతే ఎన్‌రోల్‌మెంట్ టీంల సంఖ్యను పెంచాలి. కాస్త విశాల ప్రపంచాన్ని చూశాక ఆసక్తి ఉంటే.. ఆ విద్యార్థులు మున్ముందు వైబీఐ కార్యకలాపాల్లో కూడా పాల్గనే అవకాశాల్ని కల్పించాలి. ఇది చాలా సమర్థవంతంగా, దృఢసంకల్పంతో, ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ నిరంతరాయంగా జరగాల్సిన కార్యక్రమం. తొలిదశ లక్ష్యంగా, రెండు రాష్ట్రాల్లో కలిపి కనీసం రెండు లక్షలమందిని ఈరకంగా ఎన్‌రోల్ చేయగలగాలి. ఆ తర్వాత కొత్తగా వచ్చే విద్యార్థులతో, యువతతో ఇంటరాక్ట్ అయి అప్‌డేట్ చేసే పనిని స్థానికంగా ఆయా కళాశాలల్లో అప్పటికే నమోదైన విద్యార్థులకు, చుట్టుపక్కల ఉన్న వైబీఐ బృందాలకు కొంతమేర అప్పగించవచ్చు. జిల్లా, రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ బాధ్యతకు ఎన్‌రోల్‌మెంట్ టీంలు పరిమితం కావచ్చు. ఇలా ప్రతి మొబైల్‌కి, ప్రతి ఇంటికీ 'జేపీ భావజాల గ్రిడ్' నిర్మాణానికి యాప్‌లు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవచ్చు. కానీ మొత్తంగా 'కనెక్ట్ విత్ జేపీ' ప్రోగ్రాంకి ఎప్పటికప్పుడు కొత్త విద్యార్థులు, యువతను వైబీఐలో ఎన్‌రోల్ చేస్తూ వారి ఆసక్తులకనుగుణంగా దిశానిర్దేశం చేసే

కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగించాల్సిన బాధ్యత మాత్రం ఎన్‌రోల్‌మెంట్ టీంలదే. సమన్వయకర్తల సలహాసూచనలతో ఈ బాధ్యతల్ని వారు నెరవేరుస్తుండాలి.

మన శరీరంలోని ఏ ఒక్క భాగం తన బాధ్యతను క్రమపద్ధతిలో నెరవేర్చకపోయినా.. మనం అనారోగ్యం పాలై అవస్థలు పడతాం. అలాగే ఓ ఊరిలో, పట్టణంలో, నగరంలో, రాష్ట్రంలో, దేశంలో పాలకులు, ప్రజలు తమ తమ బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చకపోతే అనారోగ్యకర సమాజం ఏర్పడుతుంది. వదిలేస్తే సంక్షోభం ముదురుతుంటుంది. యువత తమ జీవితాల్ని సుస్థిరాభివృద్ధితో ఆనందంగా గడపటానికి అవసరమైన సామాజిక పనుల్ని చేసేటప్పుడు కూడా ఒక క్రమపద్ధతిని పాటిస్తేనే ఆశించిన ఫలితాలస్తాయి.

పద్ధతి ప్రకారం అంటే.. ఏదో అదనపు భారం మోస్తున్నట్టు భావించనక్కర్లేదు.

ఛాందస సెంటిమెంట్లు, ఫాల్స్ ఇగోలను వదిలించుకుని మెదడును పూర్తిగా వికసింప చేసుకుని, చూడగలిగిన దూరం చూడగలిగితే.. వైబీఐ వేదికలో చేరేవారు ప్రత్యేకించి చేయాల్సిన త్యాగం, కష్టం ఉండదు. రోజువారీ జీవనశైలిలా స్థానిక సమస్యల పరిష్కారంలో, ప్రజాస్వామ్య సంస్కరణల్లో వారు భాగం కాగలుగతారు. నిరంతరం కొత్తవారిని కలుపుకుంటూ కార్యక్రమాల్ని నిర్వహించుకోగలుగారు.

## 8. వ్యక్తిగతంగా, సంఘటితంగా ప్రతి వైబీఐ పాటించాల్సిన, గుర్తుంచుకోవాల్సిన అంశాలు

- వైబీఐ ద్వారా తక్షణ ఆకర్షణీయ ప్రోత్సాహకాలు కనిపించకపోవచ్చు. అవగాహనతో కొంత దూరదృష్టితో చూడగలిగితేనే ఆ లాభం అర్థమవుతుంది. ఈ స్పష్టతను నిరంతరం కలిగివుండాలి.
- వైబీఐ ద్వారా వ్యక్తిగత పైరవీలు, సొంత సమస్యలు చేపట్టకూడదు.
- ప్రభుత్వం నుంచి, అధికారుల నుంచి ప్రత్యేక లబ్ధిని పొందరాదు.
- సాధారణంగా ప్రభుత్వం వ్యక్తిగత లబ్ధిదారులకిచ్చే పథకాలలో వైబీఐ సిఫార్సులు చేయకూడదు. వాటిలో అవినీతి, అన్యాయం, తప్పుడు సమాచారం ఉంటే, ప్రజలకు తెలియకుండా రహస్యంగా నిర్ణయాలు చేస్తుంటే మాత్రం.. వైబీఐ ప్రశ్నించి పరిష్కారం కోసం ప్రయత్నించాలి.
- వైబీఐ ఎట్టి పరిస్థితుల్లోనూ హింసకు దిగకూడదు. ఏ కార్యక్రమమైనా శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, మిగిలిన పౌరులకు అసౌకర్యం లేకుండా ఉండాలి.
- వైబీఐ ఏ పార్టీనిగానీ, నాయకుడు లేదా నాయకురాలినిగాని ప్రత్యేకంగా సమర్థించటం లేదా వ్యతిరేకించటం చేయకూడదు. వైబీఐ.. పార్టీ రాజకీయాల వేదిక కాదు. అయితే పార్టీల రాజకీయ విధానాల గురించి చర్చించవచ్చు. ఓపికుండో, పరిస్థితులు అనుకూలించో వైబీఐలో ఎవరైనా మున్ముందు ఎన్నికలలో పోటీ చేయాలనుకుంటే.. తాత్కాలిక విరామం తీసుకుని, ఎన్నికలయ్యాక తిరిగి వైబీఐ కార్యక్రమాల్ని కొనసాగించవచ్చు.
- ఏ పార్టీకి చెందినవారైనా వైబీఐలో నిబంధనల కనుగుణంగా పనిచేయవచ్చు. కానీ వారికి వైబీఐలో ఎటువంటి పర్యవేక్షణ పదవులూ ఉండవు.
- సొంత సేవాసంస్థలున్నవారు తమ కార్యక్రమాలను చేసుకుంటూనే నిబంధనలకనుగుణంగా వైబీఐ కార్యక్రమాల్లో భాగస్వాములు కావచ్చు.
- వైబీఐ వ్యక్తిగతంగా అవినీతికి దూరంగా ఉండాలి. ప్రజలందరికీ తెలిసేరీతిలో పారదర్శకంగా పనిచేయాలి.
- మీడియాను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ వార్తలు, చర్చలు, వ్యాసాల ద్వారా వైబీఐ భావాల్ని యువతలోకి తీసుకెళ్తుండాలి.
- వైబీఐలో ఏ అంశంపైనైనా బయట లేదా అంతర్గతంగా జరిగే చర్చల్లో హేతుబద్ధత, పరస్పర గౌరవం వంటి ప్రమాణాలను విధిగా పాటించాలి.
- వైబీఐల మధ్య ఆరోగ్యకరమైప పోటీని పెంపొందించే స్పర్థ ఉండొచ్చుగానీ, విద్వేషాలు ఉండకూడదు. పొరపాటున ఎవరైనా

అలాంటివి ప్రదర్శించినా.. సంయమనంతో హేతుబద్ధంగా పద్ధతి ప్రకారం ఎదుర్కోగల, పరిష్కరించుకోగల నాయకత్వ లక్షణాల్ని పెంపొందించుకోవాలి. సెన్సాఫ్ హ్యూమర్‌ను జీవనశైలిలో భాగం చేసుకోవాలి.

- సోషల్ మీడియాలో బహిరంగ చర్చా ప్రమాణాలు చాలా నాసిరకంగా ఉన్నాయి. ఎలిమెంటరీ కామన్‌సెన్స్ లోపిస్తోంది. బూతులు తిట్టుకుంటున్నారు. విచక్షణ లేకుండా గాసిప్‌లను షేర్ చేసేస్తున్నారు. వైబీఐకి సోషల్ మీడియా కీలక మాధ్యమం కాబట్టి.. ఈ మీడియాలో బహిరంగ చర్చ ప్రమాణాలను పెంపొందించటాన్ని ఓ బాధ్యతగా తీసుకోవాలి. ప్రభుత్వానికి–పార్టీకి, పార్టీకి–పాలనకి ఉన్న తేడా లేమిటో వివరించటం, యువత శక్తిని పరిష్కారం దిశగా మళ్లించటం అలుపెరగకుండా చేస్తుండాలి. పుట్టుక (కులం, మతం, ప్రాంతం, భాష, డబ్బు)ను బట్టి కాకుండా.. ఒక వ్యక్తి ద్వారా సమాజానికి జరిగే మేలును బట్టి ఆ వ్యక్తి స్థాయిని అంచనా వేయటాన్ని, గౌరవించటాన్ని అలవరచుకునేలా సాటి యువతకు ఓపిగ్గా చెబుతుండాలి.
- కళాశాలల్లో కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. ఏ కార్యక్రమమైనా సానుకూల దృక్పథంతో ఉండాలి.
- పుస్తకాల అధ్యయనం, ముఖ్యంగా సమాజాన్ని ప్రభావితం చేసే అంశాలను, సమాజం కోసం పనిచేసిన వ్యక్తుల జీవితచరిత్రలను చదవటం, వినటం, మంచి వీడియోలను చూస్తుండటం నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలి.
- కాస్త వయసు మీరిన వారు (సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా) కూడా ఈ కార్యక్రమాల్లో వైబీఐ వారికి సహాయసహకారాల్ని వివిధ రూపాల్లో అందించవచ్చు. యూత్ స్థాయిలో, సిటిజన్స్ స్థాయిలో కూడా ఈ కార్యాచరణను తీసుకోవచ్చు. ఈ స్పేస్‌ని వైబీఐ వాళ్లు అందిస్తూ ప్రయోజనం పొందుతుండాలి.

- చాలా ముఖ్యమైన విషయం.. వైబీఐ ఏమీ ఒలింపిక్ క్రీడ కాదు. మనం సమర్థులమైనంత మాత్రాన మనకు మెడల్ రాదు. అలాగైతే జేపీ ఈ పాటికే ప్రధానమంత్రి అయి నూతన భారతదేశ నిర్మాణాన్ని కూడా సాధించేసి ఉండేవారు. అందరినీ కలుపుకుంటూ, ఈ ఉమ్మడి ప్రయత్నంలో ప్రజానీకంలో ప్రతి ఒక్కరికీ ఉండే ప్రయోజనమేమిటో తెలియచేస్తూ, వారికి అర్థమయ్యే రీతిలో, వారు స్పందించగలిగే అంశాలతో, వారి భాగస్వామ్యంతో స్థానికంగా కార్యక్రమాల్ని నిర్వహించాలి. వైఫల్యాలకు కుంగిపోవాల్సిన పన్లేదు. విఫలమైతే, మరో మార్గంలో ప్రయత్నించాలి. ఈ రకంగానే లోక్‌సత్తా దేశంలో, తెలుగు రాష్ట్రాల్లో పలు కీలక రాజ్యాంగ సవరణల్ని, చట్టాల్ని, విధానపరమైన మార్పుల్ని సాధించింది. కాబట్టి చేపట్టిన కార్యాన్ని వదిలేయకుండా.. మౌలికాంశాల్లో రాజీపడకుండానే కొత్త పద్ధతుల్లో సాధించే ప్రయత్నం చేయాలి. ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ఫలితాల్ని మెరుగుపరచుకుంటూండాలి. అభివృద్ధి చెందిన దేశంగా రూపొంది ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవటానికి భారత్‌కు ఎల్లకాలం అవకాశాలుండవని మర్చిపోవద్దు. మనకున్న యువజనాభా వంటి అడ్వాంటేజ్‌లను వచ్చే పదేళ్లలో పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతే.. ఒక గొప్ప అవకాశం మరోసారి ఇండియా చేజారిపోయే ప్రమాదముంది. ఒక సాదాసీదా వర్థమాన దేశంగానే పడుతూ లేస్తూ కొనసాగాల్సిఉంటుంది. ముడుచుకుపోయిన బతుకుల భారతదేశం స్థానంలో మనం కలలుగంటున్న అగ్రస్థాయి భారతదేశాన్ని నిర్మించాలనుకుంటే.. వైబీఐ కార్యాచరణను మొక్కవోని దీక్షతో కొనసాగించటమే మార్గం.

## 9. ప్రత్యక్ష సమావేశాలకు నిబద్ధతతో హాజరు కావాలి

వైబీఐ వారికి సామాజిక మాధ్యమాల ద్వారా జేపీ రోజూ అందుబాటులో ఉంటారు. ప్రతి నెలా సామాజిక మాధ్యమాల్లో లైవ్ స్ట్రీమింగ్ ద్వారా, ఇతరత్రా కాన్ఫరెన్స్ పద్ధతుల ద్వారా ఆయనతో కాంటాక్ట్‌లోకి రావొచ్చు. మీ సందేహాలను అడుగుతూ కార్యక్రమాలపై స్పష్టతను పెంచుకోవచ్చు. అలాగే నిర్ణీత కాలవ్యవధిలో ప్రతిచోటా వైబీఐ సమన్వయకర్తలు జేపీతో ప్రత్యక్ష సమావేశాల్ని ఏర్పాటు చేస్తారు. మీరు కూడా స్థానికంగా ప్రాముఖ్యత గల కార్యక్రమమైతే, జేపీకి అవకాశముంటే ఆహ్వానించవచ్చు. అయితే.. ఈ సమావేశాల్లో, ముఖ్యంగా జేపీ పాల్గొనే కార్యక్రమాల్లో ఆయా ప్రాంతాల్లోని వైబీఐ వారందరూ విధిగా పాల్గొని తమ నిబద్ధతను చాటుకోవాల్సి ఉంటుంది. ఇది తమ బాధ్యతలో భాగంగా ప్రతి ఒక్కరూ గుర్తించాలి. సామాజిక మాధ్యమాల్లో తరచుగా సమావేశాలు జరుపుకుంటున్నా, ప్రత్యక్ష సమావేశాలకూ ప్రాధాన్యత ఉందని విస్మరించకూడదు. ఏదైనా అనివార్య కారణం వల్ల రాలేకపోతే, ఆ విషయాన్ని వివరంగా బాధ్యులకు తెలియజేయాలి. ఈ క్రమశిక్షణను పాటిస్తేనే, వైబీఐ ఒక శక్తిగా రూపుదిద్దుకుని తెలుగు ప్రజలకు, దేశానికి ఉపయోగపడగలుగుతుంది.

ఈ చిన్న పుస్తకంలో వైబీఐ రోడ్‌మ్యాప్‌కు సంబంధించి కేవలం రేఖామాత్రంగానే వివిధాంశాలను చెప్పటం జరిగింది. వాటి వివరాల్ని 'ఎఫ్‌డీఆర్‌ఇండియాడాటార్గ్'లో చదవొచ్చు, క్రమంగా వైబీఐ సైట్‌లో కూడా పొందుపరచుకోవచ్చు, జేపీతో సమావేశాల ద్వారా తెలుసుకోవచ్చు. ఎన్ని తెలుసుకున్నా.. నిరంతరం అప్‌డేట్‌కి కొద్దిసమయాన్ని మాత్రం కేటాయిస్తుండాలి.

## 10. సెలబ్రిటీ స్టేటస్, సెలబ్రేషన్ ఆఫ్ కెరీర్ అండ్ లైఫ్

మనదేశంలో బయటి పరిణామాలతో మార్పులు రావటం తప్ప రాజకీయ నేతలు తమంతట తాము తెచ్చే మార్పులు తెచ్చే పరిస్థితి కనిపించటం లేదు. నేతలుగా చెలామణి అవుతున్నవారు సమాజాన్ని ఉన్నదున్నట్టే చూస్తూ తాత్కాలిక ప్రయోజనాలనిచ్చే చిన్న మార్పుల్ని మాత్రమే తెస్తున్నారు. అవసరమైన, కీలకమైన మార్పులు ఆచరణయోగ్యమైనవైనా తేవటం లేదు. పెద్ద మార్పుల కోసం ప్రయత్నిస్తే ఎదురుదెబ్బలు తగులుతాయని సాకులు చెబుతూ యథాతథస్థితిని కొనసాగిస్తున్నారు, మోసపూరితంగా తమ అధికార పీఠాల్ని కాపాడుకుంటున్నారు.

ప్రతి సంవత్సరం ఏదో ఒక ఎన్నికలో పాల్గొనే పార్టీలు తమ వ్యూహాలు, తప్పుడు హామీల ఫలితాల్ని విశ్లేషించుకోవడంలోనే బిజీగా ఉండటం తప్ప మార్పుని తెచ్చే బైటి శక్తులు కాలేకపోతున్న తరుణంలో.. రాజకీయ నాయకులకు భిన్నంగా ఉన్న సమాజాన్ని కాకుండా, సమాజం ఎలా ఉండాలీ అన్న అంశంపై వైబీఐ దృష్టి పెట్టాలి. యధాతథ స్థితిని కాకుండా, చేరాల్సిన గమ్యం వైపు చూస్తుండాలి. అప్పుడు తమ సామాజిక (రాజకీయ) నాయకత్వం ద్వారా వ్యవస్థను మార్చగల బాహ్య శక్తులుగా వైబీఐ వాళ్లు ఎదగగలుగుతారు. సామాజిక నాయకులు ధైర్యంగా వ్యవహరించగలరు, సహానుభూతితో దయాభరితంగా స్పందించగలరు. సమాజాన్ని నిర్దేశించగలరు, దాని విశ్వాసాన్ని పొందగలరు. వైబీఐ నాయకుల సంఖ్య ఒక 'క్రిటికల్ స్థాయి' దాటితే అది ఇన్ఫెక్షన్ అవుతుంది. వేగంగా విస్తరిస్తూ ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తుంది. సామాన్య ప్రజలని రాజకీయాలకు అతీతంగా ఉత్తేజపరిచి, ఆదర్శ ఆలోచనల్ని ప్రేరేపిస్తుంది. ఈ చైతన్యంతో సమాజమే రాజకీయాలని నిర్దేశిస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్‌ని పునర్నిర్మించి ధనిక దేశంగా మార్చడంలో ఎన్నికల రాజకీయ నాయకుల కంటే పరిశ్రమలు తదితర రంగాల నుంచి వచ్చిన సామాజిక నాయకులే ప్రధాన పాత్ర పోషించారు.

మనదేశంలో ఈ రోల్‌ని సామాజిక అవగాహన ఉన్న డా॥ జేపీ వంటి నాయకులు పోషిస్తూ, ఇన్‌స్పిరేషన్‌తో మరికొంతమందిని తయారుచేస్తూ ముందుకు నడిపిస్తున్నారు. ఇప్పటికే రెండు లక్షలమందికిపైగా జేపీ ద్వారా వివిధ రూపాల్లో శిక్షణ పొందారు. అందుకే.. తెలుగు రాష్ట్రాల్లో ఏదోకస్థాయి సీరియస్‌నెస్ ఉన్న ప్రతి చోటా లోక్‌సత్తా వాళ్లు తగులుతుంటారు. కానీ ఇది చాలదు. అందుకే, రాబోయే తరాలను తయారుచేసేందుకు కూడా జేపీ తన వంతు బృహత్ ప్రయత్నం చేస్తున్నారు. అందరికీ ఎదిగే అవకాశాలున్న నిజమైన రాజకీయం కోసం నిరంతరం కష్టపడుతున్నారు. జేపీ అవగాహనను, బాధ్యతను వీలైనంత షేర్ చేసుకోవటం, విస్తరించుకోవటం వైబీఐ మొదలుపెట్టాలి. అజరామరమైన జేపీ భావజాలాన్ని భావితరాలకు అందించే వారధిగా మారాలి. సామాజిక రాజకీయ నాయకత్వం వహించేందుకు పెద్దఎత్తున యువత, ఇతర ప్రజలు ముందుకు రావటం ఇప్పుడు దేశహితానికి అవసరం.

'మానవాళి సమస్యల పరిష్కారం గురించి కాకుండా.. కేవలం కొన్ని కులాలు, మతాలు, ప్రాంతాల తాత్కాలిక అవసరాలకు పరిమితమై పనిచేసే భావజాలం గురించి పట్టించుకోవాల్సిన అవసరమే లేదు' అని ఓ చరిత్రకారుడు అంటారు. ప్రపంచీకరణ, విశ్వీకరణ సంక్లిష్టతల మధ్య కూడా.. స్థానిక స్థాయి నుంచి అత్యంత పైస్థాయి వరకూ ప్రతి ఒక్కరి సమస్యల్నీ పరిష్కరించే ఆచరణాత్మక ఎజెండాను జేపీ రూపొందించి వైబీఐకి అందించారు. అందుకే.. కోట్లాది యువత ఆశలకి–వాస్తవ ప్రపంచానికి మధ్య వారధి వైబీఐ. మీ కలల్ని నెరవేర్చగలిగేది వైబీఐ. మీ అంతరాత్మలో, మీ కుటుంబ సభ్యుల గుండెల్లో, మీ చుట్టూ ఉన్న సమాజంలో మీకు శాశ్వత స్థానాన్ని కల్పించగలిగేది వైబీఐ. డబ్బు కంటే కీర్తిప్రతిష్టలతో గుర్తింపు విలువైనది అని చాలామంది ఆలస్యంగా తెలుసుకుంటారు. అందుకే డబ్బు వెదజల్లయినా ఏదోక గుర్తింపు పొందాలనుకుని తాపత్రయ పడుతుంటారు. కానీ ఎవరెన్ని చేసినా.. చరిత్ర నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తుంది. హేతుబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా అన్నిటినీ తూకం వేసి తన పేజీల్లో స్థానాన్ని కేటాయిస్తుంది. చరిత్రకు సరైన పక్షాన మిమ్మల్ని నిలిపే వైబీఐ.. మీరు నిజాయతీతో, సమర్థతతో, వైఫల్యాలకు బెదరకుండా ఓర్పుతో పనిచేస్తే కచ్చితంగా చరిత్రలో మీకంటూ ఓ పేజీని అందిస్తుంది. నడుస్తున్న చరిత్రలా జీవించటం కంటే సెలబ్రిటీ స్టేటస్, సెలబ్రేషన్ ఆఫ్ కెరీర్ అండ్ లైఫ్ ఇంకెక్కడ లభిస్తాయి?

ఆల్ ది వెరీ బెస్ట్ టీం వైబీఐ!

**J**oin & **P**articipate: www.youthforbetterindia.com

for better career

better life

with the best mentor

# భారత్‌కు మిగిలి ఉన్నది పదేళ్లే!

- ఈలోగా సరైన విధానాలుంటే అభివృద్ధి చెందిన దేశం..
- లేకుంటే వర్ధమాన దేశాల జాబితాలోనే కొనసాగటం



అభివృద్ధి చెందిన దేశంగా మారే అవకాశాలు భారత్‌కు ఇంకా పదేళ్లు మాత్రమే ఉంటాయని, ఈలోగా సరైన విధానాలను అమలు చేయకుంటే వర్ధమాన దేశంగానే మిగిలిపోతుందని ఎస్‌బీఐ నివేదిక తెలిపింది. వేగంగా స్పందించి ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోకుంటే.. అధిక యువ జనాభాయే పెద్దసమస్యగా మారుతుందని, ఇక అభివృద్ధి చెందిన దేశంగా మారటం దాదాపు అసాధ్యమని వెల్లడించింది. 'భారత్ అభివృద్ధి చెందిన దేశం అనే ట్యాగ్‌ను సొంతం చేసుకోవటానికి ఇంకా కేవలం దశాబ్ద కాలమే మిగిలి ఉంది. దీన్ని సాధించ లేకపోతే ఎప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశాల సమూహంలోనే ఉండిపోవాల్సి వస్తుంది. అందువల్ల విధానకర్తలు మేలుకొని తగువిధంగా విధానాలను రూపొందించాలి' అని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా ప్రభుత్వం, విధానకర్తలు యువతపై దృష్టి సారించి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించింది.

- యువత ఎక్కువగా ఉన్నందున, వారి అధిక జనాభా నుంచి లబ్ధి పొందేందుకు విద్యపై ఇన్వెస్ట్ చేయాలి.
- విధానాలు సరిగా లేకుంటే.. భారత్‌కు యూత్ జనాభాపరంగా ఉన్న అడ్వాంటేజ్ కనుమరుగవుతుంది. అధిక జనాభా అనుకూలత కాస్తా 2030 నాటికి ప్రతికూలంగా మారుతుంది.
- అధిక జనాభా వృద్ధి గత రెండు దశాబ్దాలుగా ఒకేవిధంగా 18 కోట్లు వద్ద స్థిరంగా ఉండగా.. జనన రేటు ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉంది. ఉదాహరణకు కర్ణాటకనే చూస్తే ఆ రాష్ట్రంలో గత కొన్ని దశాబ్దాలుగా జనన రేటు తగ్గుతూ వస్తోంది. దీంతో మొత్తం జనాభాలో 60 సంవత్సరాలకు పైబడిన వాళ్లు 1971లో 6.1 శాతంగా ఉండగా.. 2011లో 9.5 శాతానికి పెరిగారు. విద్యకు ప్రాధాన్యం పెంచాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

# పెట్రో ఉత్పత్తులను జీఎస్‌టీ పరిధిలోకి తేవాలి



పెట్రో ఉత్పత్తులను వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) పరిధిలోకి తేవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, విజయనగరం జిల్లా అద్దె వాహనాల యజమానులు, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. పెట్రో ధరల హేతుబద్ధీకరణకు చర్యలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరి స్తోందన్నారు. పెట్రో ధరలు పెరిగినప్పుడల్లా వాహనదారులతో పాటు మార్కెట్లో వివిధ వస్తువుల ధరలు కూడా పెరిగి అన్ని వర్గాల ప్రజలూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. పన్నుల దోపిడీలో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా కుమ్మక్కయినట్టు వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా సంఘం సభ్యులతో కలిసి గాంధీ విగ్రహం వద్ద బాబ్జీ నిరసన వ్యక్తం చేశారు. కార్యదర్శి కె.ఎ రాము, బి.ఉమా, చంద్రమోహన్, నర్సింగరావు, లక్ష్మణరావు, సీతారామ్, ఎ.రమేష్, రమణ, ప్రకాష్, కృష్ణ శంకర్రావు, వెంకటేష్, మురళి, అప్పారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు. ❒

# తిలక్ లాంటి వారిని గెలిపించే మౌలిక మార్పుల కోసం యువత పోరాడాలి: జేపీ

ఉత్తమ రాజకీయానికి తొలితరం ప్రతినిధి కందాళ సుబ్రహ్మణ్య తిలక్ అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నివాళులర్పించారు. స్వతంత్ర భారత్‌లో కాంగ్రెస్ వాదిగా కాకుండా, సోషలిస్టు నేపథ్యం నుంచి కందాళ రాజకీయం చేశారని.. కానీ రాజకీయాల్లో విలువలు క్షీణిస్తుండటంతో నిశ్శబ్దంగా తప్పుకున్నారు తప్ప దిగజారలేదని అన్నారు. మొదటి లోక్‌సభకు ఎన్నికయ్యాక మళ్లీ పదవుల కోసం వెంపర్లాడకుండా ఒక పౌరుడిగా నిజాయతీగా, నిరాడంబరంగా జీవిస్తూ సమాజంలో తన పరిధిలో మార్పు కోసం నిశ్శబ్దంగా కృషి చేశారన్నారు. తిలక్, ఆయనతోపాటు లోక్‌సభకు ఎన్నికైన కానేటి మోహన్‌రావుతో లోక్‌సత్తాకు, వ్యక్తిగతంగా తనకూ ఎంతో అనుబంధముందన్నారు.



జులై 2017లో కందాళ సుబ్రహ్మణ్య తిలక్ 98వ జన్మదినోత్సవం సందర్భంగా విశాఖలో ఆయనను పరామర్శించి శుభాకాంక్షల్ని తెలియజేస్తున్న జేపీ, ఇతర లోక్‌సత్తా నేతలు

1952లో తొలి లోక్‌సభకు అత్యధిక మెజారిటీతో ఎన్నికైన స్వాతంత్ర్య సమరయోధుడు కందాళ.. 2014 ఎన్నికల్లో నిలబడి ఉంటే మన రాజకీయ వ్యవస్థలో గెలిచేవారుకాదని జేపీ అన్నారు. 62 ఏళ్లలో ఎందుకిలాంటి దుస్థితి ఏర్పడిందో మనం ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఆనాడున్న విలువలు, ఆనాడున్న రాజకీయంతో.. ఈవేళున్న విలువలు, రాజకీయాన్ని బేరీజు వేసుకోవాలన్నారు. ఎలాంటివాళ్ల వల్ల సమాజానికి మేలు జరుగుతుందో అలాంటివాళ్లను ఎన్నికల్లో తిరస్కరించటం, ఎలాంటి రాజకీయ పద్ధతుల వల్ల దేశానికి నష్టం జరుగుతుందో అలాంటి రాజకీయాన్ని ప్రోత్సహించటం.. ఇప్పుడు జరుగుతోందన్నారు. ఏ దారిన ప్రజల జీవితాలు బాగుపడతాయో, ఏ విధంగా సమాజహితం కోరే సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికవగలరో.. అలాంటి మౌలికమైన మార్పుల కోసం ఇకనైనా పదునైన ఆలోచన, సంఘటిత పోరాటం చేయాలన్నారు. డబ్బు, కుల, వంశపారంపర్య రాజకీయాల్ని బద్దలుకొట్టాలన్నారు. అలాంటి నూతన రాజకీయాన్ని నిర్మించేలా యువతీయువకులకు కందాళ జీవితం స్ఫూర్తినివ్వాలన్నారు. తిలక్ మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు జేపీ ఒక ప్రకటనలో తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, వేణుగోపాల్, ఇతర నేతలు విశాఖపట్నంలో కందాళ తిలక్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

*("రాజకీయాలలో డబ్బు ప్రభావం అధికమైంది. స్వాతంత్ర్యం సాధించిన రోజులలో నేతల్లో డబ్బు సంపాదించాలనే ఆసక్తి ఉండేది కాదు. దేశ సమస్యలపైనే దృష్టి కేంద్రీకరించేవారు. దేశం బాగుపడాలంటే ముందు గ్రామాలు సుభిక్షమవ్వాలి. విద్యాసౌకర్యాలు కల్పించాలి. గ్రామాలలో ఇప్పటికీ సరైన విద్య అందటం లేదు. ఉపాధ్యాయులు సరిగా పాఠశాలలకు హాజరుకావటం లేదు. నేతలు ఈ పరిస్థితులలో మార్పు తీసుకురావాలి. మద్యం వల్ల గ్రామాలు ధ్వంసం అయిపోతున్నాయి. అవినీతినిర్మూలనకు లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్, అన్నాహజారే పోరాటం చేస్తున్నారు. అవినీతిని అంతం చేయాలంటే అవినీతిపరుల ఆస్తుల్ని జప్తుచేయాలని, ఎంతటివారినైనా జైలుకు పంపాలని, పదవుల నుంచి తొలగించాలని*

*లోక్‌సత్తా జేపీ ఎప్పటినుంచో గట్టిగా చెబుతున్నాడు. అలా జరగాలి. ప్రతి ఒక్కరూ లంచాలు తీసుకోమూ, ఇవ్వమూ అని ప్రతిజ్ఞచేసి అమలు చేయాలి. తమ ఓట్లను డబ్బుకు తాకట్టుపెట్టకుండా ప్రజలు నిజాయతీగా ఓటు వేస్తే 2014 ఎన్నికల నుంచైనా మార్పు వస్తుంది. ఎన్నికల్లో నిలబడటానికి డబ్బులు విపరీతంగా ఖర్చుచేస్తున్నారు. అందుకు దోచుకున్న, దాచుకున్న సొమ్మును పెట్టుబడిగా పెట్టి, మళ్లీ సంపాదించుకుంటున్నారు. విదేశానికి చెందిన మదర్ థెరిస్సా... తన జీవితాన్ని త్యాగం చేసి మనదేశ ప్రజలకు సేవలందించారు. అదే స్ఫూర్తితో మన ప్రజాప్రతినిధులు కూడా పనిచేయాలి. పార్టీ రహిత సమాజం రావాలి".*

**– భారత పార్లమెంటు వజ్రోత్సవం (మే 13, 2012) సందర్భంగా**
**ఓ కార్యక్రమంలో కందాళ సుబ్రహ్మణ్య తిలక్)** ❐

# తిలక్ పేరు పెట్టి వెంటనే ప్రారంభించండి



విజయనగర పట్టణ ప్రవేశ మార్గంలో నూతనంగా నిర్మించిన వంతెనకు తొలి పార్లమెంటు సభ్యుడు, రాజకీయాలకు వన్నె తెచ్చిన నేత కందాళ సుబ్రహ్మణ్య తిలక్ పేరును పెట్టి వెంటనే ప్రారంభించాలని లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేసింది. పట్టణంలో ట్రాఫిక్ రోజురోజుకీ పెరిగిపోతున్నా, వంతెన పూర్తయి నెలలు దాటినా ఎందుకు ప్రారంభించలేదో అర్థం కావటం లేదని లోక్‌సత్తా నేతలు మొల్లేటి చిన్నారావు, తాత్రాజు రాజారావు అన్నారు. కార్యకర్తలతో కలిసి వారు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పతివాడ చంద్రారావు, లెంక లక్ష్మణరావు, రొక్కం గురునాథం, శిమ్మ శ్రీను, బోర రమేష్, ఆదీశ్వరరావు, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటులో సైతం.. మంచి చదువు బాధ్యత ప్రభుత్వానిదే



రాయదుర్గం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరమణ బాబు ఎఈవో నాగమణికి విజ్ఞప్తి చేశారు. సరైన విద్యనందించటంలో ప్రభుత్వం విఫలమవటం వల్లే ప్రైవేటు స్కూళ్లు పెరిగాయని, ఇప్పటికిప్పుడు వాటిని తొలగించలేమని, అయితే అవి కనీస ప్రమాణాలతో మంచి చదువును అందించేలా చేయటం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. విద్యాహక్కు చట్టంలోని లసుగుల్ని అడ్డం పెట్టుకుని ప్రైవేటు స్కూళ్ల నుంచి లంచాలు గుంజి అనుమతులిస్తున్నారని, పేద విద్యార్థులకన్నా అవినీతి అధికారులకు ఈ చట్టం బాగా ఉపయోగపడుతోందని అన్నారు. లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు హనుమప్ప, గంగప్ప, బుజ్జి తదితరులు పాల్గొన్నారు. ❐

# కేశవరావ్ సామాజిక క్రియాశీలత యువతకు ఆదర్శం

ప్రముఖ సోషలిస్టు నేత ప్రొఫెసర్ కేశవరావ్ జాదవ్ మృతి పట్ల లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సోషలిజానికి భారత్‌లో ఇచ్చిన పిచ్చి నిర్వచనం వల్ల కొన్ని తరాలపాటు దేశం ఎంతో నష్టపోయిందని- విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన సక్రమంగా ఉంటేనే ఎదిగే అవకాశాలు అందరికీ సమానంగా లభిస్తాయని లోక్‌సత్తా చేసిన వాదన పట్ల ఆయన ఏకీభవించేవారని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా.. ప్రజలకు అవసరమైన పలు అంశాల పట్ల చర్చించేవారన్నారు. కేశవరావ్ జాదవ్ సామాజిక క్రియాశీలత, ప్రజాస్వామిక నిబద్ధత, బహుముఖ ప్రజ్ఞ యువతకు ఆదర్శమని నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు, మిత్రులకు ప్రగాఢ సంతాపాన్ని జేపీ తెలియజేశారు.

# దీక్షలాపి పాలనాదక్షత చూపండి బాబూ!

రాష్ట్రంలో పాలన.. దీక్షలతో కాలక్షేపంలా మారిందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. పరిపాలనా దక్షుడని 2014లో ప్రజలు చంద్రబాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారని, అయితే ఆయన దీక్షాదక్షుడిగా మారిపోయారని ఎద్దేవా చేశారు. నవనిర్మాణ దీక్ష పేరుతో రోజుల తరబడి ప్రభుత్వోద్యోగులతో కార్యక్రమాల్ని నిర్వహించటం వల్ల ప్రజలు నానాఇబ్బందులు పడ్డారని విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ బాబ్జీ అన్నారు. తెలుగుదేశం పార్టీ కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. మరోవైపు రాష్ట్రంలోని 12,958 గ్రామ పంచాయతీల్లో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, జన్మభూమి కమిటీల పేరుతో ఏర్పాటు చేసిన అధికార పార్టీ కమిటీలు ప్రజల్ని వేధిస్తున్నాయని అన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన జన్మభూమి కమిటీల పెత్తనం ఇంత దారుణంగా ఉంటే.. స్థానికంగా ఎవరో ఒకరు ఇబ్బంది పెడితే పట్టించుకోవద్దని ముఖ్యమంత్రి సర్దిచెప్పే ప్రయత్నం చేయటం సిగ్గుచేటన్నారు. సెలవల్లోనైనా విద్యను బాగు చేసే ప్రయత్నం చేయలేదని, అధ్వాన్న బోధన, మౌలిక వసతుల మధ్యే పాఠశాల నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైందన్నారు. రెవెన్యూలో అనేక కుంభకోణాలు జరుగుతున్నాయని, విశాఖలో భూకుంభకోణం మీద 'సిట్' నివేదికను రహస్యంగా ఉంచటంపై అనుమానాలు పెరుగుతున్నాయని అన్నారు. ఇకనైనా అబద్ధాల చుట్టూ ప్రచారజపం ఆపి, పాలన మీద దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రికి భీశెట్టి సూచించారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నేతలు బండారు పూర్ణచంద్రరావు, రవితేజ, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇది రైతులు, వినియోగదారుల విజయం



గడచిన 19 సంవత్సరాలుగా విజయనగరం జిల్లాకే తలమానికంగా ఉన్న ఆర్ అండ్ బీ రైతుబజారుని ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబోమని కలెక్టర్ ప్రకటించటం పట్ల లోక్‌సత్తా నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఇది రైతులు, వినియోగదారుల విజయమన్నారు. రోడ్డు విస్తీర్ణం పేరుతో అధికారులు యాగీ చేస్తుంటే, తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్ని రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాలను సమీకరించి ఆందోళనలు నిర్వహించారని, ప్రజాప్రతినిధులను, ఉన్నతాధికారులను సమన్వయం చేసుకుంటూ హేతుబద్ధ వాదనలతో ఒప్పించి రైతుబజారును పరిరక్షించారని లోక్‌సత్తా నియోజకవర్గ, పట్టణ అధ్యక్షులు అల్లంశెట్టి నాగభూషణం, మొల్లేటి చిన్నారావు (నాయుడు) అన్నారు. రోడ్డు విస్తరణకు భంగం కలగకుండానే, రైతుబజారును కొనసాగించేలా లోక్‌సత్తా చేయగలిగిందన్నారు. రైతుబజారులో రైతులు, వినియోగదారులతో వారు ఈ సందర్భంగా సమావేశమయ్యారు. పార్టీ పట్టణ కార్యదర్శి తాత్రాజు రాజారావు, రొక్కం గురునాథం, లెంక లక్ష్మణరావు, పెంటబాబు, శిమ్మ శ్రీను, రైతులు నాయుడు, గౌరి, లక్ష్మి, శ్రీను, సత్యనారాయణ, ఎర్రినాయుడు, అప్పలకొండ, సత్యవతి, పలువురు వినియోగదారులు పాల్గొన్నారు. ❐



# యువత వెనకబడటం వల్లే.. పాలకుల ఆటలు సాగుతున్నాయి

## 'స్థానిక ప్రభుత్వాల నుంచి ఎదగండి.. దేశాన్ని మార్చండి': యువ ప్రభంజనంలో జేపీ పిలుపు

**'యు**వతా మేలుకో.. ఈ దేశాన్ని ఏలుకో' నినాదంతోనే 22 ఏళ్ల క్రితం రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించానని, ఇప్పుడు కూడా అదే నినాదాన్ని సాకారం చేయాలని పిలుపునిస్తున్నానని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. దేశాభివృద్ధికి కీలకమైన విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, యువజనం సమస్యల పరిష్కారంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారని, ప్రగల్భాలు పలకటంలో, ప్రచారం చేసుకోవటంలోనే ముందున్నారని ధ్వజమెత్తారు. దేశాన్ని, రాష్ట్రాన్ని ఎదిగేలా చేయాలన్న తపనలేని రాజకీయం నడుస్తోందని, కేవలం పెత్తనాల కోసమే వారు రాజకీయం చేస్తున్నారన్నారు. జనం జీవితాలతో సంబంధం లేని పాలన ఇప్పుడు నడుస్తోందన్నారు. జనాభాలో అత్యధికులుగా ఉన్న యువత సమస్యల పరిష్కారంలో వెనకబడిపోవటం వల్లే పాలకులు ఆడింది ఆట, పాడింది పాటగా సాగిపోతోందన్నారు. మౌలిక సమస్యల పట్ల అవగాహనతో యువత రాజకీయాల్ని పట్టించుకుంటేనే ఆ బుద్ధిలేని రాజకీయాలకు అడ్డుకట్ట వేయగల మన్నారు.

యంగ్‌లీడర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా చివుళ్లపల్లిలో జరిగిన 'యువ ప్రభంజనం' బహిరంగసభలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కులమతాలు, పార్టీలకు అతీతంగా యువత కలిసి భారీ బహిరంగసభను నిర్వహించటం వారిలోని నాయకత్వ లక్షణాలను ప్రతిబింబిస్తోందని జయప్రకాష్ నారాయణ్ అభినందించారు. నిజమైన అభివృద్ధికి పనికిరాని ఉత్సవవిగ్రహాలైన పెత్తందార్లు, నేతల చేతుల్లో నుంచి అధికారాన్ని కైవశం చేసుకోగలిగే స్థాయికి యువనాయకులు ఎదగాలన్నారు. పార్టీలు సీట్లు నిర్ణయించే రోజులుపోయి.. ప్రాథమిక ఎన్నిక (ఓపెన్ ప్రైమరీ) ద్వారా అభ్యర్థులను ఎన్నుకునే కాలం రావాలన్నారు. ఇలా ఎన్నికైన యువ నేతల చేతుల్లోనే దేశ భవిష్యత్తు భద్రమన్నారు. రాష్ట్రం, దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్ని గుర్తించి పరిష్కారాలను అర్థం చేసుకుని యువత కార్యాచరణ చేపట్టాలన్నారు.

వ్యవసాయం గురించి అందరూ మాట్లాడుతున్నారని, కానీ ప్రభుత్వ విధానాల వల్ల గత నాలుగేళ్లలో మనదేశంలో వ్యవసాయ ఎగుమతులు 10 బిలియన్ డాలర్ల మేర తగ్గి, అదే స్థాయిలో దిగుమతులు పెరగటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని జేపీ తెలిపారు. ఏడాదికి రూ.1,40,000 కోట్ల మేర రైతులకు నష్టం చేసే విధానాలను మార్చకుండా.. రైతులకేదో చేస్తున్నట్టు మొసలి కన్నీరు సానుభూతి కురిపించటం వల్ల ఉపయోగమేంటని ప్రశ్నించారు. అలాంటి మోసాలను గుర్తించి వ్యవసాయ విధానాల్లో మార్పు కోసం యువత కదలాలన్నారు. సరైన

పరిష్కారాలతో ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని రైతులు గుర్తించాలన్నారు.

పరిష్కారాలు, మార్పులు కోసం ఎవరినో అడుక్కోవాల్సిన అవసరం లేదని, తమ కోసం తమ వంతుగా ప్రతివారూ ముందుకొచ్చి పోరాడాలని జేపీ అన్నారు. ప్రస్తుతం ప్రగల్భాలు, ప్రచారం, పెత్తనాలు, అవినీతిలో మనం టాప్‌లో ఉన్నామని, జనానికి నిజంగా పనికొచ్చే విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉపాధి, యువత విషయాల్లో అధమస్థానాల్లో ఉన్నామని అన్నారు. జనం జీవితాల్ని మార్చే ఎజెండా కోసం పోరాడటం వల్ల యువతకే ఎక్కువ లాభమని, ఈవేళ తాను చెబుతున్న ప్రతి మార్పు వల్లా రాబోయే తరాలే ఎక్కువ లబ్ధి పొందుతాయని, అందువల్ల తమ ప్రయోజనాల కోసం యువత సంఘటితమై ఒక క్రమపద్ధతిలో కార్యక్రమాల్ని చేపట్టాలన్నారు. జలగం వెంగళరావు సర్పంచ్ స్థాయి నుంచి మొదలై జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా, చివరికి ముఖ్యమంత్రిగా ఎదగగలిగారని, సమర్థవంతమైన నాయకునిగా సేవలందించారని గుర్తుచేశారు. స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో యువత పెద్దసంఖ్యలో పోటీచేసి సర్పంచులుగా గ్రామాభివృద్ధికి తోడ్పడితే దేశ రాజకీయాలను మార్చటానికి కావలసిన నైపుణ్యాలు పట్టుబడతాయన్నారు. సరైన యువ నాయకత్వం వహిస్తే, దేశం బాగుపడుతుందన్నారు. ఇతర ప్రజానీకం కూడా ముందుచూపుతో ఆలోచించి యువతకు పట్టం కట్టేందుకు ముందుకు రావాలన్నారు.

ఈ సభ నుంచే యువనాయకత్వం పెద్దఎత్తున రావాలని జేపీ కోరారు. యంగ్‌లీడర్స్ సభను అడ్డుకోవటానికి ప్రయత్నించటాన్ని తప్పుపట్టారు. 'సభకు అనుమతి ఇవ్వబోమని చెప్పారట, ఎవడి బాబుగాడి సొమ్మని అనుమతివ్వరు?' అని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (డి) ప్రకారం.. శాంతి యుతంగా ఎక్కడైనా సమావేశమయ్యే హక్కు ప్రజలకుందని, దీన్ని అడ్డుకునే అధికారం ఎంత మెజారిటీ ఉన్న పాలకులకైనా ఉండదని అన్నారు. యంగ్‌లీడర్స్ రిజిస్ట్రేషన్ రద్దు ప్రయత్నాల్ని ప్రస్తావిస్తూ, సంస్థలను ఏర్పాటు చేసుకునే హక్కును కూడా రాజ్యాంగం కల్పించిందని, ఏ చవట దాన్ని రద్దు చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థ దేశద్రోహం, అవినీతి, అనైతిక కలాపాలు చేస్తున్నట్టు నిర్దిష్ట ఆధారాలుంటేనే చర్యలు తీసుకోవాలి తప్ప.. ఇష్టమొచ్చినట్టు హుకుం జారీ చేసే అధికారం ప్రభుత్వాలకు లేదన్నారు. యువత కలసికట్టుగా గొంతెత్తి తమ ప్రభావాన్ని సమాజంపై చూపాలని పిలుపునిచ్చారు.

యంగ్‌లీడర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో యువత పోషించిన పాత్ర కీలకమైందని, యువ సూర్యకిరణాలను ఎవరూ ఆపలేరని అన్నారు. రాష్ట్రంలో 70వేల మంది ఉద్యమకారులున్నారని, కొత్త రాష్ట్రం వచ్చినా వారిలో ఏ ఒక్కరికీ న్యాయం జరగలేదని అన్నారు. ఏ రంగంలో చూసినా దేశ జనాభాలో 65 శాతం గా ఉన్న యువతదే పైచేయిగా ఉందన్నారు. తాండూరులో పురుడు పోసుకున్న యంగ్‌లీడర్స్ జిల్లా నుంచి దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకుంటోందన్నారు. కొందరు ఓర్వలేక చివరిక్షణం వరకూ ఇబ్బందులకు గురిచేసినా హైకోర్టుకు వెళ్లి అనుమతుల్ని తెచ్చుకున్నామన్నారు. ప్రజాసేవ కోసం తన జీవితాన్ని అంకితం చేస్తున్నానన్నారు. ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా పెనుమార్పుల కోసం యువరక్తాన్ని రాజకీయాల్లోకి తేవటం ఖాయమన్నారు. రాజకీయాలను మార్చి మంచి పాలన అందించాలనుకునే యువతకు అండగా నిలుస్తామన్నారు.

యంగ్‌లీడర్స్ సభను అడ్డుకునేందుకు కుట్రలు, బెదిరింపులు, బుజ్జగింపులు చేశారని.. కానీ వాటిని అధిగమించి జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి యువత సభకు హాజరుకావటం సంతోషకరంగా ఉందని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు పటోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు.

యువత, మహిళలు పెద్దసంఖ్యలో రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని ఎన్సీపీ ప్రతినిధి మేఘన అన్నారు.

కార్యక్రమంలో బీజేవైఎం జాతీయ కార్యదర్శి అనూఫ్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఛైర్మన్ జనార్థన్‌రెడ్డి, ఢిల్లీ ఆమ్‌ఆద్మీ పార్టీ నేత అంకిత్‌లాల్, న్యాయవాది రచనారెడ్డి, దివ్య అడుపు, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ లెనిన్‌కుమార్, మౌంటెనీర్ ఆనంద్‌కుమార్, ఎంవీఎఫ్ జాతీయ కార్యదర్శి ఎం.వెంకట్‌రెడ్డి, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైల్ రెడ్డి, యంగ్‌లీడర్స్ నాయకులు విజయ్, విక్రమ్, నిఖిల్, మురళి, సౌజన్య, ఓయూ విద్యార్థి, సైకాలజిస్ట్ బైరి నరేష్, ఆయా సంఘాల బాధ్యులు రాంచందర్, జగదీష్, కల్కోడ నర్సిమ్ములు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యువనాయకులు పాల్గొన్నారు. ❑





# # Support LOCAL COURTS for WOMEN SAFETY

## (మహిళల భద్రత కోసం తక్షణం 'స్థానిక కోర్టుల్ని' ఏర్పాటు చేయాలి)

'షీ టీమ్' లను ఏర్పాటు చేసినా, చట్టాలను కఠినతరం చేసినా తెలుగు రాష్ట్రాల్లో మహిళలు, బాలికలపై అత్యాచారాలు ఆగడం లేదు. చాలా సందర్భాల్లో దోషులకు శిక్షలు కూడా పడకపోవడంతో నేరస్తులు ఇంకా రెచ్చిపోతున్నారు.

మహిళలపై వేధింపుల దశలోనే వేగంగా కేసుల్ని విచారించి, కొద్దిరోజుల వ్యవధిలోనే చిన్న శిక్షలతో చర్యలు తీసుకునే ఏర్పాటు ఉంటే... అత్యాచారాల దాకా తెగించే ధోరణులు గణనీయంగా తగ్గుతాయి. తోటకూర దొంగతనంనాడే బుద్ధి చెప్పినట్టవుతుంది. ఇందుకోసం 'స్థానిక కోర్టుల్ని' ఏర్పాటు చేయటం అవసరం.

మహిళల భద్రతకు ఎంతో ఉపయోగపడే 'స్థానిక కోర్టుల్ని' ఏర్పాటు చేయటానికి అవసరమైన 'గ్రామ న్యాయాలయాల' చట్టాన్ని 2008-09లోనే లోక్‌సత్తా సాధించింది.

గ్రామన్యాయాలయాల చట్టం ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వెంటనే స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేయాలి.

దేశవ్యాప్తంగా 5,000 స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేస్తే... భారత్‌లో కూడా అత్యాచారాల నిరోధానికి ఓ పటిష్ట మార్గం ఏర్పడుతుంది. ఈ కోర్టుల ద్వారా ఇతరత్రా చిన్న చిన్న కేసుల్లో కూడా తీర్పులు వెంటనే వెలువడుతూ సామాన్య ప్రజలకు తేలిగ్గా, చవగ్గా న్యాయం అందుబాటులోకి వస్తుంది. స్థానిక కోర్టులు + ఇతర కొన్ని సంస్కరణలతో చట్టబద్ధపాలన బలోపేతమై మహిళలు, బాలికల భద్రతకు భరోసా ఏర్పడుతుంది.

(Share this message widely.
Details at: http://www.fdrindia.org/judicial-reforms/)

Posting Date 07-07-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on July 1st, 2018

# 'భారత్‌లో రాజకీయ సంస్కరణల అవసరం, అవకాశం'పై ఢిల్లీ యూత్ క్యాంప్‌లో జేపీ





ఐఐటీలు, ఐఐఎంలు, ఇతర అత్యుత్తమ విద్యాసంస్థల నుంచి వచ్చే యువతకు విధానాలు, పరిపాలనపై అవగాహన పెంచేందుకు, ఆధునిక భారత నిర్మాణంలో వారిని సాధికార భాగస్వాముల్ని చేసేందుకు విజన్ ఇండియా ఫౌండేషన్ ఢిల్లీలో నిర్వహించిన శిక్షణా శిబిరంలో 'భారత్‌లో రాజకీయ సంస్కరణల అవసరం, అవకాశం'పై ఆలోచనల్ని పంచుకుంటున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్!

**Book-Post**
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad